SAPTHAGIRI (TELUGU)
SPIRITUAL ILLUSTRATED MONTHLY
Volume:55, Issue: 06
November - 2024, Price Rs.20/-.

తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక

నవంబరు 2024
వెల రూ. 20/-
పుటలు - 56



వాత్సల్యశీలసులభత్వదయాక్షమాద్యైః
కల్యాణనిర్మలగుణైః శ్రితరక్షణాద్యైః ।
సర్వస్య జంతునివహస్య శరణ్యభూతాం
శ్రీవేంకటేశమహిషీం శ్రియ మాశ్రయామః ॥

తిరుచానూరు,
శ్రీపద్మావతీఅమ్మవారి బ్రహ్మోత్సవాలు
(28-11-2024 నుండి 06-12-2024 వరకు)



తిరుమల శ్రీవారి సాలకట్లబ్రహ్మోత్సవాల
సందర్భంగా 04-10-2024న
శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించిన
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌరవముఖ్యమంత్రి
శ్రీ నారాచంద్రబాబు నాయుడు దంపతులు



తిరుమల శ్రీవారి ఆలయంలో 04-10-2024న
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌరవముఖ్యమంత్రి శ్రీ నారాచంద్రబాబు నాయుడు దంపతులకు
శ్రీవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆం.ప్ర. రాష్ట్ర దేవదాయశాఖ మంత్రివర్యులు
గౌ॥ శ్రీ ఆనం రామనారాయణ రెడ్డి, తి.తి.దే. కార్యనిర్వహణాధికారి
శ్రీ జె.శ్యామల రావు, ఐ.ఏ.ఎస్., తి.తి.దే. అదనపు కార్యనిర్వహణాధికారి
శ్రీ సి.హెచ్.వెంకయ్య చౌదరి, ఐ.ఆర్.ఎస్. గార్లు





05-10-2024న వకుళమాత కేంద్రీయ వంటశాల(తిరుమల)ను ప్రారంభిస్తున్న
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌరవముఖ్యమంత్రి శ్రీ నారాచంద్రబాబు నాయుడు గారు.
ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆం.ప్ర. రాష్ట్ర దేవదాయశాఖ మంత్రివర్యులు
గౌ॥ శ్రీ ఆనం రామనారాయణ రెడ్డి మరియు
తిరుపతి ఎం.ఎల్.ఏ. శ్రీ ఆరణి శ్రీనివాసులు మరియు తి.తి.దే. ఉన్నతాధికారులు





04-10-2024న తి.తి.దే. 2025 సం॥ నూతన క్యాలెండర్లు, డైరీలను ఆవిష్కరించిన
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌరవముఖ్యమంత్రి శ్రీ నారాచంద్రబాబు నాయుడు గారు,
ఆం.ప్ర. రాష్ట్ర దేవదాయశాఖ మంత్రివర్యులు గౌ॥ శ్రీ ఆనం రామనారాయణ రెడ్డి గారు
మరియు తి.తి.దే. ఉన్నతాధికారులు





02-10-2024న తిరుమల శ్రీవారిని దర్శించుకుని, తిరుమలలో
మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో భోజనం చేస్తున్న
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌరవ ఉపముఖ్యమంత్రి శ్రీ కొణిదెల పవన్ కల్యాణ్ గారు
మరియు తిరుపతి ఎం.ఎల్.ఏ. శ్రీ ఆరణి శ్రీనివాసులు గారు



# గీతాశ్లోకార్థసారం

**శ్లో : వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరోఽపరాణి**
**తథా శరీరాణి విహాయ జీర్ణా న్యన్యాని సంయాతి నవాని దేహీ॥**

(శ్రీమద్భగవద్గీత 2వ అధ్యాయం-22వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** నరః= మనుజుడు; జీర్ణాని= శిథిలాలైన(చినిగిపోయిన); వాసాంసి= వస్త్రాల్ని; విహాయ= విడిచి; అపరాణి= ఇతరాలైన; నవాని(వాసాంసి)= క్రొత్తవస్త్రాలను; యథా= ఏ ప్రకారంగా; గృహ్ణాతి= గ్రహిస్తున్నాడో, తథా= ఆప్రకారంగానే; దేహీ= ఆత్మ; జీర్ణాని= శిథిలాలైన; శరీరాణి= దేహాలను; విహాయ= విడిచి; అన్యాని= ఇతరాలైన; నవాని(శరీరాణి)= కొత్తశరీరాలను; సంయాతి= పొందుతున్నాడు.

**భావం:** చినిగిపోయిన పాతబట్టల్ని విడిచి మనుజుడు ఇతర కొత్తబట్టలనెలా ధరిస్తున్నాడో, అట్లే దేహి అయిన ఆత్మ కూడా శిథిలాలైన పాతశరీరాలను వదలి ఇతరాలగు కొత్తశరీరాల్ని ధరిస్తున్నాడు.

---

## శ్రీ విభుప్రతినిధివి....

నీవేకా చెప్పఁజూప నీవె నీవెకా
శ్రీవిభుప్రతినిధివి సేనమొదలారి

నీవేకా కట్టెదుర నిలుచుండి హరివద్ద
దేవతలఁ గనిపించే దేవుఁడవు
యేవంక విచ్చేసినాను యిందిరాపతికి నిజ
సేవకుఁడవు నీవెకా సేనమొదలారి

పసిఁడిబద్దలవారు పదిగోట్లు గొలువ
దెసలఁ బంపులువంపే ధీరుఁడవు
వసముగా ముజ్జగాలవారి నిందరిని నీ
సిసువులఁగా నేలిన సేనమొదలారి

దొరలైన యసురుల తుత్తుమురుసేసి జగ
మిరవుగా నేలితి వేకరాజ్యమై -
పరగుసూత్రవతీపతివై వేంకటవిభు -
సిరుల పెన్నిధి నీవే సేనమొదలారి

(అధ్యాత్మ సంకీర్తన; సంపుటం-01; సంకీర్తన-255)



శ్రీమన్నారాయణునికి ప్రతినిధిగా, సైన్యాధ్యక్షునిగా అందరికీ ఆజ్ఞలు ఇవ్వడం, పనులు చూపించడం చేసేది నీవే కదా! అంటూ విష్వక్సేనుని కొనియాడుతున్నాడు పదకర్త.

శ్రీహరికి దగ్గరగా ఎట్టఎదుట నిలబడి దేవతలను కనిపెట్టే దేవుడవు. నీ ఆజ్ఞతోనే వారికి శ్రీహరి దర్శనం. ఇందిరాపతి అయిన శ్రీమహావిష్ణువు ఏదిక్కు నుండి ఎప్పుడు వచ్చినా నీవేకదా ఆతని సేవకుడవు. పైగా సైన్యాధ్యక్షుడివి.

బంగారు బెత్తాలు ధరించిన పదికోట్లమంది నిన్నుకొలుస్తూ ఉండగా - ఎవరెవరిని ఏయే దిక్కులకు ఏయే పనులమీద పంపాలో చూచే ధీరుడవు నీవే కదా! మూడు జగాలలో వారినీ నీ వంశంలో ఉంచుకుంటావు. కానీ వారిని శిశువులుగా భావించి ప్రేమతో పాలించే సేనాధిపతివి.



పాలకులమని విఱ్ఱవీగే రాక్షసులను తునాతునకలుగా చేసి ఈ జగాలను క్షేమంకరంగా ఏకరాజ్యంగా ఏలావు. అంతా శ్రీహరి సామ్రాజ్యమే. రాక్షసాధిపత్యం లేకుండా చేశావు. నీవు సూత్రవతీదేవి పతివై, వేంకటవిభుని సిరులరక్షకుడవై విరాజిల్లుతున్న ధీరసైన్యాధ్యక్షుడవు - విష్వక్సేనుడవని అన్నమయ్య. శ్రీవేంకటేశుని ప్రతినిధి, సూత్రవతీదేవిపతి అయిన విష్వక్సేనుని పై సంకీర్తనలో అన్నమయ్య వర్ణించాడు.











తిరుమల తిరుపతి దేవస్థానములు

# శ్రీపద్మావతీఅమ్మవారి బ్రహ్మోత్సవాలు

## తిరుచానూరు

| తేదీలు | వారం | పగలు ఉత్సవం | రాత్రి ఉత్సవం |
|---|---|---|---|
| 27-11-2024 | బుధ | లక్షకుంకుమార్చన | సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణం |
| 28-11-2024 | గురు | తిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహణం | చిన్నశేషవాహనం |
| 29-11-2024 | శుక్ర | పెద్దశేషవాహనం | హంసవాహనం |
| 30-11-2024 | శని | ముత్యపుపందిరివాహనం | సింహవాహనం |
| 01-12-2024 | ఆది | కల్పవృక్షవాహనం | హనుమద్వాహనం |
| 02-12-2024 | సోమ | పల్లకీ ఉత్సవం, సా॥వసంతోత్సవం | గజవాహనం |
| 03-12-2024 | మంగళ | సర్వభూపాలవాహనం స్వర్ణ రథోత్సవం | గరుడవాహనం |
| 04-12-2024 | బుధ | సూర్యప్రభవాహనం | చంద్రప్రభవాహనం |
| 05-12-2024 | గురు | రథోత్సవం | అశ్వవాహనం |
| 06-12-2024 | శుక్ర | పల్లకీ తిరుచ్చి ఉత్సవం, తీర్థవారి అవభృథం, చక్రస్నానం, పంచమీతీర్థం | తిరుచ్చి ఉత్సవం, ధ్వజావరోహణం |



తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 55 నవంబరు, 2024 సంచిక : 06



వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి ॥

గౌరవ సంపాదకులు
శ్రీ జె.శ్యామలరావు, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు
డా॥ కె.రాధారమణ, ఎం.ఏ.,ఎం.ఫిల్.,పిహెచ్.డి.,

సంపాదకులు
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

ఉపసంపాదకులు
డా॥ కంపల్లె రవిచంద్రన్,
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

ముద్రాపకులు
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

ఫోటోలు
శ్రీ పి.ఎన్.శేఖర్, చీఫ్ ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు
సంపాదకులు -0877 -2264360
కార్యాలయం -0877 -2264543
0877 -2264359

విడి ప్రతి : రూ. 20/-
సంవత్సర చందా : రూ. 240/-
జీవితచందా (12 సం॥లకు) : రూ. 2400/-
విదేశాలకు సం॥చందా : రూ. 1030/-

వెబ్‌సైట్- ttdevasthanams.ap.gov.in;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన
సలహాలు / సూచనలు / ఫిర్యాదులు-
sapthagiri.helpdesk@tirumala.org;
ద్వారా తెలియజేయవచ్చు.

24 గంటలూ పనిచేసే ఈ క్రింది
తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్‌నెంబర్లకి ఫోన్ చేసి
తి.తి.దే.కి సంబంధించిన సమస్తసమాచారాన్ని
మీరు తెలుసుకోవచ్చు.

0877 2277777 / 2233333

## ఈ నెలలో....

| | | |
|---|---|---|
| శేషశైలావాస... శ్రీవేంకటేశా! | డా॥ కంపల్లె రవిచంద్రన్ | 07 |
| సందేహాలు-సమాధానాలు | బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ | 12 |
| శ్రీవేంకటాచల మాహాత్మ్యం (వచనం) | ఆచార్య కె.సర్వోత్తమరావు | 13 |
| సోదరులకు నరకం తప్పించే పండుగ | శ్రీమతి లేళ్ళపల్లి శ్రీదేవి రమేష్ | 15 |
| ఆరోగ్యకరం కార్తికం | బ్రహ్మశ్రీ మైలవరపు శ్రీనివాసరావు | 17 |
| అమ్మవారి పుట్టింటి మమకారం | శ్రీ ఎ.పి.దేవదాస్ | 20 |
| కష్టాలన్నీ తొలగుతాయి...! | డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ | 23 |
| స్వామి సైన్యానికి.. అధిపతి | డా॥ఈ.ఏ.సింగరాచార్యులు | 25 |
| తిరుప్పార్థన్‌ప్పళ్లి (108 దివ్యదేశాలు) | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 26 |
| శ్రీశివపూజా విధానం (వర్ణపుటలు) | | 27 |
| ఆకాశదీప మాహాత్మ్యం | బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు శర్మ | 31 |
| శ్రీ భూ నీళాసమేత కరియమాణిక్యస్వామిఆలయం,నగరి | డా॥ నొస్సం నరసింహాచార్య | 33 |
| మహిమాన్విత పర్వదినం క్షీరాబ్ధి ద్వాదశి | డా॥ మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి | 36 |
| ప్రపత్తిమార్గ ప్రబోధకులు | శ్రీ వైద్యం వేంకటేశ్వరాచార్యులు | 38 |
| 33 పున్నముల కథ | డా॥ డి.ఉదయకుమార్ | 39 |
| తలచుకోవాలే గానీ... | శ్రీఆర్.సి.కృష్ణస్వామి రాజు | 40 |
| శ్రీహరి సన్నిహితులు! | డా॥కాకర్ల భూపతినాయుడు | 41 |
| అమృతాన్నిచ్చిన ఆయుర్వేద దేవుడు | శ్రీ కందుకూరి వేంకట సత్యబ్రహ్మాచార్య | 42 |
| సప్తర్షిమండాలనికే మకుటాయమానుడు | డా॥ గుమ్మనూరు రమేష్‌బాబు | 43 |
| ఆధునిక న్యాయశాస్త్రానికి పునాది... | డా॥ కప్పగంతు రామకృష్ణ | 44 |
| పెద్దలమాట వినాలి! | శ్రీమతి నల్లాని రాజేశ్వరి | 46 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 47 |
| శాపమే వరం (చిత్రకథ) | కథ : డా॥ కంపల్లె రవిచంద్రన్ | 48 |
| | చిత్రాలు : శ్రీ తుంబలి శివాజీ | |
| మీరు సన్నబడాలంటే... | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 50 |
| బాలవినోదం | | 52 |
| క్విజ్ | | 53 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు | 54 |

స్థలాభావం వల్ల మేల్నాడు ధారావాహిక ప్రచురించలేదు. పాఠకులు గమనించగలరు.

ముఖచిత్రం : శ్రీఅలమేలుమంగమ్మ, తిరుచానూరు
వెనుకచిత్రం : శ్రీభూసమేత కరియమాణిక్యస్వామివారు, నగరి



ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

సంపాదకీయం

# జగదేక సౌభాగ్యవతి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఉత్సవం అనే మాట సర్వసాధారణంగా ప్రయోగిస్తుంటారు. దీని అర్థం గురించి ఆలోచిస్తే నిజంగా మనపూర్వులు జనసంక్షేమాన్నిగూర్చి ఎంత దీర్ఘంగా ఆలోచించారో బోధపడ్తుంది. 'సవం' అన్న మాటకు 'ఉత్' అనే ఉపసర్గ చేరిస్తే ఉత్సవం అవుతుంది. 'సవం' అన్న మాటకు యజ్ఞం, క్రతువు అని అర్థాలు. అంటే ఒకానొక అధిష్ఠానదైవసంతృప్తికోసం, ఇహపరాలకు సంబంధించిన ప్రయోజనాన్ని ఆశించి శాస్త్రవిధిగా జరిగే కార్యకలాపం. ఐతే ఈ క్రతువు వల్ల కేవలం పరిమితప్రయోజనమే సమకూరుతుంది. ఆ క్రతువులో పాల్గొన్నవారికి మాత్రమే దాని ఫలాలు అందుబాటులో ఉంటాయి. 'ఉత్' అనే ఉపసర్గాత్మక ప్రయోగంతో పరిమిత పరిధి నతిక్రమించి ఉత్సవం బహుళార్థసాధకమై సామాజిక సంక్షేమానికి తోడ్పడింది. అందుకే రామపట్టాభిషేకప్రయత్నాల్ని వివరిస్తూ రామాయణంలో కూడా 'ఉత్సవశ్చ మహానా సీదయోధ్యాయాం జనాకులః' అని ప్రయోగించాడు వాల్మీకి.

ఉత్సవాలవల్ల అగ్రప్రయోజనం మన అధిష్ఠానదైవసంతృప్తి. రెండవ ప్రయోజనం భేదభావ విస్మరణం. ఉత్సవాల రోజు ఆలయమూర్తుల ఊరేగింపు అనేది సర్వసాధారణంగా జరుగుతుంది. గుడికి వెళ్లలేని వారికి కూడా పరమాత్మ దివ్యస్వరూపదర్శనంవల్ల ముక్తిభావసంతృప్తి కల్గుతుంది. రథోత్సవాది కార్యక్రమాలలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొనటం జరుగుతుంది. తిరుమలలో శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో గరుడోత్సవ, రథోత్సవాలు, తిరుచానూరు శ్రీపద్మావతీఅమ్మవారి బ్రహ్మోత్సవాల్లో గజవాహనసేవ, పంచమీతీర్థం సందర్శించినవారికి సర్వసౌభాగ్యాలు లభిస్తాయనీ భక్తులనమ్మకం.

మూడవ ప్రయోజనం, పరస్పరావగాహనం. ప్రసిద్ధ దేవాలయాలలో జరిగే ఉత్సవాల సందర్భంలో దేశం పలు ప్రాంతాలనుండి భక్తులు అన్నిభేదాల కతీతంగా వచ్చి సందర్శిస్తారు. వివిధ ప్రాంతాలలో ఆయా ప్రాంతాల ఆచార వ్యవహారాలు, వేషభాషలు అవగతం చేసుకోడానికి, పరస్పరం సంబంధాలు పెంచుకోవటానికిది దోహదం చేస్తుంది. అన్నిటికన్నా ముఖ్యంగా ఉత్సవాలు విజ్ఞాన ప్రచారకేంద్రాలు. శాస్త్రీయకార్యక్రమాలు, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు మాత్రమేగాక శాస్త్రనిష్ణాతులు, కళాకోవిదులు, తమతమ కళానైపుణ్యాన్ని ప్రదర్శించి, ఐహిక, పారలౌకిక విజ్ఞానాన్ని యథాశక్తి, యథాయోగ్యంగా ప్రపంచించటానికి వీలౌతుంది.

ఈవిధంగా ఉత్సవాలు పంచముఖైశ్వర్యప్రదాలు. తరతరాల ఆధ్యాత్మికశక్తి ఆరిపోకుండా వెలగాలంటే ఊరూర ఉన్న దేవాలయాలలో ఈ ఉత్సవచైతన్యం పెల్లుబకాలి. ఆనాడే అన్ని దేవాలయాలు ఆధ్యాత్మికభావసమైక్యతకు నిలయాలై ముందుతరాలకు మార్గదర్శకాలౌతాయి. ఇందుకు ప్రతిఏటా తిరుమల, తిరుచానూరు క్షేత్రాలలో అయ్యవారికి, అమ్మవారికి జరిగే బ్రహ్మోత్సవాలే స్ఫూర్తిదాయకాలు.

మహామంగళదేవత, శ్రీమహాలక్ష్మి అవతారమైన అలమేలుమంగమ్మ బ్రహ్మోత్సవాలు ఈ మాసంలోనే ప్రారంభమౌతున్నాయి. ఈ ఉత్సవాలలో పాల్గొని అమూల్యమైన అమ్మవారి ఆశీస్సులు మెండుగా పొందాలని ఆకాంక్ష.

దయలోల తరంగాక్షీ పూర్ణచంద్ర నిభాననా ।  
జననీ సర్వలోకానాం మహాలక్ష్మీః హరిప్రియా ॥



ఈ నెల 5న
నాగులచవితిని
పురస్కరించుకుని
తిరుమలలో శ్రీవారి
పెద్దశేషవాహనం
ఉంటుంది.

ఈ నెల 28, 29న
తిరుచానూరు
శ్రీపద్మావతీఅమ్మవారి
కార్తిక బ్రహ్మోత్సవాలలో
చిన్న, పెద్దశేషవాహనాలు
ఉంటాయి.

# శేషశైలావాస... శ్రీవేంకటేశా!

- డా॥ కంపల్లె రవిచంద్రన్, 98487 20478

శ్రీవారు స్వయంగా ఊరేగింపులో పాల్గొనే ఉత్సవాలలో **మొదటిది- పెద్దశేషవాహన**మైతే, శ్రీపద్మావతీఅమ్మవారు మొదట చిన్నశేషవాహనంలో ఊరేగుతారు.

ఈ జగత్తంతా భగవంతునికి శేషభూతం. స్వామి శేషాద్రి వాసుడు. ఏడుకొండలే- ఏడుపడగలు. కొండ ఒక్కటే అయినా- ఏడుకొండలుగా రూపొందినట్లే- పడగలు ఏడైనా కంఠం ఒక్కటే!

ఏడుకొండల్లో ప్రధానమైంది శేషాచలం. ఈ ఏడుకొండలూ ఆదిశేషుని ఏడుపడగలనీ, ఆదిశేషుని ముఖభాగం శ్రీకాళహస్తి కాగా, ఆయన వెన్నుభాగం అహోబిలం కాగా, ఆయన శిరస్సు తిరుమల కాగా, తోకభాగం శ్రీశైలం- అయిందనీ ఐతిహ్యం. కనుక శేషాచలం అనేక యోజనాల పర్యంతం వ్యాపించి ఉండే పర్వతారణ్య విశాలప్రదేశం.

శ్రీ వేంకటేశ సహస్రనామ స్తోత్రంలో **"శేషాద్రినిలయోఽ**
**శేష భక్తదుఃఖప్రణాశనః।**
**శేషస్తుత్య శ్శేషశాయీ**
**విశేషజ్ఞో విభుస్స్వభూః"**- అని (2వ శ్లోకం) మొట్టమొదటనే "శేషాద్రినిలయః, శేషస్తుత్యః, శేషశాయీ" అంటూ మూడుమార్లు పర్వతనివాసపరంగా, స్తోత్రపరంగా, శయ్యాపరంగా ఆదిశేషుని ప్రస్తావన వచ్చింది. కనుక శేషుడు స్వామికి పర్వతరూపుడై తన శిఖరం మీద నివాసం కల్పించాడు. అంతేకాక మహాభక్తుడై, శ్రీవారిని తన నిరుపమాన భాషావైదుష్యంతో అనేకవిధాలుగా స్తోత్రం చేస్తూ- తన వాక్శక్తిని సార్థకం చేసుకుంటున్నాడు. శ్రీవారికి మంచం, పరుపూ, ఛత్రం, మూడూ తానే అయి- శేషశాయి అనే పేరు సార్థకపరుచుకుని- స్వామి విశ్రాంతికీ, సుఖనిద్రకూ కారణమౌతున్నాడు.

ఇందులో శేషాచలనివాసానికీ, శేషస్తుత్యతకూ సంకేతంగా మొదటివాహనంగా శ్రీ భూదేవీసహితుడై శ్రీనివాసుడు- పర్వతరూపుడైన శేషునిపై ఉత్సవానికి వచ్చి, తనకు శేషునిపైగల అనంత ప్రీతివాత్సల్యాదరాలను వ్యక్తం చేస్తున్నాడు. పైగా స్వామికీ, శేషునికీ 'అనంత' శబ్దం సమానం.



'అనంత' శబ్దానికి ఆకాశమనీ, శేషుడనీ, తుదిలేనిదనీ అర్థాలున్నాయి. విష్ణువు అచ్యుతుడు కనుక అనంతుడు. సర్వ వ్యాపకుడు. ఆదిశేషుడు- అనేటప్పుడు 'శేష శబ్దానికి కల్పాంతేఽ పి శిష్యతి' కల్పాంతమందునూ మిగిలి ఉండేవాడు. 'శేతే హరిః అస్మిన్' హరి యితని మీద శయనించి ఉంటాడు- అనీ- 'అనంత' శబ్దానికి 'న విద్యతే అంతో నాశః యస్య సః' నాశం లేని వాడనీ అర్థాలు. విష్ణువూ, శేషుడూ ఇరువురూ కల్పాంతంలో కూడా నశించరు కనుక ఇద్దరికీ అనంత శబ్దం అన్వర్థం. శేషశబ్దం కూడా విష్ణువుకు శయనం, కల్పాంతంలోనూ చ్యుతి లేకుండడం అనే అర్థాన్నిచ్చి- విష్ణువుతో శేషునికి గల అనపాయత్వాన్ని ధ్రువీకరిస్తోంది. ఆకాశార్థంలో అంతం లేనిది అనంతం. ఆకాశం సర్వవ్యాపకం, శాశ్వతం. విష్ణువు 'ఆకాశశరీరం బ్రహ్మ'- అన్నందున నీలమేఘశ్యాముడై – అనంతత్వాన్ని పొందియున్నాడు.

రామావతారంలో ఆదిశేషుడు లక్ష్మణుడై అవతరించాడు. కనుకనే వేర్వేరు తల్లుల సంతానమైనా, రామలక్ష్మణులు- హరి శేషులైనందున సర్వదా కలసి మెలసే ఉండినారు. త్రేతా యుగంలో తమ్ముడైతే, ద్వాపరంలో శేషుడు కృష్ణునికి అన్నయై బలరాముడుగా అవతరించాడు. యుగధర్మంలో తేడా ఉన్నా ఆ ఇరువురి ఐక్యమత్యం మాత్రం అవిచ్ఛిన్నం! ఇంతేకాదు భూభారాన్ని తన సహస్ర ఫణామండలిపై మోస్తూ, స్వామివారినే కాక, మనందరి భారాన్ని వహించి, సంరక్షిస్తూనే ఉన్నాడు.

భారతంలో ఉదంకుడు నాగలోకం చేరి అక్కడి నాగపతులను స్తుతించే ఘట్టంలో (ఆదిపర్వం-1 ఆ. 104)- మొట్టమొదట ఆదిశేషుడైన అనంతుణ్ణే స్తుతించాడు. అందులో శేషుడు నిర్వహిస్తున్న భూభారవహనత్వం, విష్ణుదేవునికి శయనత్వం అనే రెండు విషయాలూ చక్కగా కీర్తించబడ్డాయి.

బహువన పాదపాబ్ధికుల పర్వతపూర్ణసరస్సరస్వతీ
సహితమహామహీభర మజస్రసహస్రఫణాళిఁదాల్చి, దు
స్సహతరమూర్తికిన్, జలధిశాయికిఁ బాయక శయ్యయైన అ
య్యహిపతి, దుష్కృతాంతకు, డనంతుఁడు మాకుఁ బ్రసన్నుఁడయ్యెడున్

ఇందులో అతని శరీరబలసామర్థ్యాలే కాక అతని గొప్ప గుణవిశేషం- 'దుష్కృతాంతకుడు'- పాపాలను నాశం చేసేవాడు- అంటే 'పుణ్యప్రదుడు' – అనే విశేషణం ఉండటం వల్ల శేషుని స్మరణ ఎంత గొప్పదో తెలుస్తోంది. పవిత్రాలకు పవిత్రత, మంగళాలకు మంగళం, పుణ్యాలకు పుణ్యం కల్గించే హరికి 'పాయకశయ్య'గా ఉండి శ్రీనివాస శరీరస్పర్శతో పవిత్రమైన శరీరం కలవాడు. స్వామిని స్తుతించడం వల్ల పవిత్రమైన నాలుక, ముఖం కలవాడు. పర్వతరూపంలో వచ్చి- శ్రీనివాసునికి నివాసస్థానమై- ఈ క్షేత్రాన్ని కలియుగవైకుంఠమనే ప్రశస్తికి తేవడంలో ప్రముఖపాత్ర వహించినవాడూ- శేషుడు. భగవత్సమానప్రతిపత్తి కల్గి అనంతమైనవాడు కనుక శ్రీవారు బ్రహ్మోత్సవాలలో తన ఉభయదేవేరులతో మొదట పెద్ద శేషవాహనంపై ఉత్సవం జరుపుకొంటూ- శేషుణ్ణి కాపాడుతున్నట్లే- భక్తుల్ని కాపాడుతాననీ, మీరందరూ శేషుని వలె నాకు నిత్యసేవకులుగా ఉండి సత్ఫలాలు పొందండనీ సూచించడానికే- ఇలా ఉత్సవ ప్రథమదర్శనం అనుగ్రహిస్తున్నాడు.

కలియుగంలో శేషుడు గోవిందరాజస్వామిగా, వేంకటాచలంగా, ఆయుర్వేద వైద్యుడు చరకుడుగా, పాణినీయ భాష్యకర్త, యోగసూత్రకర్త, పతంజలిగా, విశిష్టాద్వైతప్రచారకులు శ్రీభగవద్రామానుజులుగా- ఇలా బహురూపాల్లో అవతరించి, సమాజానికి బహువిధ సేవలు గావించిన మహనీయుడు.

అల్లసానిపెద్దన మనుచరిత్రలో ప్రవరుణ్ణి వర్ణిస్తూ "భాషాపర శేషభోగి" అన్నాడు. శేషుణ్ణి ఉపాసిస్తే చక్కని వాక్పటిమ, భాషా వైదుష్యం, జ్ఞానవిజ్ఞానాలూ సమకూరుతాయి. 'పెద్ద' అనబడే అన్ని విషయాల్లో, రూపాల్లో, శక్తిసామర్థ్యాల్లో ఆదిశేషుడు అనంతుడై అన్నింటా తాను పెద్దయై, తనకంటే పెద్దవాడైన ఆదినారాయణమూర్తి శ్రీనివాసుణ్ణి వహిస్తూ ఇద్దరు పెద్దలు ఒక్కమారుగా సాక్షాత్కరించే ఉత్సవం ఈ వాహనసేవ. అంతేకాదు; ఉత్పత్తిస్థానం భూదేవి, వస్తువుల్ని అనుభవింపజేసే భోగస్థానం శ్రీదేవి- ఇరువురినీ భరించి, వాళ్లకు ఆయా శక్తు లిచ్చినవాడు విశ్వంభరుడు విష్ణువు. ఇందర్నీ వహించేవాడు ఆదిశేషుడు. ఇన్ని గొప్పలతో దర్శనమిచ్చే గొప్ప ఉత్సవం కనుక మొదటి వాహన సేవగా తిరుమల బ్రహ్మోత్సవాలలో పెద్దశేషవాహనం ఉండాలని భవిష్యోత్తరపురాణం పేర్కొనింది.

తయా సహాసీన మనంతభోగిఁ ప్రకృష్టవిజ్ఞానబలైకధామని।
ఫణామణివ్రాతమయూఖమండల ప్రకాశమానోదరదివ్యధామని॥
నివాస శయ్యాసన పాదుకాంశుకోపధానవర్షాతపవారణాదిభిః।
శరీరభేదై స్తవశేషతాం గతైః యథోచితం శేష ఇతీరతే జనైః॥


దుర్గతులను నశింప చేసే తల్లి శ్రీమహాలక్ష్మి

విశేష విజ్ఞానబలం గలవాడూ, తన ఫణామణిశ్రేణులచే దివ్యవైకుంఠవిమానాన్ని ప్రకాశింపజేస్తున్నవాడూ శేషుడు. ఇతడు స్వామివారికి నివాసభూమిగా, శయ్యగా, సింహాసనంగా, పాదుకలుగా, వస్త్రంగా, ఆనుకొనే దిండుగా, ఛత్రంగా, ఆయా సమయాల్లో అనేక రూపాల్తో సేవలందిస్తున్న దాసుడుగా ఉన్నాడని యామునాచార్యులవారు తమ స్తోత్రరత్నగ్రంథంలో శేషుణ్ణి కీర్తించారు.

శ్రీ వేంకటేశ్వర భక్తాగ్రగణ్యుడై, తిరుమలేశుణ్ణి ఏడు మార్లు దర్శించి, అనేక రత్నాభరణసమర్పణ సేవలందించిన శ్రీకృష్ణదేవరాయలు తన ఆముక్తమాల్యద ప్రబంధంలో- ఇష్ట దేవతాస్తుతుల్లో మొదటి స్తుతి 'వేంకటభర్త' ని కావించి, రెండవ స్తుతిగా అనంతుడైన శేషుణ్ణి మిక్కిలి మనోహరంగా, శేషుడు స్వామికీ, శ్రీదేవికీ, భూదేవికీ ఎందుకు ప్రీతిపాత్రుడయ్యాడో చక్కగా విశ్లేషిస్తూ, క్రింది విధంగా అన్నాడు.

**సిరి నొక్కప్పుడు కన్మొఱంగి, హరి దన్ జేరన్ బ్రహర్షించు న**
**ర్వరకున్ వంచనఁగూడఁగాఁగలుగు భాస్వచ్చంద్రశాలాపరం**
**పర లయ్యేన్ బఱపైన యెవ్వనిఫణాపంక్తుల్; భజింతున్ నిరం**
**తరమున్ దాంతుని నయ్యనంతుని నతీతబ్రహ్మకల్పాంతునిన్**
**(1-2)**

హరికి లక్ష్మి, భూమి - ఇరువురు భార్యలు. వీళ్లలో లక్ష్మి ఎప్పుడూ శ్రీహరి వక్షఃస్థలంపై ఉంటుంది. కనుక లక్ష్మికి తెలియక శ్రీహరి భూదేవిని కూడటం శక్యం కాదు. హరి భూదేవిని కూడడం లక్ష్మికి ఇష్టం కాదు. విష్ణువుకేమో ఇద్దరియందూ ప్రేమ సమానం. ఇలాంటి స్థితిలో ఎప్పుడైనా లక్ష్మికి తెలియకుండా హరి తనతో కూడటం వల్ల ఆనందించడానికై- ప్రయత్నిస్తుంది భూదేవి. అప్పుడు ఈ అనంతుని విశాలమైన పడగల వరుసలు గొప్ప సౌధాల్లాగా ఉండి తనకు అవకాశం ఇస్తున్నాయట! అయితే శేషుడు జితేంద్రియుడు కనుక శ్రీవారి ఈ శ్రీభూదేవీ సల్లాపాదుల్తో ఆయనకు ఏమాత్రం సంబంధం లేదు. ఆయనది కైంకర్యపరత్వదృష్టి మాత్రమే! పైగా అతడు బ్రహ్మకల్పాని కంటే ఎక్కువకాలం ఉండేవాడు- అలాంటి శేషుణ్ణి సేవిస్తానన్నాడు.

ఇక్కడ శేషుడు నాకే సహాయం చేస్తున్నాడని లక్ష్మి, అట్లే భూదేవి ఇర్వురూ భావిస్తున్నారు. ఇక శ్రీవారి సంగతి చెప్ప పని లేదు. ఇలా ముప్వురి ప్రీతికీ పాత్రుడైనవాడు శేషుడు.

బహుశః - శ్రీదేవీ భూదేవీసహిత మహావిష్ణువు శేషునిపై ఉత్సవానికి బయలుదేరిన దృశ్యాన్ని చూచే- రాయలు ఇంత చక్కగా ద్వితీయపద్యమైనా అద్వితీయభావనతో స్తుతించాడు అని అనిపిస్తుంది.

**శేషవాహనం ముఖ్యంగా దాస్యభక్తికి నిదర్శనం.** దాస్యభక్తి వల్ల పశుత్వం తొలగి- మానవత్వం, అందుండి దైవత్వం, పిదప పరమపదం సిద్ధిస్తాయి. అందుకే "నాగుల్లో నేనే అనంతుణ్ణి" "అనంతశ్చాస్మి నాగానామ్"-అన్నాడు గీతలో వాసుదేవుడు. ఈ సందేశాన్ని భక్తలోకానికి అందివ్వడానికే శేషాచలేశుడు, సప్త గిరీశుడు, సప్తఫణి అయిన ఆదిశేషుణ్ణి వాహనంగా- తన దేవీ ద్వయంతో తిరువీథుల్లో విహరిస్తున్నాడు. విషాన్నీ, అమృతాన్నీ సమానంగా భావించి, అనుభవించగల యోగీశ్వరేశ్వరుడు కదా-



## 2024, డిసెంబరు నెల ఉత్సవాలు, పర్వదినాలు

02 తిరుచానూరు, శ్రీపద్మావతి అమ్మవారి గజవాహనోత్సవం,
06 పంచమీతీర్థం
07 తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి పుష్పయాగం, సుబ్రహ్మణ్యషష్ఠి
11 గీతాజయంతి
12 శ్రీచక్రతీర్థముక్కోటి
14 శ్రీదత్తజయంతి
16 ధనుర్మాసం ప్రారంభం
30 తిరుమల శ్రీవారిసన్నిధిలో అధ్యయనోత్సవారంభం

శ్రీనివాసుడు! 'సమత్వం యోగ ఉచ్యతే'- అని తాను శ్రీకృష్ణావతారంలో నుడివిన సమత్వయోగాన్ని ఈ ప్రథమోత్సవంలో నిరూపిస్తున్నాడు స్వామి.

సప్తగిరులూ, శేషుని సప్తఫణులూ- శరీరంలోని సప్త చక్రాలూ, జ్ఞాన సప్తభూమికలూ, సప్తలోకాలూ, సప్తవాయువులూ- ఇలా సప్తసంఖ్యాకాలైన ఉత్తమస్థితులన్నింటికీ సంకేతాలు.

దివ్యప్రబంధాల్లో వాహనాలను గూర్చి పరిశీలిస్తే మనకు గరుత్మంతుడూ, శేషుడూ- ఈ ఇద్దరే ప్రముఖంగా కన్పిస్తారు. గరుత్మంతుడు వాహనంగా, శేషుడు శయ్యగా స్వామివారి సేవలో తరించారు. గరుత్మంతుని కంటే- శేషుడు ముందుగానే శయ్యాత్వాన్ని వహించి ఉన్నాడు.

శేషవాహనాన్ని గురించి- నమ్మాళ్వార్లు 'తిరువాయిమొళి' లో శేషశయ్యపై స్వామి తనకు ఆనందం కల్గించడానికే వేంచేసి ఉన్నాడని స్తుతించారు. **"పామ్బుణమే ల్వాఱ్ఱుదలుళ్ పళ్ళియమర్ న్దదువుమ్"** అని శేషశయ్యపై వేంచేసిన స్వామిని నమ్మాళ్వార్లు దర్శించారు. అట్లే ముదలాళ్వారులలో ఒకరైన పొయ్‌గై ఆళ్వార్లు- "సర్వేశ్వరునికి శేషుడు గొడుగుగా, సింహాసనంగా, పాదుకగా, తెప్పగా, రత్నదీపమైన వస్త్రంగా, ఒరిగిన దిండుగా ఉపయోగపడుతున్నాడని" శేషుని కైంకర్య పారమ్యాన్ని స్తుతించారు. ఈ శేషుణ్ణి ఆళ్వార్లు స్తుతించిన తీరునుబట్టి, తర్వాతి కాలంలో శేషవాహనం ఏర్పడింది. ఇక్కడ శేషుడు తెప్పగా చెప్పబడడం వాహనంగా భావించడానికి వీలుంది. ఈ పాశురాన్ని నిత్యారాధనలో స్తుతించే నియమాన్ని పూర్వాచార్యులు ఏర్పరచారు. ఈ పాశురంలో స్వామి శయనమూర్తిగా, నిల్చున్న, కూర్చున్న మూర్తులుగానూ చెప్పబడ్డాడు. అర్చారూపి ఈ మూడుపద్ధతుల్లో ఏ రూపంలో ఉన్నా ఈ పాశురం అన్వయిస్తుంది. అందువల్ల దీన్ని ఆరాధన కైంకర్యంలో స్తుతించడానికి ఏర్పాటు చేశారు.

శేషవాహనస్థుడైన స్వామిని కీర్తిస్తూ అన్నమయ్య -

"వీడుగదే శేషుడు శ్రీవేంకటాద్రి శేషుడు
వేడుక గరుడనితో (జెన్నుద్దైన శేషుడు
వేయి వడిగెలతోడ వెలసిన శేషుడు
మాయని శిరసులపై మాణికాల శేషుడు
యేయెడ హరినీడై యేగేటి శేషుడు
..................................
కదిసి పనులకెల్ల గాచుకొన్న శేషుడు
మొదల దేవతలెల్లా మొక్కే శేషుడు
అదె శ్రీ వేంకటపతి కలమేలు మంగకును
పదరక యేపొద్దూ పానుపైన శేషుడు" - అని వర్ణించాడు.

అన్నమయ్య భావనలో శేషుడు వేంకటాద్రిరూపుడైనవాడు. గరుడునితో అన్నివిధాలా సమానమైనవాడు, వేయిపడగలు గలవాడు, పాము పొలుసులు తళుకువజ్రాల మాదిరి ఉంటాయి కనుక చాయమేని తళుకు వజ్రాలవాడు, నిరంతరం ప్రకాశించే మాణిక్యాల పడగలు గలవాడు, శ్రీహరికి సర్వత్ర నీడ కల్పిస్తూ ఛత్రంగా వెళ్లేవాడు; పట్టపు వాహనమైన బంగారుశేషుడు, శ్రీహరిని స్తుతించగల నేర్పరి, తన స్వామి ఏ పని చెప్పినా చేయడానికి సదా సంసిద్ధుడై వేచి ఉండేవాడు, దేవతలందరి చేత మొదట నమస్కారాలు పొందేవాడు, (స్వామి వారి పాదపీఠమూ శేషుడే కనుక సకలదేవతలూ శ్రీవారి పాదపద్మాలకు నమస్కరించేటప్పుడు- ఆ పాదపీఠాన్ని తాకి నమస్కారాలు చేస్తారు. కనుక శేషునికి ప్రథమ నమస్కారార్హత అప్రయత్నంగా సిద్ధిస్తుంది). శ్రీ వేంకటపతికీ, అలమేలుమంగకూ సర్వదా పానుపైనవాడు శేషుడు.

శేషుడు ఎన్నివిధాల శ్రీ వేంకటేశ్వరుణ్ణీ, అలమేలు మంగమ్మనూ సేవిస్తుంటాడో, అతని స్వరూపస్వభావ విశేషాలు ఎలాంటివో కండ్లకు గట్టినట్లు వర్ణించి, స్తుతించాడు అన్నమయ్య.

ఇందులో "పట్టపు వాహనమైన బంగారు శేషుడు" అనేమాట విశిష్టమైంది. పట్టపుటేనుగుపై చక్రవర్తులు ఊరేగుతారు. కాని రాజాధిరాజైన శ్రీ వేంకటపతి 'పట్టపువాహనం'గా 'బంగారు శేషుణ్ణి' స్వీకరించి, ఉత్సవానికి వెడలుతాడు. ఈ కీర్తన 'నాగ గాంధారి మాళవి' రాగంలో ఉండడం 'నాగ' మంటే సర్పం కనుక- రాగం పేరు సార్థకం.

పాము చుట్టలు- కుండలినీ సంకేతం. శేషుని వేయి పడగలే సహస్రారకమలం.

శ్రీ వైష్ణవసంప్రదాయంలో శేషి = భగవంతుడు. శేషుడు= దాసుడైన జీవుడు. శేషమంటే మిగిలి ఉండేది. ఇది సామాన్యార్థం. శ్రీ వైష్ణవ సంప్రదాయంలో శేష శబ్దానికి "యథేష్ట వినియోగార్హం శేష శబ్దేన కథ్యతే". పరమాత్మ కోసం అరకొర లేకుండా వినియోగపడే వస్తువు లేదా వ్యక్తి అని శేష శబ్దానికి అర్థం. పారార్థ్యమే శేషత్వ లక్షణం. నగ= ఆభరణం= శేషం. అది కలవాడు యజమాని= శేషి. కనుక తనకొరకు గాక నిరంతరం భగవంతుని ఆనందంకోసం కైంకర్యపరుడైన వాడు శేషుడు. ఇతడు దాసుడు. సేవల వల్ల ఆనందించి, సేవకుల్ని రక్షించేవాడు- శేషి అంటే శేషులు= దాసులు కల వాడు శేషి. చేతనాచేతనమైన జగత్తంతా భగవంతుని సేవకే రూపొందింది కనుక- ఇదంతా శేషభూతం. శ్రియఃపతి ఈ జగత్తును స్వీకరించి, దాన్ని రక్షిస్తున్నాడు కనుక స్వామి శేషి. జీవునికి దాస్యభావం (శేషభావం) లేకపోతే స్వరూపహాని సంభవిస్తుంది.

శేషభూతుడై సార్థకనామక్రియాకలాపుడైన శేషుణ్ణి గూర్చి పాదుకాసహస్రంలో వేదాంతదేశికులవారు.

**"శయ్యాత్మనా మధురిపోఽరసి శేషభూతా,**
**పాదాశ్రయేణ చ పున ర్ద్విగుణీకృతం తత్ ।**
**భూయోఽపి భాగవతశేషతయా తదేవ**
**వ్యంక్తుం పదావని! శఠారిపదం బిభర్షి ॥" (1-7)**

అని ప్రస్తుతిస్తూ- పాదుకాప్రభావ విశేషాన్ని స్పష్టం చేశారు. "ఓ పాదుకాదేవీ! నీవు ఆదిశేషాకారంతో శ్రీహరికి శయ్యగా ఉండి శేషభూతవై ఉన్నావు. ఆ శేషత్వం భగవత్పాదాల్ని ఆశ్రయించడం వల్ల ద్విగుణీకృతమయింది. ఆ భగవచ్ఛే షత్వాన్ని ఇంక భాగవతశేషత్వంతో పెంపొందించుకోవడానికే 'శఠకోప' సంజ్ఞను కూడా పొందావు" అని తాత్పర్యం.

భగవంతుని దివ్యమంగళవిగ్రహానికి శయ్యగా అయి నందున సర్పరాజస్వరూపంగా పాదుకాదేవికి మొదట శేషత్వ లక్షణం ఉంది. ఆదిశేషరూపం చేత ఆదిమశేషత్వాన్ని పొందిన పాదుకాదేవి, మళ్లీ భగవంతుని శిరః, కంఠ, ఉరస్, ఉదర, ఊరు, జంఘా, పాదరూపాలైన అధస్థితావయవాలకు అంతిమ శేషత్వాన్ని పొందడం వల్ల సప్త స్థానాత్మకమైన శేషత్వం సిద్ధించింది. పాదతల శేషత్వం శయ్యకు లేదు. పాదుకలకు ఆ భాగ్యం కూడా రెండుపాదాల తాకిడి వల్ల రెండు పాదుకలకూ కనుక ద్విగుణీకృతమయ్యింది. అంతేకాదు భగవంతునియందే కాక, భాగవతులయందు కూడా శేషభావంతో వర్తించాలన్నారు- వేదాంతదేశికులు.

శేషుడే పాదుకలు – కనుక శేషుని సర్వమూ శేషమయమే! అంటే దాస్యమయం. **ఆదిశేషుడంటే ఆదిదాసుడు.**

ఇలా పెద్దల వాక్యాల్ని బట్టి గమనిస్తే పెద్దశేషవాహనం శేషశేషిత్వ స్వరూప స్థితినీ, భాగవతసేవనూ గావిస్తూ "అందరూ నిర్మలాంతఃకరణంతో సర్వదా నన్ను సేవిస్తూ తరించండి" అనే గొప్ప సందేశాన్ని ఇవ్వడానికే మొదటి వాహనంగా ఏర్పరచింది- భవిష్యోత్తరపురాణమని భావించడం సముచితం.

## వైకుంఠపాళి

### :: 106 - సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 దా | శ | 2 ర | థి | | 3 ల | 4 వ | కు | 5 శ |
| వా | | ణం | | 6 మాం | | ధ | | మీ |
| 7 న | గ | | 8 అ | డ | వి | | 9 బా | కు |
| లం | | 10 బ | | వి | | 11 ప్ర | | డు |
| | 12 బ | కు | డు | | 13 ప్ర | మ | తి | |
| 14 దా | | డు | | 15 మై | | తి | | 16 జ |
| 17 మో | దం | | 18 మి | థి | ల | | 19 కా | న |
| ద | | 20 కా | | లి | | 21 మే | | కు |
| 22 ర | క్క | సు | లు | | 23 మై | నా | కు | డు |

# సందేహాలు



# సమాధానాలు

– బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ

**ప్ర) శివాలయంలో ప్రసాదం ఇంటికి తీసుకు రారాదని అంటారు ఎందుకు?**

**జ)**'ప్రసాదం' అంటే అనుగ్రహం. శివ దర్శనంతో, అర్చనతో అనుగ్రహం సంప్రాప్త మౌతుంది. అయితే వస్తురూపేణ ఉండే నిర్మాల్యం మాత్రం తీసుకురారాదు. కానీ అన్నిచోట్లా ఈ నియమమే వర్తించదు. మహాశివభక్తుడైన 'చండే(డ్రే)శ్వరుడు' అనే ఒక దేవత తన తపస్సుకు ఫలంగా 'శివ నిర్మాల్యం'పై అధికారాన్ని వరంగా సంపా దించుకున్నాడు. అందుకే ఆ నిర్మాల్యం అతడికే చెందాలి. ఆ కారణంచేతనే మనం ఇంటికి తీసుకురారాదు. శివలింగంపై నుండి వచ్చే తీర్థాన్ని మనం సేవించవచ్చు. కానీ గర్భగుడి ప్రాకారం బైట'నాళం' (తూము) ద్వారా జారే తీర్థాన్ని మాత్రం సేవించరాదు. దానిపై కూడా చండేశ్వరునిదే అధికారం. అది అతడి సొత్తు. అయితే – జ్యోతిర్లింగాలు (కాశీ, శ్రీశైలం మొదలైనవి) ఉన్నచోట్ల మాత్రం శివ నిర్మాల్యాన్ని ప్రసాదంగా స్వీకరించ వచ్చు. స్ఫటిక, బాణలింగాలున్నచోట కూడా తీసుకోవచ్చు. చండేశ్వరప్రతిష్ఠ లేని ఆలయాలలోనూ గ్రహించవచ్చు. ఇంకా స్వయంభూ (అరుణాచలం, శ్రీకాళహస్తి– వంటివి) లింగాలు వద్ద, సిద్ధ ప్రతిష్ఠిత లింగాల వద్ద నిర్మాల్యాన్ని స్వీకరించవచ్చు.

కొన్ని శైవాగమాల ప్రకారం నివేదనల్లో 'చండభాగం' అని ఉంటుంది. అలా ఉన్న ఆలయాల్లో శివప్రసాదాన్ని నిరభ్యంతరంగా స్వీకరించవచ్చు.

**ప్ర) కార్తిక మాసంలో ఎలాంటి వ్రతం చేస్తే మంచిది?ఏ ఏ నియమాలు పాటించాలి?**

**జ)**కార్తికంలో స్నానం, జపం, దానం, పారాయణ ఏదైనా మహోన్నతఫలాన్ని స్తుంది. ఎవరికి వీలైన వ్రతాన్ని వారు పాటించవచ్చు. ముఖ్యంగా దీపదానానికి సమానమైన దానం లేదు. "కార్తిక మాసంలో ఏ వ్రతమూ చేయకుండా గడిపే మూఢులకు పుణ్యం లేశమైనా లభించదు. అట్టివారి జన్మ నీచజంతు జన్మకు సమానమని ధర్మశాస్త్రం కొంచెం గట్టిగానే ఘాటుగానే చెప్పింది.

కార్తికమాసంలో రామాయణ, సుందర కాండాది పురాణాలను పారాయణం ప్రారంభించి, మాసాంతంలోగా పూర్తి చేయడం కూడా ధర్మశాస్త్రాలు విధిం చాయి. ఉత్తముడైన పండితుని ద్వారా ఈ మాసంలో దివ్యపురాణాల శ్రవణం చేయడం గొప్ప ఫలితాన్నిస్తుందని పురాణవచనం. తాంబూలం, కేశఖండనం వంటివి విసర్జిం చడం ఉత్తమం.

ఆకాశదీపాన్ని విష్ణుప్రీతికై ఏర్పాటు చేస్తారు కొందరు. కార్తికంలో ఉల్లి, ఇంగువ, పుట్టగొడుగులు, ముల్లంగి, ఆనప కాయ, మునగకాడలు, వంకాయ, గుమ్మడికాయ, వాకుడు, పుచ్చకాయ, వెలగపండు, నూనె, లవణశాకం, చద్ది మొదలైనవీ రెండుమార్లు వండిన అన్నం, మాడిన అన్నం, మినుములు, పెసలు, సెనగలు, ఉలవలు, కందులు మొదలైన ద్విదళ ధాన్యాలు వాడరాదు.

సప్తమినాడు ఉసిరిక, తిలలు, అష్టమి నాడు కొబ్బరి, ఆదివారం ఉసిరికపప్పు కార్తికంలోనే కాక ఏ మాసమందూ ఉప యోగించరాదు.

**ప్ర) శివపంచాక్షర స్తోత్రంలో 'యక్షస్వరూ పాయ' అని శివుణ్ణి వర్ణించారు. శివుడు యక్షుడుగా ఎప్పుడు? ఎలా అవతరిం చాడు? దాని అంతరార్థమేమిటి?**

**జ)**ఒకప్పుడు దేవతలు రాక్షసుల్నిజయించి, విజయోత్సాహాన్ని జరుపుకుంటున్నారు. అంతా తమ నిర్వాకమేనని ప్రగల్భాలను చెబుతున్న సందర్భంలో వారి ముందు పర బ్రహ్మ 'యక్ష'రూపంతో ప్రత్యక్షమయ్యాడు.

దేవతలు ఆయనను గుర్తించలేక ఈ యక్షుడెవరని ఆశ్చర్యపడ్డారు. అప్పుడు అగ్ని ఆతనిని తెలుసుకోడానికై ముందుకు వచ్చి, 'నువ్వెవర'ని ప్రశ్నించాడు. అప్పుడా యక్షుడు దేవతల ప్రతాపాన్ని తెలుసుకోవ డానికి వచ్చానని చెప్పి ఒక తృణాన్ని ఎదురుగా ఉంచి అగ్ని యొక్క ప్రతాపాన్ని చూపించమన్నాడు. అగ్ని తన శక్తినంతటినీ వినియోగించినా, ఆ తృణం దహింపబడ లేదు. అలాగే వాయువు కూడా దాన్ని కదిలించలేకపోయింది.

అప్పుడు ఇంద్రుడు వినయంగా ఆ యక్షుణ్ణి ప్రార్థించగా, అక్కడ జగదంబ బ్రహ్మ విద్యాస్వరూపిణిగా సాక్షాత్కరించి 'తాను ఉమాదేవి ననీ, ఆ యక్షుడు పర మాత్మ అనీ, ఆతని శక్తిని' తాననీ పర బ్రహ్మ గురించి బోధించింది. అలా యక్షునిగా గోచరించిన శివపరమాత్మ దేవతలకు సైతం దైవత్వాన్నిచ్చిన పరం జ్యోతి. ఇది కేనోపనిషత్తులోను, కొన్ని పురాణాలలోను చెప్పబడ్డ కథ. ఈ ఇతివృత్తం ఆధారంగా **'యక్షస్వరూపాయ జటాధరాయ పినాకహస్తాయ సనాత నాయ'** అని శివపంచాక్షరస్తోత్రం వర్ణిం చింది. 'యక్ష' శబ్దానికి 'పూజ్యుడు' అని ఒక అర్థం ఉంది.

# శ్రీవేంకటాచల మాహాత్మ్యం

(తరిగొండవెంగమాంబ ప్రణీతం)

వచనం– ఆచార్య కె.సర్వోత్తమరావు, 97041 04000

ధారావాహిక



**గత సంచిక తరువాయి..**

మునులారా! మీ ఆకాంక్షను అర్థం చేసుకున్నాను. వేంకటేశ్వరస్వామి వినోదాలు రకరకాలు. వేంకటాద్రి పరిసరాలలో రాక్షసనిర్మూలనం కాగా స్వామి భూతలంలోనే ఉండాలని సంకల్పించాడు. తాను పరిపూర్ణుడైనా లోకులు తన్ను శేషగిరివాసుడని పరస్పరం చెప్పుకునేలాగా వ్యవహరించాడు. స్వామి స్వస్వరూపంతో గాక అర్చామూర్తిగా నిలబడ్డాడు. మౌనముద్ర వహించాడు. కర్మనేత్రులకు తప్ప మరెవరికి కనబడని రీతిలో మెలిగాడు. భక్తులతో ప్రత్యక్షంగా మాట్లాడక స్వప్నంలో సాక్షాత్కరించి కర్తవ్యం బోధిస్తాడు. మాయారూపంలో మానవాళికి తనపై మరులు కలిగేలా చేస్తాడు. భక్తులలో ఎవరైనా భౌతికవాంఛలకు అతీతులై శరీరాదులపై మమకారం సుతరామూ లేక తనను తదేకబుద్ధితో సేవించే వారికి మోక్షం అనుగ్రహిస్తాడు.

ఒక్కోసారి వైకుంఠం నుండి తెచ్చిన విమానవాసుడుగా కనిపిస్తాడు. ఇక తేరిపార చూద్దామనేసరికి అంతర్ధానమౌతాడు. ఒకసారి ఆనందనిలయుడుగా కనిపిస్తాడు. మరోసారి అంతర్విమానస్థుడౌతాడు. తన నివాసమిదేయని విమానాన్ని దేవతలకు మాత్రం దర్శింపజేస్తాడు. సామాన్య మానవుల బాహ్యపూజలను ప్రీతితో అందుకుంటాడు. దేవపూజలను రహస్యంగా స్వీకరిస్తాడు. సామాన్యమానవులెవరైనా భక్తితో కోరుకుంటే వారికి వరాలు కుప్పిస్తాడు. లోకులు ఆశ్చర్యపడేలా రకరకాల మహిమల్ని ప్రదర్శిస్తాడు. అల్పదానమైనా అధికదానంగా భావిస్తాడు. సామాన్య పూజలకూ సంతోషిస్తాడు. అప్రాకృతుడైన స్వామి, సామాన్యమానవుని వలే ప్రజల వెంట తిరుగుతూ తన మీద మోహం కలిగేలా చేస్తాడు. తన దగ్గరకు రమ్మని వాంఛ కలిగిస్తాడు. ఒక్కొక్కసారి ముడుపులు, సొమ్ముల తెండని ఆదేశించి వారితోనే వస్తాడు. ఎంతో ఉత్సాహంతో తిరుమలలో రకరకాల ఉత్సవాలు జరిపించేవారికి సకలభాగ్యాలు అనుగ్రహిస్తాడు. ఉత్సవాల సమయాలలో దేవతలే భూమికి దిగివచ్చి స్వామిపుష్కరిణిలో మునకలు వేస్తారు. దేవతలు అర్పించే రకరకాల పిండివంటలను ఆప్యాయతతో ఆరగిస్తాడు. ఇవన్నీ రహస్యంగా జరిగే స్వామి వినోదాలే!




మాయావిమానంలో ఉన్నా ఆనంద నిలయుడుగా శిలారూపంలో స్వామి

కనిపిస్తాడు. అర్పింపబడేది స్వల్పమైనా అందుకే సంతుష్టుడై ఆయురారోగ్యభాగ్యాదులనుగ్రహిస్తాడు. కొండకు రాలేనివారు కొండకేసి చూస్తూ దండంపెడితే చాలు అనుగ్రహిస్తాడు. తన పట్ల భక్తి కలవారిని కాపాడుతాడు. ఇలాంటి విశేషాలు, మహిమల కారణంగా దేవతలు కూడ భూలోకంలో ఏదో రూపాన వసించాలని కోరుకుంటారు.

కృత, త్రేత, ద్వాపరయుగాలలో స్వామి సాక్షాత్కారం దుర్లభం. కానీ, కలియుగంలో ముహూర్తకాలం స్మరించినవారికి దర్శించే వారికి సుప్రసన్నుడు. ఈ రహస్యం తెలిసిన నానా ద్వీపాంతరవాసులు, సకలదేశ వాసులు స్వామిపట్ల, భక్తిని పెంచుకుంటారు. శ్రీవేంకటేశ్వరునికి సమానుడైన దైవం మరొకరు లేరు. పుష్కరిణికి సమానమైన తీర్థం మరొకటి లేనే లేదు. కృతత్రేతా ద్వాపరయుగాలలో వేంకటాద్రి కనక మయం. కలియుగంలో శిలామయం.

ఇలాంటి ఎన్నో మహిమలు, వింతలు గలది వేంకటాద్రి. శ్రీనివాసుణ్ణి కేవలం స్వమతస్థులే కాదు. అన్యమతస్థులు కూడ సేవిస్తుంటారు. స్వామి పట్ల గల భక్తి కారణంగా వారి వారి కోరికలు గూడ సఫలమౌతున్నాయి.

కలియుగంలోని మానవులకు ధార్మిక చింతన చాలా తక్కువ. వీరిలో చాల మందికి ధనార్జనపట్లనే ఆసక్తి. సజ్జన సహవాసం కంటే దుర్జనులతోడి నెయ్యమే వారికి ఇష్టం. ఈ కారణాన వారు ఏకాగ్రతతో హరిని ధ్యానించలేరు. నిజంగా వారు కూడ అన్యచింతలు మాని శ్రీనివాసుని సేవించగలిగితే వారందరికి ముక్తి కరతలామలకం.

శ్రీనివాసుని కృపకు వైష్ణవధర్మమొకటే శరణ్యం. వరాహదేవుడు భూమాతకు చెప్పిన రహస్యం వైష్ణవధర్మం. అలాగే ప్రసక్తానుప్రసక్తంగా జీవబ్రహ్మ ప్రశంసలను హఠయోగం, రాజయోగాలను విశదీకరిస్తూ సచ్ఛిష్యలక్షణాలను కూడా విశదం చేశాడు. (ఇంకా ఉంది)

## గ్రంథసమీక్ష

ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ విరచిత

## వసుంధరావృత్త తారావళి (పద్యకృతి)

మిత్రవ్యాఖ్యా సహితం

**రచయిత్రి–** ఆచార్య వెలువోలు నాగరాజ్యలక్ష్మి; **సైజు–**1/8 డెమ్మీ; **పుటలు–**100; **ధర–**రూ. 175/–; **ప్రతులకు–**ఆచార్య వెలువోలు నాగరాజ్యలక్ష్మి, 301. రామన్న టవర్స్, 1లేన్, రామన్నపేట, గుంటూరు. చరవాణి– 93941 13848

జీవి సర్వతోముఖాభివృద్ధికి నిరంతరం తోడ్పడే పంచభూతాలలో మొట్టమొదటిదైన వసంధర విశిష్టతను చక్కని, రసవంతమైన పద్య రూపంలో అందించిన కావ్యం **'వసంధరావృత్తతారావళి'**. ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ విరచిత ఈ పద్యకృతికి ఆచార్య వెలువోలు నాగరాజ్యలక్ష్మి సంతరించిన 'మిత్ర'వ్యాఖ్య ఇది.

అధర్వవేదం "మాతా భూమిః పుత్రోऽహం పృథివ్యాః సదా" అని చాటిచెప్పింది. మన సనాతన పారంపరిక జాతీయతాభావాన్ని ప్రతిఫలింపజేసే ఈ సూత్రానికి వ్యాఖ్యానరూపమే ఈ తారావళి. మాతృభూమి కేవలం జీవికి నివాసయోగ్యమైన స్థానం మాత్రమే కాదని, ఇది కర్మభూమి, పుణ్యభూమి అని తాత్త్వికరీతిలో ఈ కావ్యం నిరూపించింది. భూమి ఉపరితలంలోని మహాసాగరాలు, నదీనదాలు, పర్వతాలు, అరణ్యాలు వంటి అద్భుతాలనే కాక భూమి లోపలి పొరల లోని రహస్యాలను సైతం ఈ పద్యాలు ఆవిష్కరించాయి. ఇటు వైదిక మహర్షుల మంత్రాలను, అటు శాస్త్రపరిశోధనల ఫలితాలను సమన్వయరూపంలో అందించిన విశిష్టతారావళి ఇది. ఇందులోని విశేషాలను వ్యాఖ్యాత్రి వివరించిన తీరు ఆమె బహుముఖప్రతిభావిశిష్టతకు అద్దం పడుతుంది. అనేక పౌరాణికవృత్తాంతాల్ని సమన్వయించి, దానికి సందర్భోచితమైన వేదప్రమాణాలను, మహాకావ్యాల వర్ణనలను ఉటంకించి సామాన్యపాఠకులకు సైతం విషయవివేచన కావించిన మిత్రవ్యాఖ్య పరమరమణీయం. అప్పాజోస్యుల సత్యనారాయణగారు దర్శించిన పృథివీ మహత్త్వ సంపదను నాగరాజ్యలక్ష్మిగారు తమ వ్యాఖ్యలో పరిపూర్ణంగా పలువురికి పంచిపెట్టారు. కవి ప్రతిభకు పట్టం కట్టిన మిత్రవ్యాఖ్యను అందించిన వ్యాఖ్యాత్రి వైదుష్యం అభినందనీయం.

– డా॥ కె. రాధారమణ



(ఈనెల 3వ తేదీ భగినీహస్త భోజనం సందర్భంగా...)

# సోదరులకు.. నరకం తప్పించే పండుగ

- శ్రీమతి లేళ్ళపల్లి శ్రీదేవి రమేష్,
94453 60139

కార్తికశుద్ధవిదియను మనమంతా పర్వదినంగా భావిస్తాం. దీపావళి వెళ్లిన రెండురోజులకు వచ్చే విదియ రోజు భగినీహస్త భోజనం జరుపుకుంటారు. భగిని అంటే సోదరి అని అర్థం. సోదరి చేసిన వంటలు స్వయంగా తానే తన సోదరులకు స్వహస్తాలతో వడ్డిస్తుంది. అందుకే ఈ పర్వదినాన్ని భగినీ హస్త భోజనం అంటారు. ఈ రోజును యమ ద్వితీయ, పుష్ప ద్వితీయ, కాంతి ద్వితీయ, భ్రాతృ విదియ, భాయ్ దూజ్ వంటి అనేక పేర్లతో పిలుస్తారు. భగినీ హస్తభోజనం గురించి విభిన్న కథలు ప్రాచుర్యంలో ఉన్నాయి.

పురాణగాథ ప్రకారం సూర్యభగవానుడికి కుమారుడు యముడు, కుమార్తె యమున. చెల్లెలు యమున అన్నను తన ఇంటికి భోజనానికి ఆహ్వానిస్తుంది. రోజుల తరబడి ఆయనకు వీలుపడదు. ఓ రోజున మార్కండేయుడి ప్రాణాన్ని హస్తగతం చేసుకునేందుకు యముడు పాశాలతో వెళ్తాడు. అప్పుడు ఆ బాలభక్తుడు మహాశివుణ్ణి శరణు వేడుకుంటాడు. స్వామి త్రిశూలం తీసుకుని యముడి వెంటపడటంతో, ఆయన తన చెల్లెలి ఇంటికి వెళ్లి తలదాచుకుంటాడు.

అన్న ఇన్నాళ్లకు వచ్చాడన్న ఆనందంతో సోదరి సకల మర్యాదలు చేస్తుంది. రుచికరమైన పిండివంటలతో విందు వడ్డిస్తుంది. భోజనం చేస్తున్న వారిని సంహరించరాదని శివుడు



తిరిగి వెళ్లిపోతాడు. యముడు చెల్లెలి వల్ల శివుడి నుండి రక్షింపబడుతాడు.

మరోవైపు అన్నకు తృప్తికరంగా భోజనం పెట్టాలన్న యమున చిరకాలవాంఛ నెరవేరుతుంది. శివుడి ఆగ్రహానికి గురి కాకుండా తనకు రక్షణ కల్పించిన చెల్లెలి అతిథి మర్యాదలకు యముడు ముగ్ధుడౌతాడు.

ఆమెను ఏదైనా వరం కోరుకొమ్మంటాడు. ఈ రోజున చెల్లెలి ఇంటికి వెళ్లి, ఆమె చేతి వంట తినే సోదరుడికి నరక లోకవాసం లేదా అపమృత్యుదోషం కలగరాదని యమున కోరుతుంది. ఆయన పరమానందభరితుడౌతాడు.

ఏటా కార్తికశుద్ధవిదియనాడు ఇంటికి వచ్చి, ఆమె చేతివంట తింటానని వరం ప్రసాదిస్తాడు యముడు. ఇదే రోజున తన సోదరి ఇంట ఏ సోదరుడు భోజనం చేస్తాడో అతడికి ఎలాంటి భయమూ ఉండదంటూ యముడు వరం అనుగ్రహిస్తాడు. అంతేకాదు, సోదరుడికి ఈరోజున తన చేతితో వండి వడ్డించే స్త్రీ సౌభాగ్యవతి అవుతుంది అని వరమిచ్చి చెల్లెలి ప్రేమపూర్వకమైన వీడ్కోలు పొంది యముడు తిరిగి వెళ్తాడు. ఇది 'భగినీ హస్తభోజనం'గా ప్రాచుర్యంలోకి వచ్చింది.

తోబుట్టువు ఇంట్లో భోజనం చేసినప్పుడు సోదరుడు ఆమెకు చీర, పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, ఇతర కానుకలిచ్చే సంప్రదాయమూ ఉంది.

సోదరులు లేని వారు చంద్రుడిని సోదరుడిగా భావించి ఆనాడు చంద్రుడికి అర్ఘ్యప్రదానం చేస్తారు. అంతకుముందు (కార్తిక శుద్ధపాడ్యమి) పూజలందుకున్న బలి ఈరోజే వీడ్కోలు పొంది, పాతాళానికి వెళ్తాడనీ కొందరు విశ్వసిస్తారు.

ఈ పర్వదినం రోజునే చిత్రగుప్తుడు కూడా జన్మించాడు. యముడితో పాటు చిత్రగుప్తుడు కూడా మహిళల పూజ లందుకుంటాడు. ఈ రోజు చేసే దానధర్మాల కారణంగా విశేషపుణ్యఫలం ప్రాప్తిస్తుందని భక్తుల నమ్మకం. ఈ యాంత్రిక యుగంలో కుటుంబసభ్యుల మధ్య పరస్పర అవగాహన, సంబంధబాంధవ్యాలు క్రమక్రమంగా సన్నగిల్లుతున్నాయి. వాటిని తిరిగి నెలకొల్పడానికి, పునరుద్ధరణ ద్వారా భారతీయ కుటుంబ వ్యవస్థ వెలుగొందేలా చేయడానికి ఇలాంటి పండుగలు దోహద పడతాయి.

ఈ పండగను దీపావళి అయిన రెండోరోజు భారత దేశంతో పాటు నేపాల్లో కూడా జరుపుకొంటారు. ఈ రోజున సోదరులను ఇంటికి పిలిచి వారి నుదుట బొట్టు పెట్టి, హారతి ఇచ్చి, మిఠాయిలు తినిపించి అక్కాచెల్లెళ్లు వారికి శుభాకాంక్షలు తెలుపుతారు. తమ సోదరులు ఆరోగ్యంగా ఉండాలని దేవుడిని ప్రార్థిస్తారు. సోదరులు అక్క చెల్లెళ్లకు కానుకలు ఇచ్చి ఆశీర్వదిస్తారు.

### ఇంకో కథ ప్రకారం..

శ్రీకృష్ణుడు నరకాసురుణ్ణి వధించి నేరుగా తన చెల్లెలు సుభద్ర ఇంటికి వస్తాడు. అప్పుడు ఆమె శ్రీకృష్ణుడికి హారతి ఇచ్చి, తిలకం దిద్ది లోనికి ఆహ్వానిస్తుంది. యుద్ధంలో అలసి వచ్చిన అన్నకు ఆప్యాయంగా రకరకాల వంటలు చేసి భోజనం వడ్డిస్తుంది ఈ భగినీవిదియనాడు.



హర్యానా, మహారాష్ట్ర తదితర ప్రాంతాల్లో సోదరులు లేని వారు చంద్రునికి హారతి ఇచ్చి ఈ పండుగ చేసుకుంటారు. మహారాష్ట్రలో ఈ పండుగను 'భయ్యా - దుజ్' అని పిలుస్తారు. నేపాల్ ప్రాంతంలో భాయి టికా అని పిలుస్తారు. పంజాబ్ ప్రాంతంలో ఈపండుగను 'టిక్కా' అని పిలుస్తారు..

ఈ పండుగ ఒక రకమైన సామాజిక అనుబంధాలు పెంచుకునే ప్రయత్నం చేసే పండుగ. ప్రస్తుతకాలంలో ఇలాంటి పండుగలు చాలా అవసరం. అనుబంధాలు కరవవుతున్న ఈ తరుణంలో ఇలాటి పనులు చేయడం తప్పనిసరి.

### సెప్టెంబరు నెల క్విజ్-26 సమాధానాలు

| | |
|---|---|
| 01) వినాయకుడు | 11) బలరాముడికి |
| 02) వినాయకుడు | 12) బలరాముని |
| 03) సనకసనందనులు | 13) సంకర్షణుడు |
| 04) వరాహజయంతి | 14) వామనజయంతి |
| 05) వరాహమూర్తి | 15) వామనుడు |
| 06) వరాహస్వామి ఆలయం | 16) ఋషిపంచమి |
| 07) వనకర్త | 17) బృహదారణ్యకోపనిషత్తు |
| 08) వాజినీవతి | 18) కుముద్వతి |
| 09) సరస్వతి | 19) అనంతపద్మనాభవ్రతం |
| 10) బలరాముడు | 20) రంగం లేక మేడ |

**సరైన సమాధానాలు రాసినవారు-**

1) పోలేపల్లె ఇశాన్వి, ఆళ్ళగడ్డ.
2) బి.సూర్యక్రిష్ణవిరాజ్, బెంగళూరు.
3) ఆదిత్య, కరీంనగర్.
14) ఎస్.సాత్త్విక, మెదక్.
5) యశస్విని, ఖమ్మం.
6) పి.ధరణి, బేతంచర్ల.
7) టి.జైవీరవరుణ్, హైదరాబాదు.
8) ఎం.అభిజ్ఞ, హైదరాబాదు.
9) వి.ఎస్.వి.ఎస్.ఎస్.ఆర్.సాత్త్విక్, హైదరాబాదు
10) ఓ.అతిలితు రెడ్డి, హైదరాబాదు.
4) నరసింహదేవరగౌతమ్ మహేష్, కాకరపఱ్ఱు
11) పి.లికిత్ క్రిష్ట, తిరుపతి.
12) జి.శ్రీగౌతమ్, కురబలకోట.
13) ఎం.కీర్తికా, కుతుకులూరు.
15) బి.హితేంద్ర, రెడ్డిపేట

**సవరణ-** క్విజ్-24(జూలై,2024) సమాధానాలు సెప్టెంబరు, 2024 సంచికలో ప్రచురించాం. వాటిలో కొన్ని పొరబాట్లు వచ్చాయి. వాటికి సరైన జవాబులు-8వ ప్రశ్నకు **వేదవ్యాసుడు**, 11వ ప్రశ్నకు **నారదమహర్షి**, 17వ ప్రశ్నకు **జూలై,16**.

# ఆరోగ్యకరం.. కార్తికం

- బ్రహ్మశ్రీ మైలవరపు శ్రీనివాసరావు



ఎంతటి అధికారం ఉన్నా, ధనం ఉన్నా 'ఏది ప్రశాంతతకి మార్గం?' అంటే తనువూ మనసూ అనే రెండూ ఆరోగ్యకరంగా ఉన్నప్పుడే! శరీరం వ్యాధిగ్రస్తమై ఉండి మనసు పరిశుభ్రంగా ఉన్నా ప్రయోజనంలేదు- అదే తీరుగా శరీరం అందంగానూ, ఆరోగ్యకరంగానూ ఉన్నా మనసు పరిశుభ్రంగాలేని పక్షంలో ఈ అందం, ఆరోగ్యం వ్యర్థమే. అందుకే యోగం (శరీరం, మనసు అంటే రెంటి కలయిక) ముఖ్యమన్నారు పెద్దలు.

అలా శరీరానికీ, మనసుకీ శిక్షణ నిప్పించేదీ అలాగే అమలు జరిగేలా చూసేదీ కూడా కార్తికమే. అందుకే శాస్త్రం అంది- కార్తికమాసంతో సమానమైన మాసం మరోటిలేదని. ఎలాగో వివరించుకుందాం!

### శరీరశుభ్రత ముఖ్యం!

పాలని కాచాలన్నప్పుడు నేరుగా పాలని అలా పొయ్యిలో పోసెయ్యం. ఆ పాలని ఓ గిన్నెలో పోసి పొయ్యి మీద కదా పెడతాం! అలాగే మనసుని శుభ్రపరచాలంటే ముందుగా- ఆ మనసుని తనలో దాచుకుని ఉన్న శరీరాన్ని శుభ్రపరచాలి.

అందుకే కార్తికమాసం వచ్చీరాగానే మొదటి రోజు (పాడ్యమి) నుండే స్నానాలు తప్పనిసరి అంది శాస్త్రం. ఈ స్నానాలకు కొన్ని నియమాలను ఏర్పాటుచేసింది. ఏదో ఒకలా స్నానం చేస్తే శరీరపు మురికి పోవచ్చునేమో గాని మనసుని శుభ్రపరచగల స్నానం కాదనేది ప్రాచీనుల నిర్ణయం. అందుకే కొన్ని పద్ధతులను చెప్పారు. ఆకాశంలో కృత్తికానక్షత్రం ఆరునక్షత్రాల సమూహంతో కన్పిస్తుంది. ఆ నక్షత్రం కన్పిస్తున్న సమయంలోనే (తెల్లవారు జాము 5.30లోగా) స్నానం చేసిన పక్షంలో అది 'కార్తికస్నానం' అన్పించుకుంటుంది. శాస్త్ర మెప్పుడూ మనకు ప్రయోజనం సిద్ధించాలనే అభిప్రాయంతో శాసించినట్టే చెప్తుంది.

నిజానికి నూటికి ఓ ఐదుమంది ఉండొచ్చు ఇలా స్నానం చేసేవారు. అలాగని కార్తికస్నానానికి సరిపడ్డ తీరులో స్నానం చేయ(లే)నివారిని తప్పుపట్టకూడదు. దీనిక్కారణం కార్తికస్నానాన్ని ఏడు విధాలుగా చేయొచ్చని శాస్త్రమే చెప్పింది కనుక!

**ఈనెల 2వ తేదీ నుండి కార్తికమాసం ప్రారంభం..**

### ఏడు తీరుల స్నానాలు...

**01)** నీటికున్న శక్తిని వివరిస్తూ యజుర్వేదంలో కొన్ని మంత్రాలున్నాయి *(ఆపో హి ష్ఠా మయోభువః... యథా చ న)*. ఆ మంత్రాలను చదువుతూ చేసే స్నానాన్ని 'మాంత్ర స్నానం' (మంత్రపూర్వకంగా చేసేది కాబట్టి) అన్నారు.

**02)** ఏదో ప్రయాణంలో ఉన్న కారణంగా తెల్లవారుజామున స్నానం చేయ(లే)ని పక్షంలో గోధూళి (ఆవు నడిచిన నేల ధూళి)ని తలమీద కొద్దిగా చల్లుకుంటే దాన్ని 'వాయవ్య స్నాన'మన్నారు.

**03)** ఇంట్లోనే ఉన్నా అనారోగ్యకారణంగా తెల్లవారుజామున స్నానం వీలుపడని పక్షంలో నుదుటికి భస్మాన్ని రాసుకుని కొద్దిగా విభూతిజలాన్ని తలమీద చల్లుకుంటే దాన్ని '**ఆగ్నేయ స్నాన**'మన్నారు.

**04)** పారే నదికి వెళ్లి స్నానం చేసే అవకాశం దూరం భారం అయిన పక్షంలో ఇంట్లోని నీటితోనే సకాలంలో స్నానం చేస్తే దాన్ని '**వారుణ స్నాన**'మన్నారు.

**05)** వయసుమీదపడి తెల్లవారుజామున లేవడమే సాధ్యంకాని పక్షంలోనూ, వృత్తిఉద్యోగాలు రాత్రి వేళల్లోనే అవుతూ తెల్లవారుజాము స్నానం సాధ్యంకాని పక్షంలోనూ నిద్రలేచి స్నానాన్ని చేశాక క్షణకాలంపాటు ఎండలో నిలబడి మనఃపూర్వకంగా తన నిస్పృహాయతను వ్యక్తీకరించుకున్నట్లయితే దాన్ని '**ఆతప స్నాన**'మన్నారు.

**06)** ఇక సకాలంలో స్నానంచేసినా కాలకృత్యాల కారణంగా మళ్లీ స్నానం చేయవలసివస్తే బొడ్డుపై భాగాన్ని తడిగుడ్డతో తుడుచుకుంటూ, బొడ్డు నుండి కింది భాగానికి స్నానాన్ని చేస్తే దాన్ని '**కాపిల స్నాన**'మన్నారు. అంతేకాదు ఏదైనా గాయం శరీరభాగానికి అయిన పక్షంలో కూడా ఆ భాగాన్ని తడి గుడ్డతో తుడిచి మిగిలిన భాగాన్ని స్నానాన్ని చేయించినట్లైతే (ఆరోగ్యానికి వ్యతిరేకం కాకుండా మాత్రమే) దాన్నీ '**కాపిల స్నాన**' మేనన్నారు.



**07)** ఇన్ని తీరుల స్నానాలనేసరికి 'ఏది గొప్ప?'దనే అనుమానం వస్తుంది గదా! అందుకని ఋషులు చెప్పారు– '**ఉత్తమం మానసం స్నానం విష్ణోః స్మరణ పూర్వకమ్**'– ఏ స్నానాన్ని పై తీరుల్లో చేసినా విష్ణువుని స్మరిస్తూ ('గోవిందా' అనో 'నారాయణా'అనో మరో విధంగానైనా సరే) చేసే స్నానమే '**ఉత్తమస్నాన**'మని.

## మనసుకి శుద్ధి అవసరం

పై తీరుగా శరీరానికి శుద్ధి కలిగి శరీరం ఆరోగ్యకరంగా ఉన్నాక మనసుకు ఆరోగ్యం అవసరం. అందుకే చిన్నప్పటి బాంధవ్యాన్ని గుర్తుంచుకోవాలి. అలాంటి అభిప్రాయాన్ని గట్టి చేస్తూ కార్తికమాస పు రెండవరోజునే అక్కా లేక చెల్లెలూ గనుక ఉంటే వాళ్ల ఇంటికెళ్లి వాళ్లు



స్వయంగా వండిన వంటనే తిని వస్త్రాలనిచ్చి రావాలన్నారు మన పెద్దలు. కాబట్టి మనశ్శుద్ధికి మంత్రం తోబుట్టువులతో చక్కగా ఉండడమన్న మాట. ఏదైనా ఒక చిన్న ఇబ్బంది వచ్చినా కష్టాన్ని తోబుట్టువుతో కూడా పంచుకోవాలని భావం.

ఇక కార్తికపు నాల్గవరోజున నాగులచవితి పేరిట పుట్టలో పాలని పోస్తాం. వ్యక్తి నేలమీద కూర్చున్నప్పుడు వెనుకనుండి చూస్తే పిరుదుభాగం పుట్ట అడుగుభాగం లాగా, పైపైకి పోనుపోను ఇటు అటు ఏటవాలు తగ్గుతూ ఉన్న ఆ శరీరం పుట్ట పైభాగంలా కన్పిస్తూ ఉండే వ్యక్తి కూడా ఓ పుట్టలానే కన్పిస్తాడు. పుట్ట పైభాగంలో పాలు పోయడమంటే వ్యక్తికున్న శిరసులోని మధ్యభాగమైన బ్రహ్మరంధ్రంలోనికి జ్ఞానమనే పాలని పోయడమే అని భావం. అక్కడ జ్ఞానాన్ని పోస్తే శరీరమంతా వ్యాపిస్తుంది కాబట్టి, మంచి ప్రసంగాలను వినడం, సజ్జనసాంగత్యం, చక్కని పుస్తకాలను చదవడంవంటి పద్ధతుల ద్వారా బుద్ధిని శుభ్రపరుచుకోవాలి. అదే దాని అదుపులో ఉండే శరీరావయవాలన్నింటినీ సరైన తీరులో నడిచేలా చేసుకోవాలని భావం.

## క్రమక్రమంగా ఎదుగుదల

ఇక ఆరవరోజున వచ్చే అగ్ని షష్ఠి ద్వారా శరీరంలో ఉండే జఠరాగ్నినీ (జీర్ణక్రియని సక్రమంగా ఉంచేది ఇదే) శరీర మంతా వ్యాపించి ఉన్న వైశ్వానరాగ్నినీ సరైన తీరులో రక్షించు కుంటూ ఉండాలని తెలుసుకోవాలి. కోపం వల్ల శరీరంలోని అగ్నిజ్వాల పెరుగుతుంది.

పట్టుదల, అసూయ, ద్వేషంవంటి లక్షణాల ద్వారా కూడా ఈ అగ్నితీవ్రత పెరిగి ఆ అగ్ని ఆ వ్యక్తినే దహించి వేస్తుంది. అందుకే పై అవగుణాలను అగ్నితోనే పోలుస్తూ విద్వేషాన్ని కోపాగ్ని... అంటూ మనను పరోక్షంగా మౌనంగా మందలిస్తుంటారు పెద్దలు. ఇలా గనుక మనసుని సాధన చేస్తూ ఒక తోవకి తేగలిగితే కార్తిక అష్టమి నాటికి గోవుతో సమానమైన సాత్త్వికలక్షణం అలవడుతుందని పరోక్షంగా చెప్తూ 'గోష్టాష్టమీ వ్రతాన్ని ప్రారంభించాలి 8వ రోజున' అన్నారు. అపకారబుద్ధి లేకుండా ఆవులా సాధువులా ఉండాలని కదా దీని భావం.



కార్తికంలో వచ్చే 11వ రోజుని 'ఉత్థాన ఏకాదశి' అంటారు. ఒక శుభ కార్యానికి మనం వెళ్లబోయే వేళ చక్కని వస్త్రాలు, వారికియ్యాల్సిన బహు మానాలు ఇలా అన్నిటినీ సిద్ధం చేసుకుని మాత్రమే ప్రయాణానికి అడుగువేస్తామో అలా ఈ ఏకా దశినాడు యోగనిద్ర నుండి మేల్కొనే శ్రీహరిని నిజమైన మనసనే కన్నులతో దర్శించ డానికి పైన అనుకున్న ఇన్ని ప్రయత్నాలనీ చేసుకోవాలన్న మాట. మనం ఈ ఉత్థాన ఏకాదశి నాడు కనీసం శ్రీవిష్ణుసహస్రనామాలను 11 సార్లయినా (11వ రోజు కదా!) పఠించగలిగితే దీనికి మీదటి రోజైన క్షీరాబ్ది ద్వాదశినాడు శ్రీహరిని ఋషులు దేవతలతో పాటు మనమూ చూడగలుగుతాం అంతశ్చక్షువులతో.

ఈ స్థాయిలో మనకు మనసునీబుద్ధినీ సహకరించేలా, చేయాలంటే మొదట్లో అనుకున్న కార్తికస్నానాలను నిత్యంచేస్తూ ఉండాల్సిందే!

## మనసుతో, బుద్ధితో...

ఇలా స్నానాలనీ, మనస్సాధననీ చేస్తూ ఉంటే 14వ రోజున వైకుంఠంలో శ్రీహరి ఎలా ఉంటాడో ఆ రూపాన్ని దర్శించుకోగలం. అందుకే 14వ రోజుని వైకుంఠచతుర్దశి అన్నారు. 'వికుంఠ'మంటే మొక్కపోవడం, పదును లేకపోవడమని అర్థం. మన చేతులలో, పాదాల్లో, కళ్లలో, మనసులో, బుద్ధిలో ఇలా కర్మేంద్రియ, జ్ఞానేంద్రియాల్లో పుట్టిన ఏ దైవవ్యతిరేకత ఎలాంటిదైనాసరే మొక్కపోతుంది- అంటే ఆ ఆలోచనే మనకు కలగదు.

ఇది నిజం కాబట్టే శ్రీకృష్ణుడే తమకు సర్వవిధాలా అండగా ఉన్న నిండుకొలువులో ద్రౌపదికి వస్త్రాపహరణం, అర్జునునికి పుత్రశోకం, ధర్మరాజుకు యుద్ధంలో అవమానం, పాండవులకు భిక్షాటన పరిస్థితీ వంటివి వచ్చినా-"కృష్ణా? అండగా మాకుండి ఏం చేశా?"వని ఏ ఒక్కరూ అడగలేదు సరి కదా ఆరాధిస్తూనే వచ్చారు-స్వర్గారోహణాన్ని చేయగలిగారు కూడా.

ఇక 15వ రోజున వచ్చేది పూర్ణిమ. దీన్నే 'కార్తిక పూర్ణిమ' అంటారు. శరీరంలో ఉండే అవగుణాలన్నింటినీ ఎండుగడ్డితో పేనిన ఒక తాడులాగా చేసి దాన్ని పరమేశ్వరుని సమక్షంలోనే బుగ్గిచేయడం ఈ రోజు చేస్తున్న జ్వాలాతోరణం లోని అంతరార్థం. ఈ దశకు చేరుకున్న సాధకునికి సంపూర్ణ చంద్రుడు దర్శనమిస్తాడు. అంటే వెన్నెలలో ప్రకృతి ఎంత ప్రశాంతంగా, ఆహ్లాదకరంగా, ప్రసన్నంగా కన్పిస్తుందో అలా దర్శించగలిగిన స్థాయికొచ్చేస్తాడు సాధకుడు. సాధకుడనగానే గడ్డాలు, మీసాలు బ్రహ్మచర్యం ఉపవాసం... ఇదేమీ కాదు. నిత్యజీవితంలో వృత్తిఉద్యోగాలను చేసుకుంటూనే నిత్య నియమంగా అవకాశం ఉన్నంత సమయంలో క్రమం తప్పక దైవాన్ని ధ్యానించడమే సాధన అంటే. మనసుని అదుపు చేస్తే ఇదేమీ కష్టమైన అంశం కాదు.

అందుకే పన్నెండు పూర్ణిమలు మనకున్నా 'కార్తిక పూర్ణిమ'ని మాత్రమే మరింత గొప్పగా చెప్పుకుంటాం- దీని వెనుక ఇంత సాధన చేసి దర్శించగల శక్తి ఉందనే విషయాన్ని గమనింపజేయడానికే! ఈ తీరుగా దర్శించారు కాబట్టే వ్యాసుని పేరిట 'పూర్ణిమ'ను ఏర్పాటు చేస్తూ వ్యాసపూర్ణిమని ఒక పండుగ చేశారు. మనమూ శరీరాన్నీ పై తీరుగా మనసునీ కూడా శుభ్ర పరుచుకుని పూర్ణిమపండుగని సంతోషంగా చేసుకుందాం! ఎల్లకాలం!!



# అమ్మవారి పుట్టింటి మమకారం

– శ్రీ ఎ.పి.దేవదాస్, 99486 12971

తిరుపతికి దగ్గర్లోని తిరుచానూరుకు అలమేలుమంగాపురమని పేరు. ఇది తమిళ నామం. తమిళంలో 'అలర్' అంటే పద్మం. 'మేల్' అంటే పైన, 'మంగై' అంటే ఆసీనురాలైన యువతి అని స్థూలార్థం. స్వామిని కీర్తించిన ఆళువార్లు 'అలర్ మేల్ మంగై ఉరై మారాలు' అని కొనియాడారు. ఆళ్వారుల మీది భక్తితో తమిళులు నేటికీ అలమేలుమంగాపురమనే వ్యవహరిస్తున్నారు.

ఈ అమ్మవారికి 'పద్మావతి' అని మరోపేరు. అమ్మవారి ఆలయానికి దగ్గరలోని సరోవరానికి పద్మసరోవరమని పేరు. ఈ సరోవరం లోనే అమ్మవారు ముక్కోటి దేవతలు చూస్తుండగా పద్మం నుండి ఆవిర్భవించారు.

అమ్మవారు వాత్సల్యపూర్ణ. కారుణ్యశీల. వరప్రదాత్రి.

ఇవన్నీ ఒక ఎత్తయితే అమ్మవారికి పుట్టింటి వారంటే ఎంతో ఇష్టమని చాలామందికి తెలియదు. అంతేగాదు పుట్టింటి వారు తనకు అర్పించే సారెలంటే మరీ ప్రీతి. ఎవరా పుట్టింటి వారంటే తన పేరుతో పిలువబడే పద్మశాలీలు. ఈ నిర్ణయానికి పౌరాణిక ఆధారాలున్నాయా, చారిత్రక ఆధారాలున్నాయా అంటే ఇందుకు సరైందిదీ, ఎదుటివారు నోరెత్తకుండా చేయగల తామ్రశాసనం 'పాదకానుక శాసనం'.

ఈ శాసనకాలం ఏనాటిదనడం కుతూహలం కలిగించే అంశం. ఈ శాసనం శుభకృత్ మాఘ శుక్ల పూర్ణిమ అంటే 1493 కార్తికశుక్లపూర్ణిమ నాటిది. పద్మావతీదేవి తాను పద్మశాలీల ఆడపడుచు అంటూ స్వయంగా సాక్ష్యమిచ్చిన వృత్తాంతం. ఈ వృత్తాంతం మెకంజీ కైఫీయత్తులలో కూడా ప్రస్తావితం (వాల్యూం 15-4-18 పుట 57 అద్దాని కాపి ప్రతి వాల్యూమ్ 48, పుట 443) మదరాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారంలో ఉంది.

ఏ శాసనం వెలువడడానికైనా తప్పక ఒక కారణ ముంటుంది. ఈ 'పాదకానుక' శాసనానికి ఒక హేతువు ఉంది. ఈ శాసనం 182 పంక్తులది. 'స్వస్తిశ్రీ విజయాభ్యుదయ' అని మొదలై చివర 'పరదత్తాపహారేణ స్వదత్తం నిష్ఫలం భవేత్'తో పూర్తవుతుంది. ఇదే పద్మశాలీయులు తమ గురువైన తాళ్లపాక తిరువేంగళనాథుల (చిన్నన్న) వారికి ఇచ్చిన దానశాసనం. ఇక రెండవప్రశ్న ఎందుకీ దానశాసన మన్నది. తమకు జాంద్ర కులస్థులకు మధ్య ఏర్పడ్డ వివాదంలో తిరువేంగళనాథుడు ఈ వివాదానికి అమ్మవారే స్పష్టి పలకాలని అలమేలుమంగాపురంలో అమ్మవారి సన్నిధిలో ప్రార్థన చేయగా అమ్మ తాను పద్మశాలి పుట్టింటిదానను అని స్పష్టంగా తేల్చి చెప్పడంతో పద్మశాలీల సంతోషంతో తమ గురువులకు కానుకగా అవ్వేళ పదివేల వరహాలు సమర్పించారు. ఆ పదివేలవరహాల గురుదక్షిణకు తోడుగా చిన్నన్న తన భండారం నుండి మరొక పదివేల వరహాలను జతచేసి చంద్రగిరికి తూర్పున 'ఆళ్ళగట్టు' అనే పేరుగల బలపపు రాతిగనిని కొన్నట్టు, అద్దానిని జాతికి అంకిత

**ఈ నెల 27 నుండి**
**శ్రీపద్మావతీ అమ్మవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం**

మిచ్చినట్లు శాసనం రాయించాడు. అలాగే ఆ రాతిగనిని ఎలా వాడుకోవాలో, దాని వల్ల లభించే పుణ్యఫలితాలను కూడా పొందుపరచాడు.

పద్మశాలీ, జాంద్రల మధ్య వివాదానికి అనేక కారణాలున్నా పరంపరగా చెప్పుకునే కారణం. జాంద్రవారు శైవ మతాభిమానులు. పద్మశాలీలు వైష్ణవం వైపు మొగ్గిన వారు కావడమే. ఉపకులాల మధ్య కారణాంతరాల వల్ల వివాదాలు ఏర్పడడం సహజమే. ఆ వివాదాలు కొన్ని సందర్భాలలో తీవ్ర మౌతుంటాయి. పద్మావతి అమ్మవారికి తొలుత సారె అర్పించే అధికారం ఎవరిదనే వివాదం ఉపకులాల మధ్య పరిష్కారం కాలేదు. చివరకు ఈ ఇరుకులాల వారు తమ గురువుల దగ్గర తేల్చుకొందామన్నారు. వారి గురువు తాళ్లపాక తిరువేంగళ నాథులు. ఉభయుల వాదనలను విన్న తిరువేంగళనాథుడు ఈ వివాద పరిష్కారం తన పరిధిలో రాదని అమ్మవారి నిర్ణయం ప్రకారం నడచుకుందామని పరిష్కారమార్గం చెప్పారు. వారూ అంగీకరించారు. ఆలయంలో ఇరువర్గాల వారు చేరారు. తిరువేంగళనాథుడు అమ్మవారికి వారి వివాదాలను విన్నవించారు. అమ్మవారు ఆలకించి సాలెవారి వంశ వృక్షం బట్టి తాను పద్మశాలి వర్గం దానినే అని సాక్ష్యం చెప్పింది. ఆ కారణంగా ముందు సారె అర్పించే హక్కు పద్మశాలీలకే సంక్రమించింది. ఈనాటికీ ఈ సంప్రదాయం తిరుచానూరులో తి.తి.దే. వారి సౌజన్యంతో ఘనంగా భక్తిశ్రద్ధలతో బ్రహ్మోత్సవ సందర్భంలో 'సింహవాహన' సేవవేళ సౌజన్యంతో సాగుతోంది. ఆ మహోత్సవ సందర్భంలో వివిధప్రాంతాలనుండి విచ్చేసిన పద్మశాలీలవారు అమ్మవారికి అర్పించే 'చీరసారె' కార్యక్రమం నేటికి దర్శించదగ్గ కార్యక్రమం. ఇతర చారిత్రక, పౌరాణిక ప్రసిద్ధి గల ఆలయాలలో కేవలం ఇక్కడనే గాదు తి.తి.దే. ఆలయాలలో నారాయణవనం, కార్వేటినగరం, అహోబిలం ఆలయాలలోను పద్మసాలెవారు పుట్టింటి సారె అమ్మవారికి సమర్పించి కృతజ్ఞత ప్రకటించుకొంటున్నారు.

ఆ సందర్భంలో తి.తి.దే. వారు తిరుచానూరులో పద్మశాలిసంఘం, చిత్తూరుజిల్లాలో సామూహిక వేద ఆశీర్వచనాలతో సత్కరించడం ఆనవాయితీగా కొనసాగుతూ ఉంది.

పద్మసాలెవాళ్లు 'లక్ష్మిని' ఆరాధించడంలో ఆమె సాక్షాత్ వైకుంఠలక్ష్మి అనే భావన ఉండడమే. మహావిష్ణువులాగే అమ్మవారు కూడా అనేక అవతారాలెత్తినట్లు పౌరాణిక ఆధారాలున్నాయి. కనుక సంపదలను అనుగ్రహించేది, సాగరాత్మజ, విష్ణుపత్ని లక్ష్మిలాగే భృగుపుత్రి సాక్షాత్ లక్ష్మియే.

చిన్నన్నకు నాల్గవతరం వారైన శ్రీసూర్యనారాయణ గారు తనదగ్గరున్న అన్నమాచార్యులు అనుదినం పూజచేస్తున్న వేంకటేశ్వరస్వామి కాంస్యవిగ్రహాన్ని మంగాపురం ఆలయానికి ఇచ్చారు. అలాగే అన్నమాచార్యచరిత్ర కాగితపు ప్రతిని,

**తాళ్లపాక చిన్నన్న తామ్ర శాసనం**



మొదటి రేకు - మొదటి వైపు      మొదటి రేకు - రెండవ వైపు

## తాళ్లపాక చిన్నన్న తామ్ర శాసనం



రెండవ రేకు - మొదటి వైపు      రెండవ రేకు - రెండవ వైపు

పద్మశాలీలు చిన్నన్నకు ఇచ్చిన తామ్రఫలకాన్ని తి.తి.దే. ప్రాచ్య పరిశోధనా సంస్థకు అప్పగించారు. ఈ శాసనాలను మానవల్లి రామకృష్ణకవి 1932 ఆగస్టులో వాల్యుం.1, పార్ట్ 1 భాగంగా ముద్రించారు. శాసన భాగాన్ని ఆపై అందులోని అంశాలను ఆంగ్లంలో 98-186 మొత్తం 8పుటలలో వివరించారు. ప్రస్తుతం అసలు శాసనం తి.తి.దే. మ్యూజియంలో నేటికీ భద్రపరచబడి ఉంది. ఈ రేకుల కొలతలు $11^1/_4 \times 8$ రెండవ రేకు $11^3/_{16} \times 8^1/_{16}$ మందం $^1/_{16}$. మొదటిరేకు మొదటిపుటలో శ్రీవేంకటేశ్వరుని మూలరూపం చివర అలమేలుమంగమ్మ రేఖాచిత్రాలున్నాయి.



అమ్మవారు సాలెకులజులకు సాక్ష్యమిచ్చారనడం కల్పితం కాదు. ఇవన్నీ విశ్వాసాల మీద ఆధారపడ్డ అంశాలు.

ఏది ఏమైనా తిరుచానూరు ప్రాంతంలో నేటికీ నేతగాంధ్ర కులజుల నేకులున్నారు. వారు నేటికి అమ్మవారిని ఆరాధిస్తున్నవారే.

పద్మశాలికులజబహుభాగ్యంవంతులు
అమిత భక్తి కొలుచు అమ్మ కొనతె
పుట్టింటి వారిచ్చు పుత్తడిచీరను
నెమ్మితో తొడిగెడు నెలత యెవతె
జాంధ్రకులజులను సౌమ్యదృష్టిని చూచి
సతతంబు కాచెడి సాధ్వి యెవతె
ఆలయసీమలో నందరు వినుచుండ
సాక్ష్యంబు పలికిన జాణ యెవతె

పెక్కు వైష్ణవాలయముల పేర్మినెంచి
సారె లర్పించ గ్రహియించు సరసురాలు
భోగ భాగ్యాల సమకూర్చు పుణ్యమాత
అట్టి అలమేలుమంగమ్మ కంజలింతు.

**ఆధారగ్రంథం :**

Copper plate inscription of Tallapaka Tiruvengalanatha issued from Tiruchanur, S.V.V.U.Journal, Vol. 1 Part 1, 1939-40.

# కష్టాలన్నీ తొలగుతాయి

**ఈ నెల 9న తిరుమలలో జరిగే శ్రీవారి పుష్పయాగం సందర్భంగా...**

- డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ, 98662 34482



తిరుమల శ్రీవారి ఆలయం లోపల జరిగే ఉత్సవాలలో విశిష్టమైంది పుష్పయాగం. ఇతర యాగాలు ఎంత పవిత్రంగా, వేద మంత్రాలతో శోభాయమానంగా జరుగుతాయో అదే విధంగా జరిగే వార్షిక ఉత్సవ విశేషం 'పుష్పయాగం'.

తిరుమలకు ఎన్నో పేర్లున్నా 'పుష్పమండప'మనే పేరుంది. వైష్ణవాచార్యులైన 'అళగియ మణవాళప్పెరుమాళ్' తన ఆచార్యహృదయంలో తొలిసారిగా పుష్పమండపంగా ప్రస్తావించాడు. ఆళ్వారులలో ఒకరైన నమ్మళ్వార్ 'సిందుపూమణి తిరువేంగడమ్' అనడమే ఇందుకు ప్రధానకారణం.

తిరుమల శ్రీవారికి పుష్పసేవ 'తోమాల'తో మొదలౌతుంది. భుజంనుండి కిందికి వేలాడే మాల తోమాల. ఈ తోమాలసేవ రోజుకు రెండుసార్లు జరుగుతుంది. గురువారం సాయంత్రం పూలంగిసేవ జరుగుతుంది. ఆణివార ఆస్థానంరోజు 'పుష్పపల్లకి' మాడవీథుల్లో నిర్వహిస్తారు.

శ్రీపుష్పయాగం ఎందుకోసమనడం కుతూహలం కలిగించే ప్రశ్న. వైఖానస, పాంచరాత్ర ఆగమాలు ఈ యాగం వల్ల అతివృష్టి, అనావృష్టి, దుర్భిక్ష, మహావ్యాధి పీడ వంటి సర్వోపద్రవాలు తొలగుతాయని చెబుతున్నాయి. అంతేకాక ఉత్తరాయణ పుణ్యకాలంలో, మేష, తులాసంక్రమణాల్లో పుష్పయాగం చేయడం సంప్రదాయం.

తిరుమల శాసనాలలో 1146 నాటి కోయిల్‌కళ్వి ఎంబెరుమానార్ జియ్యర్ పుష్పయాగ ప్రసక్తి చేసింది. అలాగే 1495, 1496 కందాడై రామానుజయ్యంగార్ శాసనాల్లోనూ, అలాగే మరెందరో ఈ పుష్పయాగప్రశంసలు చేశారు. పూర్వం బ్రహ్మోత్సవంలో ధ్వజారోహణం జరిగిన ఏడవనాడు తిరుమలేశునికి పుష్పయాగం జరిగేది.

మూర్తిత్రయంలోని విష్ణువు సుమమాలధారిగా కనిపిస్తాడు. ఎల్లప్పుడు వాడిపోని పూలతో విరాజిల్లే వైజయంతి వనమాలను సాక్షాత్తు శ్రీహరి కంఠార్పితం చేసింది పాలకడలిలో ఆవిర్భవించిన వెంటనే శ్రీమహాలక్ష్మి. శ్రీకృష్ణావతారంలో కుబ్జ పుష్పచందనాదులతో అర్చించిన సామాన్యస్త్రీ. నారదుడు శ్రీకృష్ణునికి పారిజాతం ఇచ్చి తన భక్తిని ప్రదర్శించాడు. అర్జునుడు సమర సమయంలో భీషణప్రతిజ్ఞచేసి శ్రీకృష్ణుని మెడలో పూలమాల వేసి విజయుడయ్యాడు.

శ్రీవేంకటాచలమాహాత్మ్యంలో కురువరతి నంబి మట్టిపూలతో అర్చించినట్లు, స్వామి వారు తొండమాన్ అర్పించే సువర్ణపద్మ సుమాల అర్చనకంటే కుమ్మరివాని మట్టి పూలపూజకు సంతసించినట్లు పురాణాలు











చెబుతున్నాయి. సాధారణ గృహపూజలో కూడా పుష్పాలకు ప్రాధాన్యం. ఇలాంటి పూలకంటే అహింసాది పుష్పసమర్పణ మేలని ధర్మశాస్త్రాలు కీర్తించాయి.

పదకవితాపితామహుడైన అన్నమయ్య పూలసేవలను ఆధ్యాత్మికం గాను, మధురభక్తి పూర్వకంగాను వర్ణించాడు. అన్నమయ్య ఆలయకవి కనుక ఈ పుష్పయాగాన్ని **"సకల లోకేశ్వరుడు సరుస జేకొనువాడు. అకలంకముగా బుష్పయాగంబు" (3-20)** కీర్తనలో వర్ణించాడు.

శతాబ్దాలపాటు ఎంతో వైభవంగా కొనసాగిన శ్రీపుష్పయాగానికి శ్రీవారి దేవాలయంలో ఏ కారణంచేతో దశాబ్దాల పూర్వమే అంతరాయం ఏర్పడింది. కాని తి.తి.దే. 1980 నవంబర్ 14 నుంచి ప్రతి సంవత్సరం కార్తికమాసం శ్రవణనక్షత్రంరోజున ఘనంగా నిర్వహిస్తోంది. అప్పటినుంచి నిరంతరాయంగా ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాల అనంతరం వచ్చే శ్రీనివాసుని అవతారనక్షత్రమైన శ్రవణంరోజున వేంకటరమణ కల్యాణ మండపంలో కొనసాగుతోంది.

శ్రీమలయప్పస్వామివారు నిత్యసేవలు ముగించుకుని, యాగశాలలో ఋత్విక్కులు శ్రీవిష్ణుగాయత్రి మహామంత్రాన్ని ఉచ్చరిస్తూ అగ్నిప్రతిష్ఠ చేసే వేళ పాల్గొంటారు. 108సార్లు బిల్వదళాలతో హోమం చేస్తారు. పుష్పాధి పతిని ఆవాహనం చేసి 12 పర్యాయాలు యాగం చేస్తారు. శ్రీదేవి భూదేవి సమేత మలయప్ప కంకణధారణ చేసుకుని, హోమతిలకాన్ని పెట్టుకుని స్నపనతిరుమంజనాన్ని అందుకుంటారు. ఇందులో అర్ఘ్యపాద్యాచమనాలతో, ఆవుపాలతో, శుద్ధోదకంతో సేవించబడతారు. తరువాత ధూప, దీప, కర్పూర నీరాజనాలనిచ్చి ఆ తరువాత పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపునీళ్లతో అభిషేకం చేసి చందనాన్ని అలది, తులసిమాలికలతో అలంకరించి నక్షత్ర హారతిని అందుకుంటారు. తరువాత సహస్రధార అభిషేకం జరుగుతుంటే పంచసూక్తాలు, నీరాట్టపాశురాలు పఠనం చేస్తారు. తరువాత శ్రీవారిని, దేవురులను అలంకరించి పెద్దశేషవాహనంలో వేంచేపుచేస్తారు.

కొండలరాయుని అఖండపూర్ణతను, ఆద్యంతరహితత్వాన్ని, ఆపదు ద్ధారకత్వాన్ని, ఆర్తరక్షకత్వాన్ని, పురుషోత్తమత్వాన్ని, విశ్వాత్మకత్వాన్ని తెలిపే మంత్రోచ్చారణలతో పుష్పారాధన పాదాల నుండి ఆకంఠపర్యంతం జరుగు తుంది. ఇలా 20మార్లు రంగురంగుపూలతో, తులసితో పుష్పారాధన కనుల పండువుగా చేస్తారు. శ్రీపుష్పయాగం అనంతరం బంగారు తిరుచ్చిపై రాజ లాంఛనాలతో శ్రీవారు దేవేరులతో ఊరేగి ఆనందనిలయంలోకి ప్రవేశిస్తారు. ఇది ఆర్జితసేవగా తి.తి.దే నిర్వహిస్తోంది. ప్రస్తుతం తిరుమలలోనేగాక తి.తి.దే. ఆధీనంలోని అనేక వైష్ణవాలయాలలో ఈ సేవ జరుగుతోంది.



# స్వామి సైన్యానికి.. అధిపతి

- డా॥ ఈ.ఏ.సింగరాచార్యులు, 98850 03420

**ఈ నెల 7న సేనైమొదలియార్ వర్ష తిరునక్షత్రం సందర్భంగా...**

శ్రీమన్నారాయణుని అంతరంగపరివారంలో ఒకడుగా, ఆ స్వామి సైన్యానికి అధిపతిగా, భక్తుల విఘ్నాలను పోగొట్టే వాడుగా, శ్రీమన్నారాయణుడు ఆరగించిన ప్రసాదశేషాన్ని మాత్రమే ఆహారంగా తీసుకోవడం అనే నియమాన్ని కలిగిన వాడుగా, శేషాశనుడు అనే పదాన్ని తనకు నిరూపకనామంగా కలిగినవాడుగా చెప్పబడే విష్వక్సేనుడు పరమపదంలో ఉండే నిత్యసూరులలో ఒకడుగా కీర్తింపబడుతున్నాడు. ఈ విష్వక్సేనుని అవతారదినం అల్పిశిమాసం (ఆశ్వయుజమాసం) పూర్వాషాఢా నక్షత్రం.

శ్రీవేంకటాచలమహాత్మ్యాంతర్గతమైన శ్రీవేంకటేశ అష్టోత్తర శతనామస్తోత్రంలోని 11వ నామం **"సువర్చలా సుతన్యస్త సేనాపత్యభరః"** అని ఉంది. అంటే, విష్వక్సేనుని అంశతో సువర్చలాదేవియందు కుమారుడై జన్మించినవానికి సర్వసైన్యాధిపత్యాన్ని శ్రీవేంకటేశ్వరుడు అప్పగించాడు అని అర్థం. శ్రీవైష్ణవసంప్రదాయంలో దివ్యసూరులుగా వ్యవహరింపబడే ఆళ్వారులలో ప్రధానులైన నమ్మాళ్వారులు కూడా విష్వక్సేనుల అంశతోనే అవతరించారు.

విష్వక్సేనుడు అంటే, అంతటా సేనలను కలిగినవాడు- అని అర్థం. అతడే భగవంతునకు సర్వసైన్యాధిపతి. లోకరక్షణ భారాన్ని భగవంతుని తరపున నిర్వహించే బాధ్యతను చేపట్టే వాడు. ఈ విషయాన్ని శ్రీయామునాచార్యులవారు స్తోత్రరత్నంలో తెలియజేశారు.

విష్ణ్వాలయాల్లో అంతటా, వార్షికంగా బ్రహ్మోత్సవాలు జరిపేటప్పుడు ప్రారంభంనాడు, విష్వక్సేనుడు తాను ముందుగా తిరువీధులలో సంచరించి, నగరశోధన చేస్తాడు- అనే భావంతో విష్వక్సేనమూర్తికి తిరువీధిఉత్సవాన్ని నిర్వహించడం పరిపాటి.

విష్వక్సేనుడు భగవానుడైన నారాయణుని సేవను నిర్వహించినట్లే, ఆ విష్వక్సేనుని పత్ని అయిన సూత్రవతీదేవి కూడా నారాయణుని పత్ని అయిన లక్ష్మీదేవిని సేవిస్తుంది. ఈ విషయాన్ని శ్రీపరాశరభట్టర్ అనే వైష్ణవాచార్యులు శ్రీరంగ రాజస్తవం- పూర్వశతకంలో తెలియజేశారు.

శ్రీవైష్ణవసంప్రదాయానికి సంబంధించిన గురుపరంపరలో కూడా విష్వక్సేనునకు విలక్షణమైన స్థానం ఉంది. ప్రథమస్థానంలో భగవంతుడైన నారాయణుడు, ద్వితీయ స్థానంలో లక్ష్మీదేవి ఉండగా, తృతీయస్థానంలో విష్వక్సేనుడు ఉన్నాడు. విష్వక్సేనునకు లక్ష్మీదేవియే అష్టాక్షరిద్వయమంత్రాది రహస్యాలను ఉపదేశించినట్లు సంప్రదాయకథనం. లక్ష్మీదేవి ఆదేశాన్ని అనుసరించి విష్వక్సేనుడు భూలోకానికి వచ్చి, నమ్మాళ్వారులకు శంఖచక్రలాంఛనప్రదానాన్ని, మంత్రోపదేశాన్ని చేశాడని సంప్రదాయం. శ్రీవైష్ణవసంప్రదాయానికి చెందిన పాంచరాత్ర, వైఖానస ఆగమగ్రంథాలలో విష్వక్సేనుని స్వరూప స్వభావవర్ణన విశదంగా కనిపిస్తుంది.

108 దివ్యదేశాలు

# తిరుప్పార్థన్‌ప్పళ్లి

- ఆచార్య చక్రవర్తి రంగనాథన్, 94409 19186

తిరునాంగూర్ దివ్యదేశంలో ఎనిమిదవ దివ్యదేశం తిరుప్పార్థన్‌ప్పళ్లి. ఈ దివ్యదేశం తమిళనాడులోని శీర్గాళి నుండి సుమారు 11 కిలోమీటర్ల దూరంలోని రాధావల్లూర్ అనే ఊరిలో ఉంది. ఈ దివ్యదేశం ఒకే ప్రాకారం, రాజగోపురం అర్ధమండపం, మహామండపాలతో శోభిస్తోంది. లోకంలో ఎక్కడా లేనటువంటి వైశిష్ట్యం-శ్రీకృష్ణుడు అర్జునునితో కూడి ప్రత్యేకసన్నిధిలో వేంచేసి ఉండి, అర్జునునికి గీతోపదేశం చేసే విధంగా అమరి ఉండడం ఈ ఆలయం ప్రత్యేకత. ఈ దివ్య దేశాన్ని పార్థసారథి ఆలయం అని కూడా పిలుస్తారు.

ఈ దివ్యదేశం మూలమూర్తి, తామరైయాళ్ కేళ్వన్ అనే పేరుతో శంఖచక్రధారుడై పశ్చిమాభిముఖంగా నిలుచున్న భంగిమలో శ్రీదేవి, భూదేవిసహితుడై భక్తులను అనుగ్రహిస్తు న్నాడు. పార్థసారథిస్వామి సమీపంలో చతుర్భుజాలలో శంఖం, చక్రం, ధనుస్సు, బాణం వీటన్నింటిని ధరించి వేరే ఎక్కడా చూడనటువంటి శ్రీదేవీ, భూదేవి సమేతుడైన శ్రీరామభద్రుడు కోలవిల్లిరామన్ అనే దివ్యనామంతో వేంచేసి ఉన్నాడు.

## స్థలపురాణం-1

అర్జునుడు వేటాడుతూ దక్షిణదిక్కును చూస్తూ వస్తున్న సందర్భంలో ఈ దివ్యదేశ సమీపానికి రాగానే ఎక్కువ దప్పిక వేసింది. ఆ సమయంలో అగస్త్యమహర్షిని చూశాడు. దాహంతో ఉన్న అర్జునునికి తన కమండలాన్ని ఇచ్చాడు. చిత్రంగా ఆ కమండలంలో ఒక చుక్క నీరు కూడా లేదు. అప్పుడు అగస్త్యముని శ్రీకృష్ణుణ్ణి ప్రార్థించమని అర్జునుడికి సలహా ఇచ్చాడు. అర్జునుడు తన తప్పు తెలుసుకుని శ్రీకృష్ణుడిని ధ్యానిం చాడు. ఆ క్షణమే నందనందనుడు ప్రత్యక్షమై ఒక ఖడ్గాన్ని అర్జు నునికి ఇచ్చి దాంతో భూమిని గీయమన్నాడు. పార్థుడు అలా చేసేసరికి గంగ పెల్లుబికి ఒక పెద్దనదిలాగా మారింది. పార్థుని దాహం తీరింది. పార్థునికి శ్రీకృష్ణుడు అనుగ్రహించిన దివ్యస్థలం కనుక ఈ దివ్యదేశానికి పార్థన్‌ప్పళ్లి అని పేరు వచ్చింది.

| | | |
|---|---|---|
| భగవంతుడు | : | మూలమూర్తి తామరైయాళ్‌కేళ్వన్ |
| ఉత్సవర్లు | : | పార్థసారథి, కోలవిల్లి రాముడు |
| అమ్మవారు | : | తామరైనాయికి |
| తీర్థం | : | శంఖుసరస్సు, గంగాతీర్థం, ఖడ్గతీర్థం (పుష్కరిణి) |
| విమానం | : | నారాయణ విమానం |
| ప్రత్యక్షం | : | వరుణుడు, ఏకాదశరుద్రులు, అర్జునుడు |
| మంగళాశాసనం | : | తిరుమంగై ఆళ్వార్ |
| ఆగమం | : | పాంచరాత్రం |

## స్థలపురాణం-2

దక్షిణదిశలో దుర్భిక్షమేర్పడగా పరమశివుని ఆజ్ఞతో అగస్త్యమహర్షి తన కమండలంతో దక్షిణదిశకు వచ్చాడు. అప్పుడు కాకిరూపంతో వినాయకుడు వచ్చి అగస్త్యుని కమండలాన్ని బోర్లించగా కావేరీనది పెద్దప్రవాహమై పారింది. అలా ప్రవహించే కావేరిని అనుసరించి వచ్చిన అగస్త్యమహర్షి ఈ పార్థన్‌ప్పళ్ళిక్షేత్రానికి అక్కడి ప్రకృతిని చూచి పరవశించి అక్కడే తపస్సు చేశాడు. ఆ తపస్సు ఫలితంగా దేవేరీ సహితుడైన కోలవిల్లిరామన్ సేవను ప్రసాదిస్తున్నాడని భక్తుల నమ్మకం. అలాగే బ్రహ్మహత్యాదోషంతో పీడింపబడుతున్న వరుణభగవానుడు ఈ దివ్యదేశానికి వచ్చి తపస్సు చేశాడు. అందుకు మెచ్చిన పార్థసారథి వరుణభగవానునికి ప్రత్యక్షమై శాపవిమోచనాన్ని కలిగించాడు.

పార్థన్‌ప్పళ్లిస్వామిని సేవించుకున్నవారికి సమస్తదోషాలు తొలగి పరిపూర్ణంగా భగవదనుగ్రహానికి పాత్రులౌతారు.







# శ్రీశివపూజా విధానం



'కార్తికమాసం' సందర్భంగా శివపూజావిధానం.. 'సప్తగిరి' పాఠకుల కోసం...!!

కార్తికమాసాన్ని మించిన మాసం లేదని శాస్త్రాలు చెబుతున్నాయి. ఇంతటి పవిత్రత, మహత్తు కలిగిన ఈమాసంలో ప్రతిరోజూ శ్రేష్ఠమైంది. అందులోనూ సోమవారం మహాశివుడికి మరింత ప్రీతికరమైన వారం. కార్తిక సోమవారంనాడు చేసే శివపూజ అత్యుత్తమఫలితాలను ఇస్తుంది. ప్రతి ఇంట్లోనూ ఈ మాసంలో మీ మీ ఇష్టదేవతల ఆరాధనతో పాటు శివపూజను కూడా ఆచరించి పరమేశ్వరుడి కరుణాకటాక్షాలను కుటుంబసమేతంగా పొందాలని ఆకాంక్షిస్తున్నాం!

ఆచమ్య- (కేశవాది నామాలతో ఆచమనం చేయాలి). ప్రాణాయామం ఆచరించాలి.

శ్లో॥ శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్ ।
ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వవిఘ్నోపశాంతయే ॥

శ్లో॥ వక్రతుండ మహాకాయ సూర్యకోటి సమప్రభ ।
అవిఘ్నం కురుమేదేవ సర్వకార్యేషు సర్వదా ॥

శ్రీ మహావిష్ణోరాజ్ఞయా ప్రవర్తమానస్య అద్యబ్రహ్మణః ద్వితీయ పరార్థే శ్వేతవరాహ కల్పే వైవస్వత మన్వంతరే కలియుగే ప్రథమపాదే జంబూద్వీపే భరతవర్షే భరతఖండే మేరోః దక్షిణ దిగ్భాగే శ్రీశైలస్య ...... ప్రదేశే గంగాకావేర్యోః మధ్యదేశే సమస్త దేవతా బ్రాహ్మణ హరిహర గురుచరణ సన్నిధౌ అస్మిన్ వర్తమాన వ్యావహారిక చాంద్రమానేన .........నామ సంవత్సరే .......... అయనే ఋతౌ ..........మాసే ...........పక్షే శుభతిథౌ .....వారే శుభనక్షత్రే శుభయోగ శుభకరణ ఏవంగుణ విశేషణ విశిష్టాయాం శుభతిథౌ శ్రీమాన్ ...........నామ ధేయః ......... శ్రీమతః .......గోత్రస్య .......నామధేయస్య ధర్మపత్నీ సమేతస్య మమ ఉపాత్త సమస్త దురితక్షయ ద్వారా సాంబసదా శివముద్దిశ్య సాంబసదాశివప్రీత్యర్థం అస్మాకం సహకుటుంబానాం క్షేమస్థైర్య ధైర్య విజయ ఆయురారోగ్యాభివృద్ధ్యర్థం సమస్త సన్మంగళా వాప్త్యర్థం కల్పోక్త ప్రకారేణ శివపూజాం కరిష్యే.

## గణేశస్మరణ

గజాననం భూతగణాదిసేవితం కపిత్థజంబూఫలచారు భక్షణమ్ ।
ఉమాసుతం శోకవినాశకారకం నమామి విఘ్నేశ్వర పాదపంకజమ్॥

## కుమారస్మరణ

ఉమాకోమలహస్తాబ్జ సంభావితలలాటికమ్।
హిరణ్యకుండలం వందే కుమారం పుష్కరస్రజమ్॥

## లక్ష్మీనారాయణస్మరణ

యజ్ఞేశ అచ్యుతగోవిన్ద మాధవ అనన్త కేశవ।
కృష్ణ విష్ణోహృషీకేశ వాసుదేవ నమోస్తుతే॥

సిద్ధలక్ష్మీః మోక్షలక్ష్మీః జయలక్ష్మీః సరస్వతీ।
శ్రీర్లక్ష్మీర్వరలక్ష్మీశ్చ ప్రసన్నామమ సర్వదా ॥

## నందిస్తుతి

నందికేశ మహాభాగ శివధ్యాన పరాయణ।
మహాదేవస్య పూజార్థం అనుజ్ఞాం దాతుమర్హసి ॥

## వీరభద్రస్మరణ

వీరభద్ర నమస్తేస్తు శివాజ్ఞాను ప్రవర్తక ।
దక్షాధ్వర ధ్వంసకాయ భద్రరూపాయతే నమః
శ్రీ ఉమామహేశ్వరాభ్యాం నమః
శ్రీలక్ష్మి నారాయణాభ్యాం నమః
శ్రీవాణీ హిరణ్యగర్భాభ్యాం నమః
శ్రీశచీపురన్దరాభ్యాం నమః
శ్రీఅరున్ధతీ వసిష్ఠాభ్యాం నమః
శ్రీ సీతారామాభ్యాం నమః
సర్వేభ్యో మహాజనేభ్యో నమః

-------

## ధ్యానం

ధ్యాయామి శంకరం శంభుం నీలగ్రీవం త్రిలోచనమ్।
గంగాధరముమాకాన్తం నిత్యకల్యాణరూపిణమ్ ॥

గోక్షీర ధవళాకారం చన్ద్రబింబ సమాననమ్ ।
భస్మభూషిత సర్వాంగం రుద్రాక్షాభరణాన్వితమ్ ॥

సాంబసదాశివం ధ్యాయామి.

## ఆవాహనం

ఆవాహయామి దేవేశమాదిమధ్యాంత వర్జితమ్ ।
ఆధారం సర్వలోకానాం ఆశ్రితార్తి వినాశనమ్ ॥
సాంబ సదాశివం ఆవాహయామి.

## ఆసనం

ఆసనం గృహ్యతామీశ నిర్మలం స్వర్ణనిర్మితమ్ ।
ఆధారం సర్వజగతా మంధకాసురసూదన ॥
సాంబ సదాశివాయ నమః ఆసనం సమర్పయామి.

## పాద్యం

పాద్యం గృహాణ భగవాన్ పావనం పరమేశ్వర ।
పార్వతీ హృదయానంద! పాపం సర్వం వ్యపోహయ ॥
సాంబసదాశివాయ నమః పాద్యం సమర్పయామి.

## అర్ఘ్యం

అర్ఘ్యం గృహాణ గిరీశ గంధపుష్పాక్షతైర్యుతమ్ ।
అఘమజ్ఞానమఖిలం నీలకంఠ నివారయ ॥
సాంబసదాశివాయ నమః అర్ఘ్యం సమర్పయామి.

## ఆచమనం

గృహాణాచమనార్థాయ గంగాయ సరిదాహృతమ్ ।
విమలం జలమీశాన వ్యాధీన్మే వినివారయ ॥
సాంబసదాశివాయ నమః ఆచమనీయం సమర్పయామి.

## పంచామృతం

పంచామృతం గృహాణేదం పన్నగేశ్వరభూషణ ।
పంచవక్త్ర నమస్తుభ్యం పంచపాపాని నాశయ ॥
సాంబసదాశివాయ నమః పంచామృతం సమర్పయామి.

## స్నానం

గంగాక్లిన్న జటాభార సోమ సోమార్ధశేఖర ।
సహ్యాజాది సరిత్తోయైః స్నానంకురు సదాశివ ॥
సాంబసదాశివాయ నమః స్నానం సమర్పయామి.

*(ఇక్కడ శివుణ్ణి అభిషేకించాలి. అభిషేకించేటప్పుడు 'శివాయ నమః' అనే నామాన్ని స్మరిస్తూంటే చాలు. ఆ నామంతో పాటు "ఈశాన తే తత్పురుష నమో ఘోరాయ తే సదా వామదేవ నమస్తుభ్యం సద్యోజాతాయవై నమః" అనే శ్లోకాన్నీ, "నమశ్శంకరాయ నమశ్శంభవే నమశ్శివాయ నమోభగవతే రుద్రాయ" "నమశ్శివాయ సాంబాయ శాంతాయ పరమాత్మనే" అనే వాక్యాలను పఠించాలి. శివలింగం లేనప్పుడు, జలాల్లో బిల్వదళాన్ని ముంచి, ఆ దళంతో అభిషేకాన్ని భావన చేస్తూ శివుని పటంపై నీళ్లు జల్లుతూ స్నాన సేవను చేయవచ్చు.)*

## వస్త్రం

గజ చర్మ ధరానన్త గరళాంకిత కంధర ।
దుకూలం గృహ్యతాం దేవ దుర్గతిం మే నివారయ ॥
సాంబసదాశివాయ నమః వస్త్రం సమర్పయామి.

## ఉపవీతం

ఉపవీతం గృహాణేశ పవిత్రం పరమం శుభం ।
ఉమాకాన్త నమస్తుభ్యముత్తమం దేహి మే ఫలమ్ ॥
సాంబసదాశివాయ నమః ఉపవీతం సమర్పయామి.

## ఆభరణం

కుండలాంగద ముఖ్యాని కుండలీశ్వర భూషణ ।
భూషణాని గృహాణేశ భూతి భూషిత విగ్రహ ॥
సాంబసదాశివాయ నమః ఆభరణాని సమర్పయామి.

## గంధం

గంధం కుంకుమ సంయుక్తం మృగనాభిసమన్వితమ్।
మహాదేవ గృహాణేశ మహాపాపవినాశన॥
సాంబసదాశివాయ నమః గంధం సమర్పయామి.

## అక్షతలు

అక్షతానక్షత విభో నక్షత్రేశ విభూషణ ।
శుద్ధ స్ఫటిక సంకాశ స్వామిన్ స్వీకురు శంకర ॥
సాంబసదాశివాయ నమః అక్షతాన్ సమర్పయామి.

## పుష్పం

మల్లికా కుందమందార కమలాదీని శంకర ।
పుష్పాణి బిల్వపత్రాణి గృహాణ కరుణానిధే ॥
సాంబసదాశివాయ నమః పుష్పాణి సమర్పయామి.

## అంగ పూజ

| | | |
|---|---|---|
| పరమాయ నమః | - | పాదౌ పూజయామి, |
| గుణాతీతాయ నమః | - | గుల్ఫౌ పూజయామి, |
| జన్మహీనాయ నమః | - | జానునీ పూజయామి, |
| జగత్పిత్రే నమః | - | జంఘే పూజయామి, |
| ఉమాపతయే నమః | - | ఊరూ పూజయామి, |
| గిరీశాయ నమః | - | గుహ్యం పూజయామి, |
| కరుణాకరాయ నమః | - | కటిం పూజయామి, |
| నానారూపాయ నమః | - | నాభిం పూజయామి, |
| ఉత్తమాయ నమః | - | ఉదరం పూజయామి, |
| వామదేవాయ నమః | - | వక్షం పూజయామి, |
| బహురూపాయ నమః | - | బాహూన్ పూజయామి, |
| హరాయ నమః | - | హస్తౌ పూజయామి, |
| నీలకంఠాయ నమః | - | కంఠం పూజయామి, |
| పంచముఖాయ నమః | - | ముఖం పూజయామి, |
| త్రినేత్రాయ నమః | - | నేత్రాణి పూజయామి, |
| ఫాలనేత్రాయ నమః | - | ఫాలం పూజయామి, |
| శ్రుతిగమ్యాయ నమః | - | శ్రోత్రే పూజయామి, |
| కపర్దినే నమః | - | కపర్దం పూజయామి, |
| శివాయ నమః | - | శిరః పూజయామి, |
| సర్వేశ్వరాయ నమః | - | సర్వాణ్యంగాని పూజయామి॥ |

# శివాష్టోత్తర శతనామాలతో పూజ

ఓం శివాయ నమః
ఓం మహేశ్వరాయ నమః
ఓం శంభవే నమః
ఓం పినాకినే నమః
ఓం శశిశేఖరాయ నమః
ఓం వామదేవాయ నమః
ఓం విరూపాక్షాయ నమః
ఓం కపర్దినే నమః
ఓం నీలలోహితాయ నమః
ఓం శంకరాయ నమః 10

ఓం శూలపాణయే నమః
ఓం ఖట్వాంగినే నమః
ఓం విష్ణువల్లభాయ నమః
ఓం శిపివిష్టాయ నమః
ఓం అంబికానాథాయ నమః
ఓం శ్రీకంఠాయ నమః
ఓం భక్తవత్సలాయ నమః
ఓం భవాయ నమః
ఓం శర్వాయ నమః
ఓం త్రిలోకేశాయ నమః 20

ఓం శితికంఠాయ నమః
ఓం శివాప్రియాయ నమః
ఓం ఉగ్రాయ నమః
ఓం కపాలినే నమః
ఓం కామారయే నమః
ఓం అంధకాసురసూదనాయ నమః
ఓం గంగాధరాయ నమః
ఓం లలాటాక్షాయ నమః
ఓం కాలకాలాయ నమః
ఓం కృపానిధయే నమః 30

ఓం భీమాయ నమః
ఓం పరశుహస్తాయ నమః
ఓం మృగపాణయే నమః
ఓం జటాధరాయ నమః
ఓం కైలాసవాసినే నమః
ఓం కవచినే నమః
ఓం కఠోరాయ నమః
ఓం త్రిపురాంతకాయ నమః
ఓం వృషాంకాయ నమః
ఓం వృషభారూఢాయ నమః 40

ఓం భస్మోద్ధూళితవిగ్రహాయ నమః
ఓం సామప్రియాయ నమః
ఓం స్వరమయాయ నమః
ఓం త్రయీమూర్తయే నమః
ఓం అనీశ్వరాయ నమః
ఓం స్వరజ్ఞాయ నమః
ఓం పరమాత్మనే నమః
ఓం సోమసూర్యాగ్నిలోచనాయ నమః
ఓం హవిషే నమః
ఓం యజ్ఞమయాయ నమః 50

ఓం సోమాయ నమః
ఓం పంచవక్త్రాయ నమః
ఓం సదాశివాయ నమః
ఓం విశ్వేశ్వరాయ నమః
ఓం వీరభద్రాయ నమః
ఓం గణనాథాయ నమః
ఓం ప్రజాపతయే నమః
ఓం హిరణ్యరేతసే నమః
ఓం దుర్ధర్షాయ నమః
ఓం గిరీశాయ నమః 60

ఓం గిరిశాయ నమః
ఓం అనఘాయ నమః
ఓం భుజంగభూషణాయ నమః
ఓం భర్గాయ నమః
ఓం గిరిధన్వినే నమః
ఓం గిరిప్రియాయ నమః
ఓం కృత్తివాససే నమః
ఓం పురారాతయే నమః
ఓం భగవతే నమః
ఓం ప్రమథాధిపాయ నమః 70

ఓం మృత్యుంజయాయ నమః
ఓం సూక్ష్మతనవే నమః
ఓం జగద్వ్యాపినే నమః
ఓం జగద్గురవే నమః
ఓం వ్యోమకేశాయ నమః
ఓం మహాసేనజనకాయ నమః
ఓం చారువిక్రమాయ నమః
ఓం రుద్రాయ నమః
ఓం భూతపతయే నమః
ఓం స్థాణవే నమః 80



ఓం అహిర్బుధ్న్యాయ నమః
ఓం దిగంబరాయ నమః
ఓం అష్టమూర్తయే నమః
ఓం అనేకాత్మనే నమః
ఓం సాత్త్వికాయ నమః
ఓం శుద్ధవిగ్రహాయ నమః
ఓం శాశ్వతాయ నమః
ఓం ఖండపరశవే నమః
ఓం అజాయ నమః
ఓం పాశవిమోచనాయ నమః 90

ఓం మృడాయ నమః
ఓం పశుపతయే నమః
ఓం దేవాయ నమః
ఓం మహాదేవాయ నమః
ఓం అవ్యయాయ నమః
ఓం హరయే నమః
ఓం పూషదంతభిదే నమః
ఓం అవ్యగ్రాయ నమః
ఓం దక్షాధ్వరహరాయ నమః
ఓం హరాయ నమః 100

ఓం భగనేత్రభిదే నమః
ఓం అవ్యక్తాయ నమః
ఓం సహస్రాక్షాయ నమః
ఓం సహస్రపదే నమః
ఓం అపవర్గప్రదాయ నమః
ఓం అనంతాయ నమః
ఓం తారకాయ నమః
ఓం పరమేశ్వరాయ నమః 108

సాంబసదాశివాయనమః
అష్టోత్తర శతనామపూజాం సమర్పయామి!

*(ఇక్కడ బిల్వాష్టకంతో ఒక్కొక్క శ్లోకానికి 'శివాయ నమః' అంటూ బిల్వాన్ని సమర్పించాలి.)*

శర్వాయ క్షితిమూర్తయే నమః
రుద్రాయ అగ్నిమూర్తయే నమః
భీమాయ ఆకాశమూర్తయే నమః
మహాదేవాయ సోమమూర్తయే నమః
భవాయ జలమూర్తయే నమః
ఉగ్రాయ వాయుమూర్తయే నమః
పశుపతయే యజమానమూర్తయే నమః
ఈశానాయ సూర్యమూర్తయే నమః ।

## ధూపం

దశాంగం గుగ్గులోపేతం సుగంధం సుమనోహరం ।
ఆఘ్రేయ స్సర్వదేవానాం ధూపోయం ప్రతిగృహ్యతామ్ ॥
సాంబసదాశివాయ నమః ధూపమాఘ్రాపయామి.

## దీపం

సాజ్యం త్రివర్తిసంయుక్తం వహ్నినాయోజితం మయా ।
గృహాణ మంగళం దీపం త్రైలోక్యతిమిరాపహమ్ ।
సాంబసదాశివాయ నమః । దీపం సమర్పయామి.

## నైవేద్యం

అన్నం చతుర్విధం సూప ఫలభక్ష్య సమన్వితం ।
దధి మధ్వాజ్య సంయుక్తం నైవేద్యం ప్రతిగృహ్యతామ్ ॥
సాంబసదాశివాయ నమః అమృత మహానైవేద్యం సమర్పయామి,
మధ్యే మధ్యే పానీయం సమర్పయామి. ఆచమనీయం సమర్పయామి.

## తాంబూలం

పూగీ ఫలసమాయుక్తం నాగవల్లీ దళైర్యుతం ।
కర్పూర చూర్ణ సంయుక్తం తాంబూలం ప్రతిగృహ్యతామ్ ॥
సాంబసదాశివాయ నమః కర్పూర తాంబూలం సమర్పయామి.

## నీరాజనం

చంద్రాదిత్యౌచ ధరణీచ విద్యుదగ్నిత్వమేవచ ।
త్వమేవ సర్వజ్యోతీంషి భజ నీరాజనం ప్రభో ॥
సాంబసదాశివాయ నమః ఆనందకర్పూర నీరాజనం సమర్పయామి.

## పుష్పాంజలి

మందార నీలోత్పల కుందజాతీ పున్నాగమల్లీ కరవీర పంకజైః
పుష్పాంజలిం బిల్వదలైస్తు దేవ సాంబ! త్వదంఘ్రౌ వినివేశయామి
సాంబసదాశివాయ నమః మంత్రపుష్పాంజలిం సమర్పయామి.

## ప్రదక్షిణ నమస్కారం

యానికానిచ పాపాని జన్మాంతర కృతాని చ ।
తాని తాని వినశ్యంతి ప్రదక్షిణ పదే పదే ॥
సాంబసదాశివాయ నమః ఆత్మప్రదక్షిణ నమస్కారాన్ సమర్పయామి.

## నమస్కారాలు

మహాదేవ నమస్తేస్తు మన్మథారే నమోస్తుతే ।
అమృతేశ నమస్తుభ్యం ఆశ్రితార్థ ప్రదాయినే ॥
సాంబసదాశివాయ నమః నమస్కారాన్ సమర్పయామి.

## ఛత్రచామరం

త్రాహిమాం దేవదేవేశ తరుణేన్దు శిఖామణే ।
ఈప్సితం దేహి మే దేవ దయారాశే నమోస్తుతే ॥
సాంబసదాశివాయ నమః ఛత్రచామర నృత్తగీతం
వాద్యాది సమస్త రాజోపచారాన్ సమర్పయామి.

## ఇదమర్ఘ్యం

పూజాంతే శ్రీరర్ఘ్య ప్రదానం కరిష్యే-
నమః శివాయ సాంబాయ సర్వపాపహరాయ చ ।
శివదేవ మయాదత్తమిదమర్ఘ్యం గృహాణ ప్రభో ॥
సాంబసదాశివాయ నమః ఇదమర్ఘ్యం ఇదమర్ఘ్యం ఇదమర్ఘ్యమ్.

మయాకృతాన్యశేషాని పాపాని నుద శంకర ।
మహాదేవ! మయాదత్తం గృహాణార్ఘ్యం మయా శివ ।
సాంబ సదాశివాయ నమః ఇదమర్ఘ్యం ఇదమర్ఘ్యం ఇదమర్ఘ్యమ్.

వ్యోమకేశ నమస్తుభ్యం సోమాత్మన్ వ్యోమరూపిణే ।
నక్షత్రమాలినే దేవ గృహణార్ఘ్యమిదం ప్రభో ॥
సాంబ సదాశివాయ నమః ఇదమర్ఘ్యం ఇదమర్ఘ్యం ఇదమర్ఘ్యమ్.

అంబికాయై నమస్తుభ్యం నమస్తే దేవి పార్వతి ।
గృహాణార్ఘ్యం మయాదత్తం సుప్రీతావరదాభవ ॥
అంబికాయై నమః । ఇదమర్ఘ్యం ఇదమర్ఘ్యం ఇదమర్ఘ్యమ్.

సుబ్రహ్మణ్య మహాభాగ కార్తికేయ సురోత్తమ ।
గృహాణార్ఘ్యమిదం దత్తం సుప్రీతో వరదోభవ ॥
సుబ్రహ్మణ్యాయ నమః । ఇదమర్ఘ్యం ఇదమర్ఘ్యం ఇదమర్ఘ్యమ్.

నందికేశ మహాభాగ శివధ్యాన పరాయణ ।
గృహణార్ఘ్యమిదం దత్తం నందికేశ నమోస్తుతే ॥
నందికేశాయ నమః ఇదమర్ఘ్యం ఇదమర్ఘ్యం ఇదమర్ఘ్యమ్.

చండికేశాయ నమః... ఇదమర్ఘ్య మిదమర్ఘ్య విదమర్ఘ్యమ్।
అనయా పూజయా అర్ఘ్య ప్రదానేన చ సపరివారః
సాంబశివః ప్రీయతామ్ ॥

కరచరణకృతం వా కర్మవాక్కాయజం వా
శ్రవణ నయనజం వా మానసం వాపరాధమ్ ।
విహితమవిహితం వా సర్వమేతత్ క్షమస్వ
శివశివ కరుణాబ్ధే శ్రీ మహాదేవ శంభో! ॥

( ఈనెల 01వ తేదీన ఆకాశదీప ప్రారంభం... )

# ఆకాశదీప మాహాత్మ్యం

– బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు శర్మ

కార్తికమాసం ఆకాశదీపంతో ప్రారంభమౌతుంది. నిజానికి ఏవి ఆకాశదీపాలు. మీరు, నేను పెట్టక్కరలేదు. ఆకాశదీపాలు వెలిగించినవాడు పరమేశ్వరుడు. సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు ఇవీ ఆకాశదీపాలు.

**మరి కార్తికమాసం ప్రారంభం దేనితో మొదలు?**

ఆకాశదీపంతో ప్రారంభం.

**ఆకాశదీపం ఎక్కడ వెలిగిస్తారు?**

దేవాలయంలో వెలిగిస్తారు. దేవాలయంలో ధ్వజస్తంభానికి తాడుకట్టి ఒక చిన్నపాత్రలో దీపం వెలిగించి, గాలికి నిధనం కాకుండా రంధ్రాలతో ఏర్పాటుచేసి దాన్ని జాగ్రత్తగా శమంతకంగా భగవంతుని నామాలు చెప్తూ, భక్తులందరూ చుట్టూ నిలబడి ఉండగా, ఆ దీపాన్ని పైకెత్తుతారు. ఎవరి శక్తి కొలదీ వాళ్లు తగినట్లుగా వారు కార్తికమాసంలో భక్తులు ఆకాశదీపానికి చమురో, వత్తులో ఇస్తూ ఉంటారు.

**ఆ దీపాన్ని పైకెత్తుతారు ఎందుకని?**

ఆ దీపం ధ్వజస్తంభం మీద ఉండి అంతటా వెలుతురు చిమ్ముతుంది. ధ్వజస్తంభంమీదకి ఏదైనా లాగారు అంటే, పతాకాన్ని ఆరోహణ చేశారు అంటే ఈశ్వరునికి ఉత్సవం అవుతోందని గుర్తు.

ఇంకా కార్తికమాసంలో మనమే ఉత్సవం చేస్తున్నాం. మనకి మనం ఉత్సవం. ఉత్ అంటే తలపైకెత్తడం, తల పైకెత్తి చూశాడు కాబట్టి ఉత్సవం. ఏమిటి తలపైకెత్తి చూడ్డం? నాకు ఉన్న గౌరవం ఏమిటి? ఈ శరీరంలో ఉంటూ నేను చెయ్యగలిగిన అధికారం ఏమిటి? సమస్తభూతాలకు నేనుపకారం చెయ్యగలను కార్తికపౌర్ణమి నాడు. ఇతర ప్రాణులు చెయ్యలేవు. నేనే చెయ్యగలను.

**ఏమిటి చెయ్యగలను?**

దీపం తీసుకెళ్లి ఓ గదిలో పెట్టామనుకోండి కొంత ఫలితం. వీథిలోకి తీసుకొచ్చి దీపం పెట్టామనుకోండి విశేష ఫలితం. అందుకే గుత్తు దీపాలని పెడతారు. ఇంతంత వత్తులు వేసి కట్టకట్టి దీపం వెలిగిస్తారు ఆ రోజున. యథార్థానికి శాస్త్రంలో ఏమి చెప్పారంటే ఆ రోజున చెత్త కూడా వెలిగించాలి. వీథులలో ఉన్న చెత్త కూడా వెలిగించేసేయమన్నారు. కానీ లౌకికాగ్నితో వెలిగించకూడదు. మీ ఇంట దీపం వెలిగించి కార్తికపౌర్ణమినాటి ప్రదోషవేళ, దామోదరమావాహయామి అనిగాని, త్రయంబక మావాహయామి అనిగాని అని, ఆ దీపంతో వెలిగించాలి.



ఈ దీపం పెట్టి ఒక్కసారి ఆకాశం వంక చూసి ఒక శ్లోకం చెప్పాలి.

**"కీటాః పతంగాః మశకాశ్చ వృక్షాః**
**జలే స్థలే... ఫలే యే నివసంతి**
**జీవా దృష్ట్వా ప్రదీపం న చ జన్మభాగినః**
**భవతింత్వ స్వపచాహి విప్రాః॥"**

ఈ శ్లోకం చెప్పి నమస్కారం చెయ్యాలి. ఇప్పుడు మనం నమస్కారం చేస్తే పరమేశ్వరుడు ఎంతో ఆనందాన్ని పొందు తాడు. ఒరేయ్ వీడికి నేను మనుష్యశరీరాన్నిస్తే వీడు ఇన్ని భూతాలలో ఉన్న విభూతులను వాడుకున్నాడు. ఇన్నిటిని వాడుకున్నందుకు ఇవాళ వీడు ప్రత్యుపకారం చేశాడు. ఈ ఉపకారబుద్ధి, కృతజ్ఞత ఉన్నవాడు కాబట్టి నా మాట నమ్మి ఉపకారం చేశాడు. కాబట్టి వీడికి నేను మళ్లీ మనుష్యశరీరం ఇవ్వవచ్చు. ఈమాట చెప్పినపుడు 'కీటాః పతంగాః మశకాశ్చ వృక్షాః' కీటకాలుంటాయి. చిన్న చిన్న పురుగులు. అవి ఎందుకు పుడతాయంటే దీపంలో పడి చచ్చిపోవటానికి పుడతాయి. వాటి వల్ల ఏమైనా ఉపయోగం ఉంటుందా అంటే మనకు ఉండదు. బల్లుల కుంటుంది. పురుగులను పట్టి తింటాయి. ఇతర భూతా లకు ఆహారమైపోతాయి. అథవా వాటి ఆయుర్దాయం దేనివల్ల నశించిపోతుందంటే దీపం వల్ల నశించిపోతుంది. ఆ దీపం యొక్క జ్యోతిమీద కొంచెంగా పడిపోతాయి. కింద పడిపోయి వాటి రెక్కలు ఊడిపోతాయి. అటువంటి దీపపు పురుగులు దీపం మీద పడి కాలిపోవడం చచ్చిపోవడమే తప్ప అభ్యున్నతి పొందింది లేదు. ఆ దీపం వల్లే అని తెలిస్తే కదూ! పైగా దీపంలో ఎక్కువగా పడిపోతే దీపం నిధనమైన పాపం వస్తుంది వాటికి తప్ప, దీపం వల్ల ప్రయోజనం పొందలేదు అని ఇవాళ ఈశ్వరా నేను ఒక సంకల్పం చెప్తున్నాను, ఈ దీపం దీపంకాదు, ఇది త్రయంబకుడు, ఇది దామోదరుడు, కాబట్టి దీనివలన మొదటి ఫలితమెవరికి వెళ్ళాలంటే కీటాః పతంగాః మశకాశ్చ, కీటకాలు: పురుగులు, పతంగాలు, మశకాశ్చ: దోమలు, వృక్షాః అవి ఎంతో ఉపకారం చేస్తాయి. కాయలిస్తాయి, పళ్లు ఇస్తాయి, ఆకులిస్తాయి, కొమ్మలిస్తాయి, రెమ్మలిస్తాయి, కలపనిస్తాయి, ఇళ్లు కట్టుకుంటాం. ఇన్ని చేస్తాం. కానీ ఎండలో అది నిలబడి మనకు నీడనిస్తుంది తప్ప దాని జన్మాంతరంలో అది మాత్రం ఎక్కడికీ వెళ్లలేదు. అలాగే ఉండాలి. ఒక ఆవు వచ్చి దాని కొమ్మలు కొరుక్కు తినేస్తున్నా, ఒక ధూర్తుడు వచ్చి కొమ్మ విరిచేస్తున్నా, ఏవో ప్రాణులొచ్చి దానిమీదకెక్కి అలజడి చేసేసి కొమ్మలన్నీ వొంచేస్తున్నా, గొడ్డలి పెట్టి తనను నరికేస్తున్నా, ఒక్క అడుగు ఇలా తీసి, అలా వెయ్యలేని దైన్యం చెట్టుది. అదలాగే నిలబడు తుంది. ఆ చెట్టు ఎలా అభ్యున్నతిని పొందుతుంది. కదలలే నపుడు, కర్మలేనపుడు, దానికి కర్మాధికారం ఏది? అది సంపా దించుకోలేదు.

కాబట్టి "ఈశ్వరా! నీ దీపపు వెలుతురు ఆ చెట్టుమీద పడుతోంది. కాబట్టి దామోదరుడి చెయ్యి దానిమీద పడినట్టే! త్రయంబకుని చెయ్యి దానిమీద పడినట్టే! అది అభ్యున్నతిని పొందాలి".

నీటిలో ఉండే చేపలుంటాయి, కప్పలుంటాయి, తాబేళ్లుంటాయి. ఈ దీపపు వెలుతురు నీటిమీద పడ్డప్పుడు, నీటిలోపల ఉన్నటువంటి ప్రాణులన్నీ కూడా నీ అనుగ్రహాన్ని పొందాలి. అక్కడితో సరిపోతుందా? ఇదికాదు. జలే స్థలే నివసంతి జీవాః దృష్ట్వా ప్రదీపం న చ జన్మభాగినః. వాటికేం తెలియదు. అవేం పుణ్యం చేయలేదు. కానీ, ఈ వెలుతురు వాటిమీద పడిన కారణంచేత ఇక వాటికి జన్మ లేకుండుగాక! అక్కడితో వాటికున్నటువంటి పాపపుణ్యాలన్నీ కూడా నశించి పోవుగాక! అని భవతింత్వ స్వపచాహి విప్రాః అసలు వేదంమీద నమ్మకం లేకుండా కేవలం ప్రాపంచిక కర్మాచరణం మాత్రమే చేస్తూ ఈ లోకంలో తిరుగుతూ కేవలం ఉదరపోషణార్థమే బ్రతుకుతున్న భయంకరమైన స్థితిలో ఉండిపోయిన వాడిమీద ఈ దీపం కాంతి ప్రసరించిన కారణంచేత వాడుకూడా వచ్చే జన్మలో వేదప్రమాణం తెలుసుకున్నవాడై స్వరంతో వేదాన్ని చదువుకుని వేదాన్ని ప్రచారం చేసి వేదానికి చేతులడ్డుపెట్టి లోకోద్ధరణ చెయ్యగలిగిన నిస్వార్థపూరితమైన లోకోపకారార్థిగా జన్మించి అభ్యున్నతిని పొందుగాక! ఈ దీపపుకాంతి అంత గొప్పది.

కాబట్టి ఈశ్వరా, నీయందు త్రయంబకుణ్ణి, దామో దరుణ్ణి ఆవాహన చేసి ఈ దీపపు వెలుతురు నీయందు ప్రస రించేటట్లు చేస్తున్నాను. అందుకే కార్తికపౌర్ణమినాడు అన్నిచోట్లా దీపాలెత్తుతారు. ఇక దీపమెత్తని ప్రదేశముండదు.

కార్తికపౌర్ణమినాడు సాయంకాలం ఉపన్యాసం చెప్తే ఎవరూ ఉండరు. చెప్పకూడదు. ఎందుకంటే కార్తికపౌర్ణమి అంటే ప్రతీవాళ్లూ ఇళ్లలో చేసుకోవాలి.

# శ్రీ భూ నీళాసమేత కరియమాణిక్యస్వామి ఆలయం, నగరి

- డా॥ నొస్సం నరసింహాచార్య, 90528 44442

మన దేవాలయాలు

తిరుపతి నుండి పుత్తూరు మీదుగా 49 కి.మీ. దూరంలోని నగరి అనే ప్రాంతంలో శ్రీ శ్రీదేవి భూదేవి సమేత కరియమాణిక్య స్వామి ఆలయం ఉంది.

మొసలిబారిన బడ్డ గజేంద్రుని ప్రార్థనను మన్నించి శ్రీమహావిష్ణుమూర్తి గరుత్మంతునిపై విచ్చేసి సుదర్శనచక్రంతో మొసలి శిరస్సును ఖండించి గజేంద్రునికి మోక్షాన్ని ప్రసాదించాడు. ఈ ఇతివృత్తానికి నిదర్శనంగా స్వామి శ్రీకరియమాణిక్యస్వామిగా ఈ క్షేత్రంలో వెలిశాడని స్థలపురాణం.

## చారిత్రక నేపథ్యం

నగరి శ్రీ కరియమాణిక్యస్వామి ఆలయాన్ని సాళువరాజులు నిర్మించినట్లు చారిత్రక ఆధారాలద్వారా తెలుస్తున్నది. ఆ తరువాత కాలంలో కార్వేటినగరరాజులు ఈ ఆలయ పరిరక్షణ బాధ్యతలు స్వీకరించారు. 1894లో ఆలయ ప్రధాన ద్వారానికి తలుపులు నిర్మించినట్లు వాటిపై చెక్కబడి ఉన్నాయి. 1903లో కార్వేటినగర రాజుల పక్షాన 60గ్రామాలకు నియమించిన పాలెగాళ్ళలో సుప్రసిద్ధుడైన విజయప్పనాయనింవారు కరియమాణిక్యస్వామివారి ఆలయంలో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించినట్లు ధ్వజస్తంభంపై గల రాగిపలకపై వ్రాయబడినది. తదుపరి తిరుమల తిరుపతి దేవస్థానం మహంతులకాలంలో ఈ ఆలయపర్యవేక్షణ కొన సాగింది. తదుపరి కొంతకాలం తి.తి.దే. పర్యవేక్షణనుండి ఈ ఆలయం వేరు చేయబడింది. భక్తుల కోరిక మేరకు 1994వ సంవత్సరంలో శ్రీకరియమాణిక్య స్వామిఆలయం తిరిగి తి.తి.దే పర్యవేక్షణలోనికి తీసుకురాబడింది. ధ్వజస్తంభం ప్రతిష్ఠించి 100సం॥లు పూర్తవడంతో 2003లో నూతనధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు.

పూర్వం కార్వేటినగరం నుండి కరియమాణిక్యస్వామి ఆలయానికి సొరంగమార్గం ఉండేది. ఈ మార్గం ద్వారానే కార్వేటినగరరాజులు వచ్చి స్వామివారిని దర్శించుకొని సేవించుకునేవారని, పూజాసామగ్రిని కూడా రాజకోటనుండి ఈ మార్గంలోనే ఆలయానికి చేరవేసేవారని తెలుస్తున్నది. స్వామి వారి ఆలయం ప్రక్కనే ఉన్న కరియమాణిక్యాంబ ఆలయం వెనుకనుండి ఈ సొరంగమార్గం ఉండేదని కాలక్రమేణ ఆ మార్గం పూడిపోవడంతో తి.తి.దే. వారే ఆ సొరంగమార్గాన్ని పూర్తిగా మూసివేసినట్లు స్థానికులు చెబుతారు.

## ఆలయనిర్మాణం

శ్రీకరియమాణిక్యస్వామి ఆలయం నగరిపట్టణంలో తూర్పున ముఖ ద్వారంతో ఉంది. దాదాపు 135అడుగుల పొడవు, 105అడుగుల వెడల్పుతో 3అంతస్తులుగల 50అడుగుల రాజగోపురంతో ఈ ఆలయం నిర్మితమై ఉంది. రాజగోపురాన్ని దాటి ఆలయంలో ప్రవేశించగానే మహాప్రాకారంలో ముఖమండపం, అంతరాళం, గర్భాలయాలతో ప్రధానాలయం కనిపిస్తుంది. మహాప్రాకారంలో ప్రధానాలయానికి నైరుతిభాగంలో మహాలక్ష్మి అమ్మవారు



కరియమాణిక్యాంబ పేరుతో వెలిసి ఉన్నారు. వాయువ్యభాగంలో ఆండాళ్ అమ్మవారు కొలువుదీరి ఉన్నారు. ఆగ్నేయభాగంలో శ్రీవారికి ప్రసాదాలు తయారుచేసే పోటు ఉన్నది. అందులో పోటుతయారుగా వకుళమాలికాదేవి విరాజమానమై ఉన్నారు. దక్షిణాన రామానుజుల సన్నిధి ఉండగా, గర్భాలయానికి ఎదురుగా గరుడాళ్వార్లు నిలుచున్న భంగిమలో దర్శనమిస్తారు.

ప్రధానాలయం ఎదురుగా భక్తాంజనేయస్వామివారు కొలువై ఉన్నారు. చిన్నపిల్లలు, అనారోగ్యంతో ఉన్నవారు, ఈ ఆంజనేయస్వామిని సేవిస్తే వారికి ఆరోగ్యం కలుగుతుంది. హనుమంతుడు విద్యకు అధిదేవుడు కనుక ఈ ఆంజనేయ స్వామిని సేవించిన వారికి మంచి విద్య ప్రాప్తిస్తుంది.

కరియమాణిక్యస్వామి ఆలయానికి మహామండపం, అంతరాళం, గర్భాలయాలను సుందరంగా నిర్మించారు. మహామండపం దాటగానే జయవిజయులు ద్వారపాలకులుగా ప్రవేశంగల అంతరాళమండపం, ప్రక్కనే చిరు అరుగుపై ఆళ్వారుల విగ్రహాలు కనిపిస్తాయి.

గర్భాలయమధ్యలో మూలవిరాట్టు శ్రీదేవి భూదేవి సమేత కరియమాణిక్యస్వామివారు తిరుమలలో స్వామివారినిపోలి చతుర్భుజాలతో ఇరుగడల శంఖచక్రాలను ధరించి, అభయ, కటి హస్తాలతో దర్శనమిస్తారు.

ఇక్కడ స్వామివారితోపాటు భోగమూర్తి, ఉత్సవ మూర్తులైన శ్రీదేవి భూదేవి సమేత కరియమాణిక్యస్వామివారు, నవనీత కృష్ణస్వామివారు, గోదాదేవి విష్వక్సేనస్వామి, సుదర్శన చక్రత్తాళ్వారుల పంచలోహవిగ్రహాలు కనిపిస్తాయి.

స్వామివారి ఆలయానికి ఒకవైపు శ్రీమహాలక్ష్మీదేవి, కరియమాణిక్యస్వామివారి పట్టపురాణి కరియమాణిక్యాంబదేవి అమ్మవారుగా ప్రత్యేకాలయంలో దర్శనమిస్తారు. మరోవైపు గోదాదేవి ఆలయం కూడా ఉన్నది.

## ఉత్సవవిశేషాలు

శ్రీకరియమాణిక్యస్వామి ఆలయాన్ని 1994లో అప్పటి ధర్మాధికారులు తి.తి.దే.కు అప్పగించారు. తి.తి.దే. వారు ఈ ఆలయాన్ని సర్వాంగసుందరంగా తీర్చి అనేక ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. శ్రీకరియమాణిక్యస్వామివారి ఆలయంలో వైఖానస ఆగమోక్తంగా పూజాదికాలు నిర్వహిస్తారు. ఈ ఆలయంలో నిత్యోత్సవాలు, పక్షోత్సవాలు, మాసోత్సవాలు, వార్షికోత్సవాలతో పాటు మరికొన్ని ప్రధాన ఉత్సవాలు కూడా ఉంటాయి. వీటిలో కార్తికమాసంలో జరిగే పవిత్రోత్సవాలు ప్రధానమైనవి.

శ్రీకరియమాణిక్యస్వామివారి ఆలయంలో కార్తిక దీపోత్సవం విశేషంగా జరుగుతుంది. చివరినాడైన కార్తిక పౌర్ణమినాడు భక్తులు అసంఖ్యాకంగాపాల్గొని దీపోత్సవాన్ని నిర్వహిస్తారు.

కరియమాణిక్యస్వామి అంటే కోరిన వరాలు తీర్చే కొంగుబంగారంగా ఈ ప్రాంతవాసులు భావిస్తారు. నగరిలో వెలిసిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కరియమాణిక్యస్వామివారి ఆలయం వివిధ ఉత్సవాలతో నిత్య కల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతూ ఉంటుంది.



ఇక్కడి స్వామి కరివరదుడు. గజేంద్రుని మకరి బారి నుండి రక్షించేందుకు వచ్చినవాడు. ఇక్కడ మొసలి సంసారానికి ప్రతీక కాగా, గజేంద్రుడు జీవునికి ప్రతీక. అంటే ఈ స్వామివారిని దర్శించి సేవిస్తే సంసారసాగరం నుండి సునాయాసంగా బయటపడవేస్తాడు. అభయహస్తుడు కనుక కోరినకోర్కెలను తీరుస్తాడు.

# తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలలో ఆవిష్కృతమైన తి.తి.దే. ప్రచురణలు (తెలుగు)



**శ్రీమద్భాగవతం - వైజ్ఞానిక విశ్లేషణ**

రచయిత:
ప్రొ॥ ఘనకోట వేంకటేశ్వరరావు,
సైజు: 1/4 క్రౌన్, వెల: రూ.780/-



**శ్రీమదొంటిమిట్ట కోదండరామ మాహాత్మ్యం**

రచయిత:
శ్రీ వావిలికొలను సుబ్బారావు,
సైజు: 1/8 డెమ్మీ, వెల: రూ.120/-



**పురాణాలు - పరిశీలనాంశాలు**

రచయిత:
డా॥ చిర్రావూరి శివరామకృష్ణ శర్మ,
సైజు: 1/8 డెమ్మీ, వెల: రూ.60/-



**రాయలసీమలోని ప్రసిద్ధ దేవాలయాలు**

రచయిత:
శ్రీ పి.కృష్ణమూర్తి,
సైజు: 1/8 డెమ్మీ, వెల: రూ. 200/-



**భగవదారాధన విధానము**

రచయిత:
శ్రీ వావిలికొలను సుబ్బారావు,
సైజు: 1/8 డెమ్మీ, వెల: రూ.110/-



**వాసుదాస కీర్తనలు**

రచయిత:
శ్రీ వాసుదాసస్వామి,
సైజు: 1/8 డెమ్మీ, వెల: రూ.150/-



**శ్రీ భాగవతము - ప్రశ్నావళి**

రచయిత:
మారెళ్ళ వెంకటశేషారెడ్డి,
సైజు: 1/8 డెమ్మీ, వెల: రూ.480/-



**శివమహాపురాణం (తృతీయభాగం)**

రచయిత:
డా॥బేతవోలు రామబ్రహ్మం,
సైజు: ఎ4, వెల: రూ.530/-



**హైందవ సంస్కృతి - వైజ్ఞానికత**

రచయిత:
డా॥కప్పగంతుల రామకృష్ణ,
సైజు: 1/8 డెమ్మీ, వెల: రూ.60/-



**శివమహాపురాణం (చతుర్థభాగం)**

రచయిత:
డా॥ఆకెళ్ళ విభీషణశర్మ,
సైజు: ఎ4, వెల: రూ.600/-

ఇతర వివరాలకు: టి.టి.డి.సేల్స్‌వింగ్ ఆఫ్ పబ్లికేషన్స్, తి.తి.దే. ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి-517 501 ఫోన్-0877-2264209

# మహిమాన్విత పర్వదినం
# క్షీరాబ్ధి ద్వాదశి

- డా॥ మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి

**శివ, కేశవులిద్దరికీ ప్రీతిపాత్రమైన కార్తికమాసంలో అత్యంత విశేషమైన ఫలితాలనిచ్చే పర్వదినం క్షీరాబ్ధిద్వాదశి. కార్తికశుక్లద్వాదశిని క్షీరాబ్ధిద్వాదశిగా నిర్వహించుకుంటారు. క్షీర సాగర మథనం ముగిసిన రోజిది. వాడుక భాషలో మథించడం అంటే చిలకడం కాబట్టి చిలుకు ద్వాదశి అనే పేరు కూడా వ్యాప్తిలోకి వచ్చింది. ఆనాడే తులసీ దామోదరపూజ నిర్వహి స్తారు. క్షీరాబ్ధిద్వాదశి మహిమ అపారం.**

కార్తికమాసంలో శుక్లపక్షంలో వచ్చే ద్వాదశి క్షీరాబ్ధి ద్వాదశి. శివుడికి ప్రీతిపాత్రమైన కార్తికమాసంలో విష్ణువును పూజించే విశిష్టమైన ఈ పర్వదినం శివకేశవుల అభేదాన్ని చాటుతోంది. ఆషాడశుద్ధ ఏకాదశినాడు యోగనిద్ర ప్రారం భించిన శ్రీమహావిష్ణువు నాలుగుమాసాల తర్వాత కార్తిక శుద్ధ ఏకాదశినాడు మేల్కొని, ఆ మరునాడు మహర్షులకు, దేవతలకు దర్శనమిచ్చాడు. తన మామగారి ఇల్లయిన పాలకడలి నుండి శ్రీహరి అందరికీ దర్శనమిచ్చే ఆ పర్వదినమే క్షీరాబ్ధిద్వాదశిగా ప్రసిద్ధికెక్కింది. దేవతలు, దానవులు అమృతం కోసం ఆనాడే పాలసముద్రాన్ని మథించారని, కనుక ఈ పండగను మథన ద్వాదశి అని, చిలికిన రోజు కాబట్టి చిలుకు ద్వాదశి అని, పాలసముద్రపు చినుకులు ఆ మథిస్తున్నవారిపై పడతాయి కనుక కొందరుచినుకు ద్వాదశి అని కూడా అంటారు.

క్షీరసాగరంలో నుంచి ఆనాడు లక్ష్మీదేవి ఆవిర్భవిం చింది. అనాడే లక్ష్మీనారాయణుల కల్యాణం చేసే ఆచారం కూడా కొన్ని ప్రాంతాల్లో ఉంది. వివాహానంతరం లక్ష్మీ సమేతుడై-శ్రీమహావిష్ణువు బృందావనానికి వెళ్లాడని కొందరి విశ్వాసం. పరమపవిత్రమైన ఈ పర్వదినాన్ని పావనద్వాదశి అని, బృందావనద్వాదశి అని కూడా అంటారు. చాతుర్మాస్య దీక్షను విరమించిన యోగులందరూ విష్ణుమూర్తిని అర్చించే పర్వం కనుక యోగద్వాదశి అనే పేరు కూడా వాడుకలో ఉంది. గోవత్స ద్వాదశి, విభూతి ద్వాదశి, నీరాజన ద్వాదశి మొదలైన ఎన్నో పేర్లు వ్యవహారంలో ఉన్నాయి. ఆనాడు సాయంత్రం గోపూజ చేసి శ్రీహరికరుణను విభూతిరూపంలో అందుకునే ఆచారం కూడా ఉంది.

### యోగద్వాదశి

పాలసముద్రం అంటే నక్షత్ర మండలంలోని పాలపుంత అని అర్థం. మనకక్కడ కాంతిసముద్రంగా కనిపించే కోట్లాది నక్షత్రాలే టెలిస్కోపులో పాలపుంతగా కనిపిస్తాయని ఈనాటి విజ్ఞానశాస్త్రం చెబుతోంది. సూర్యుడు ఈ పాల పుంతలో నుంచి ప్రయాణిస్తూ వృశ్చికరాశిని దాటే సమయం



ఈనెల 13న క్షీరాబ్ధి ద్వాదశి సందర్భంగా...

ఇది. సరైన సాధన సాగించినవారికి ఆత్మసాక్షాత్కారం పొందేందుకు అనువైన కాలమిది. ఆత్మను మేల్కొలుపుకోవడమే క్షీర సాగరంలో మేల్కొన్న విష్ణుమూర్తిని దర్శించడం. ఏకాదశినాటి ఉపవాసంతో విష్ణుమూర్తిని ఆరాధించాలి. ద్వాదశినాడు విష్ణు స్వరూపునిగా అతిథిని అర్చించి సత్కరించాలి. ద్వాదశినాటి సాయంత్రం లక్ష్మీకల్యాణం జరిగే సమయంలో ముత్తైదువలను పసుపుకుంకుమలు, చందనాదులతో సత్కరించి వారి దీవెనలు పొంది మాంగల్యసిద్ధిని పొందుతారని కూడా వ్రతరత్నాకరం వివరిస్తోంది. మహాభక్తుడైన అంబరీషుని కథ క్షీరాబ్ధిద్వాదశి నాడే జరిగిందని కొన్ని ప్రాంతాలవారు అభిప్రాయపడుతున్నారు. క్షీరాబ్ధిద్వాదశినాడు అంబరీషుని కథను పారాయణం చేసినవారికి విష్ణులోకం ప్రాప్తిస్తుందని నమ్మకం. స్మరణమాత్రంతోనే ముక్తిని ప్రసాదించే వ్రతం క్షీరాబ్ధివ్రతమని ఈ కథ వల్ల తెలుస్తోంది.

## వ్రతమహిమ

క్షీరాబ్ధివ్రతంలో దీపదానం, తులసి పూజ, విష్ణుదేవుని ఆరాధన ముఖ్యాంశాలు. ఆనాటి సాయంత్రం సూర్యాస్తమయం తర్వాత తులసికోట వద్ద విష్ణుదేవుని, తులసిని పూజించడం, ఉసిరి మొక్కను ఉంచిన తులసి వద్ద దీపాలను వెలిగించడం, దీపదానం చెయ్యడం శ్రీహరికి ప్రీతికరం.

ద్వాదశినాడు అసంకల్పితంగా దీపం వెలిగించినా పాపాలన్నీ ప్రక్షాళన అవుతాయని, పుణ్యం కలిగి వైకుంఠప్రాప్తికి అర్హత లభిస్తుందని క్షీరాబ్ధివ్రత విధానం తెలియజేస్తోంది. క్షీరాబ్ధి ద్వాదశినాడు దీపం వెలిగించినా, ఎవరో వెలిగించిన దీపాన్ని పూజించినా, దీపదానం చేసినా విశేష ఫలితం లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. మహారాష్ట్రప్రాంతంలో ద్వాదశినాడు తులసికి, విష్ణుమూర్తికి కల్యాణం చేస్తారు. ఇదే ఆచారం కొద్ది మార్పులతో ఆంధ్రలో కూడా కనిపిస్తుంది.

## తులసిపూజ

క్షీరాబ్ధిద్వాదశినాడు తులసిపూజకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ప్రేమకు, భక్తికి ప్రతీక తులసి. దుర్గంధాలను తొలగించి దోమలు మొదలైన రోగకారకక్రిములను నిర్మూలిస్తుంది. తులసి ఆకుల రసం రోగాలను నిరోధిస్తుంది. ప్రతి నిత్యం మహిళలు శాంతిసౌభాగ్యాలను ఆకాంక్షిస్తూ తులసి కోటలో నీరు పోస్తారు. సంధ్యాసమయంలో అక్కడ దీపం వెలిగించి కుంకుమతో,



పుష్పాలతో తులసిని అర్చిస్తారు. తులసి లక్ష్మీదేవి అవతారమని, పుణ్యప్రదమైందని భారతీయుల విశ్వాసం. శివాలయంకానీ, విష్ణ్వాలయంకానీ లేని ఊళ్లలో కార్తికమాసంలో ముఖ్యంగా ద్వాదశినాడు తులసి కోట వద్ద ఒక బలమైన, పొడవైన కర్రపాతి ఆకాశదీపం పెట్టి దైవానుగ్రహం పొందవచ్చునని శాస్త్రాలు వివరించాయి.

ఆలయంలో అర్చకులు తులసిదళం వేసిన తీర్థాన్ని భక్తులకు ఇస్తారు. తులసి పూసలమాల జపమాలగా ఉపయోగ పడుతుంది. క్షీరాబ్ధిద్వాదశినాడు తులసిపూజ నిర్వహించిన ఇంటికి రావడానికి యమదూతలు కూడా జంకుతారని కొందరు ప్రతిపాదించారు. తన భక్తుడైన ఉద్ధవుడితో ఓసారి శ్రీకృష్ణుడు తనకు ప్రీతిపాత్రమైన నివాసస్థానం తులసి అని తెలియజేశాడు. భౌతికంగా ఆరోగ్యాన్ని, కుటుంబపరంగా సదాచారాన్ని, ఆధ్యాత్మికంగా జ్ఞానాన్ని ప్రసాదిస్తూ అందరూ తరించే మార్గాన్ని సూచించే మహత్తర పర్వదినం క్షీరాబ్ధిద్వాదశి.

ఈ నెల 9న
పిళ్లైలోకాచార్యులు
వర్ష తిరునక్షత్రం సందర్భంగా...

# ప్రపత్తిమార్గ ప్రబోధకులు

- శ్రీ వైద్యం వేంకటేశ్వరాచార్యులు,
99896 79681

ప్రపత్తిమార్గాన్ని ప్రధానంగా అనుసరించి ప్రబోధనలు కావించిన మహానుభావులు పిళ్లైలోకాచార్యులవారు.

**తిరునక్షత్ర తనియన్**

శ్లో॥ తులాయాం శ్రవణే జాతం, లోకార్య మహమాత్రయే! ।
శ్రీకృష్ణపాదతనయం, తత్పదాంబుజసంశ్రితమ్! ॥

**నిత్య తనియన్**

శ్లో॥ లోకాచార్యాయ గురవే, కృష్ణపాదస్య సూనవే!
సంసారభోగ సందష్ట, జీవ జీవాతవే నమః ॥

లోకాచార్యుల ఆచార్యుల వారి పేరు కూడ లోకాచార్యులే. కనుక వీరి ఆచార్యుల పేరును ప్రథమలోకాచార్య సంబిళ్లై అని వ్యవహరించారు. వీరిని ద్వితీయలోకాచార్యులు అని కూడా పేర్కొన్నారు.

**వీరి గృహారాధన దేవతామూర్తులు:** ఉభయనాచ్చియార్ సహిత, గరుడ పీఠసహిత, శ్రీరంగరాజర్.

లోకాచార్యులవారికి సర్వజ్ఞభట్టర్, ఉభయవేదాన్త నిర్వాహకర్ అని బిరుదాలు. వీరి గురువర్యులు పెరియవాచ్చాన్ పిళ్లై, కాగా ఆచార్యులు ప్రథమలోకాచార్య నంబిళ్లై. వీరు ఆజన్మ బ్రహ్మచారి. బాల్యంలోనే సకలశాస్త్రపారంగతులయ్యారు. శ్రీరంగంలో సర్వవిధ కైంకర్యనిర్వహణ చేస్తూ రామానుజదర్శన ప్రవర్తకులుగ ఉన్నారు.

**వీరు రచించిన రహస్యగ్రంథాలు 18 (ఇవన్నీ ముద్రితాలే) ఇవి:**

అర్చిరాది, అర్థపంచకం, తత్త్వత్రయం, తత్త్వశేఖరం, తనిచరమం, తనిద్వయం, తని ప్రణవం, నవరత్నమాలై, నవవిధ సంబంధం, పరందపడి, ప్రపన్న పరిత్రాణం, ప్రమేయశేఖరం, ముముక్షుప్పడి, యాదృచ్ఛికప్పడి, శ్రియఃపతిప్పడి, శ్రీవచన భూషణం, సంసారసామ్రాజ్యం, సారసంగ్రహం.

లోకాచార్యులవారు శ్రీరంగేశవింశతిని కూడ రచించారు. వీరు రచించిన యదశైలేశదశకం, మహాలక్ష్మీస్తవం, తత్త్వవివేకం అనే గ్రంథాలు అముద్రితాలు.

ఆచార్యులవారు రచించిన వాదగ్రంథాలు-4, రహస్య గ్రంథాలు-9, స్తోత్రాలు-12, వ్యాఖ్యానాలు-15, లఘుకృతులు, శ్లోకాలు, వార్తలు మొదలైన రచనలు అలభ్యాలు.

లోకాచార్యులవారు విలాంసోలై పిళ్లై అనే శిష్యునితో తిరువనంతపురం వెళ్లి అచట దేవుని సేవించమని శిష్యునికి ఆజ్ఞాపించారు. తాను అర్చిరాది మార్గాన పరమపదానికి వేంచేశారు.

లోకాచార్యులవారు కంచివరదరాజస్వామివారి అపరావతారమని విజ్ఞుల ఉవాచ.

లోకాచార్యులవారు అక్షయ సంవత్సర మిథున జ్యేష్ఠ శుద్ధద్వాదశినాడు పరమపదం వేంచేసినారు.

**మంగళాశాసనం**

శ్లో॥ ప్రణతార్తిహరాంశాయ ప్రకృష్టగుణశాలినే ।
లీలయోద్ధృతలోకాయ లోకార్య గురవే నమః ॥

శ్లో॥ శ్రీమతే జగదార్యాయ. కల్యాణగుణశాలినే ।
శ్రీరంగవాసినే భూయాత్ నిత్యశ్రీ నిత్యమంగళమ్ ॥



# 33 పున్నముల కథ

– డా॥ డి.ఉదయకుమార్,
70134 66957

ఒక బ్రాహ్మణునకు ఒక కూతురుంది. ఆమెకు తండ్రి పెళ్లి చేశాడు. పెళ్లయిన మూడోరోజు ఆమె తన స్నేహితురాలి ఇంటికి పేరంటానికి వెళ్లింది. అంతలో ఆమె భర్త మరణించాడు. ఆమె పేరంటం నుండి తిరిగి వచ్చేదారిలో ఆ ఊరి రాజు గారి భార్య మేడ మీద నిలచి, దారిలోపోతున్న ఈ బ్రాహ్మణ యువతిని చూచి "అమ్మాయీ! నేను ముప్పై మూడు పున్నముల నోము నోచుకున్నాను." అని చెప్పి వాయనమిచ్చింది. ఆ బ్రాహ్మణయువతి ఆ వాయనాన్ని తీసుకుని ఇంటికి వచ్చింది.

అంతకుముందే చనిపోయి ఉన్న ఆ బ్రాహ్మణ యువతి భర్త నిద్రలో నుండి మేల్కొన్నవాడిలాగా బ్రతికి లేచాడు. అప్పుడతని దహనకార్యక్రమాలకు వచ్చిన బంధువులు అది చూచి ఆశ్చర్యపోయి "ఎంత అదృష్టరాలివమ్మా! ఏమి నోము నోచావో గానీ మరణించిన భర్త బ్రతికాడు" అన్నారు. ఆమె "తాను ఏ నోమూ నోచలేదనీ, రాజుగారి భార్య ముప్పై మూడు పున్నముల నోము నోచుకొని ఆ వాయనం తన కిచ్చిందని, ఇదంత వాయనమందుకోవడం వల్ల కలిగిన ఫలిత"మని తెలిపింది. అంతలో ఆమె భర్త ప్రాణాలు తీసుకొని పోవడానికి వచ్చి యమభటులు యముని దగ్గరకు వెళ్లి "ప్రభూ! మీరు చెప్పినట్లుగా వెళ్లి ఆ బ్రాహ్మణయువకుని ప్రాణం తీసుకుని వచ్చునంతలో అతని భార్య వెలుగుతున్న జ్యోతులతో ఉన్న వాయనాన్ని పట్టుకుని వచ్చింది. అది చూచి అతని ప్రాణాలు మా దగ్గర నుంచి పోయి శరీరంలో చేరాయి. వాటిని తీసుకురావడానికి మాకు సాధ్యం కాలేదు. మీరే అందుకు సమర్థులు" అని మనవి చేశారు.



దాంతో యముడే స్వయంగా బయలుదేరి వచ్చి, అతని ప్రాణాలు తీసుకుపోసాగాడు. వాయనమందుకోవడం వల్ల కలిగిన మహత్తు వల్ల ఆ బ్రాహ్మణయువతి యముని వెంటబడింది. కొంతదూరం వెళ్లిన తర్వాత యముడు "అమ్మా! నా వెనకెందుకు వస్తున్నావు?" అని అడిగాడు. అందుకు ఆమె "యమధర్మరాజా! నేను నా భర్త కోసం వస్తున్నానని" బదులు చెప్పింది. "నీ భర్త ప్రాణాలు తప్ప ఏదైనా వరం కోరుకో ఇస్తా" నన్నాడు. యముడు. అది విని ఆమె తను తెచ్చుకున్న ముప్పై మూడు అట్ల వాయనంలో, ఆ అట్లకెన్ని చిల్లులున్నాయో అన్నేండ్లు తనకు ఐదోతనం ఇవ్వాల్సిందని" కోరింది. "అట్లే" అని యముడు వెళుతున్నాడు. కానీ, ఆమె అతన్ని వెంబడిస్తూనే వెళ్లింది. కొంతదూరం వెళ్లిన తర్వాత యమధర్మరాజు ఆమెను చూచి "మళ్లీ నీ వెందుకు వస్తున్నావని" అడిగాడు. ఆమె తన భర్తకోసం వస్తున్నట్లు చెప్పింది. అందుకు అతడు ఆమె భర్త ప్రాణాలు తప్ప మరేమైనా కోరుకోమన్నాడు. ఆమె "స్వామీ! నేను ముప్పై మూడు నల్లపూసల జోళ్లు తెచ్చుకున్నాను. వాటికి ఎన్ని బెజ్జాలు ఉన్నాయో అన్ని వేల ఏండ్లు ఐదోతనమివ్వాలని ప్రార్థించింది. అది విని యముడు చాలా సంతోషించి ఆమె భర్త ప్రాణాలిచ్చి వెళ్లిపోయాడు. ఆమె సంతోషంగా ఇంటికి వెళ్లే లోపల ఆమె భర్త సజీవుడై ఉన్నాడు. చూచిన వారందరూ "వాయనం తీసుకున్న మాత్రానికే ఇంత ఫలమబ్బింది. నోము నోచితే ఇంకెంత ఫలమబ్బుతుందోనని" అనుకున్నారు. ఆచరణలో పెట్టారు. వారంతా కూడా ముప్పై మూడు పున్నములు ఉపవాసముండి తర్వాత వచ్చిన పౌర్ణమి రోజు ఉద్యాపనం చేసి సుఖంగా ఉండసాగారు.

## ఉద్యాపనం

ముప్పై మూడు కన్నులున్న కొత్తజల్లెడలో అట్లు, ఆకులు, వక్కలు, ధనం, నల్లపూసలజోళ్లు, లక్కజోళ్లు, జ్యోతులు– అన్నీ ముప్పై మూడేసి చొప్పున ఉంచి, రవికె గుడ్డ పెట్టి జల్లెడ మూసి ముత్తయిదువుకు వాయనమివ్వాలి!

## శ్రీవేంకటేశ్వరలీలలు



# తలచుకోవాలే గానీ..

- శ్రీ ఆర్.సి.కృష్ణస్వామి రాజు, 93936 62821

స్వామివారి పాదాల చెంతన తిరుపతి నగరంలో స్వంత ఇల్లు కట్టుకోవాలని కలలు కనేవాడిని. అనుకున్నట్లే నిద్ర లేస్తే కంటికి కనిపించే శేషాచలం కొండ దగ్గరగా స్థలంకొన్నాం. ఇంజనీరు పర్యవేక్షణలో ఇంటినిర్మాణం మొదలుపెట్టాం. ఇల్లు పూర్తి అయ్యే రోజులు దగ్గర పడ్డాయి.

బెంగళూరులో ఉన్న మా ఇంటి ఇంజనీరు తిరుపతి వస్తూ వస్తూ మాకు ఫోన్ చేశాడు. "గ్రానైట్‌తో చేసిన చక్కటి తులసికోటలు ఇక్కడ అమ్ముతున్నారు. మీ కొత్త ఇంటికి ఓ తులసికోటను నేను బహుమతిగా ఇవ్వాలని అనుకుంటున్నాను" అని అన్నాడు. చెప్పినట్లే, కారులో దాన్ని తీసుకువచ్చాడు. చక్కని నాణ్యమైన తులసికోటను మాకు అభిమానంతో బహూకరించాడు. పనిలోపనిగా బెంగళూరు నర్సరీల్లో దొరికే మంచి మట్టిని కూడా తీసుకువచ్చాడు.

నా భార్య ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. 'ఇంట్లో తులసికోట పెట్టుకుని, తులసిచెట్టు నాటి, పూజ చేస్తే మన ఇంట్లో లక్ష్మీదేవి కొలువైనట్లే కదా!' అని సంబరపడింది.

ఆ మరుసటిరోజే మాకు 2500 రూపాయల శ్రీస్వామి వారి కల్యాణోత్సవ సేవ ఉంది. ఆ సేవలో భాగంగా అప్పట్లో పదిమంది పాల్గొనే అవకాశం ఉండేది. మా ఇంటిల్లిపాదీ తిరుమలకొండ బయలుదేరాం.

దారిలో నా భార్య "మనం అడగకనే మన ఇంటికి తులసికోట నడుచుకుంటూ వచ్చింది. అందులో మంచి తులసి చెట్టు నాటుదాం. తిరుమల పుణ్యక్షేత్రంలో ఎక్కడైనా తులసి చెట్టు అమ్ముతారేమో ప్రయత్నిద్దాం" అని చెప్పింది.

కొండ దిగిందే తులసిచెట్టు ఎక్కడైనా అమ్ముతారేమో నని వెదికాం. ఎక్కడా అమ్మరని తెలుసుకున్నాం. కొంత సమయం దొరికితే, మేమున్న గది చుట్టూ గాలించాం. అక్కడ కూడా దొరకలేదు. నా భార్య మనసు నొచ్చుకుంది.

"స్వామి మీద భారం వేద్దాం. ఆయన ఇప్పించాలనుకుంటే మన గదికే పంపిస్తాడు" అని నిశ్చయించుకుని కల్యాణోత్సవానికని వైకుంఠద్వారంగుండా ఆనందనిలయంలోకి వెళ్లాం.

సంపంగిప్రదక్షిణమార్గంలో దక్షిణం దిక్కున ఉన్న కల్యాణమండపంలో సేవ పూర్తి చేసుకున్నాం. అర్చకులు తాంబూలంతో పాటు శ్రీవారి కల్యాణాక్షతలను ప్రసాదంగా ఇచ్చారు. వాటిని భక్తిగా స్వీకరించి వస్తూ ఉంటే... దేవస్థానం సిబ్బంది, సేవలో పాల్గొన్న వారందరికీ తలా ఒక తులసి చెట్టు ఇవ్వడం కనిపించింది. చిరునవ్వు ముఖాలతో వెళ్లి నిలుచున్నాం. తులసి చెట్టు అందుకున్న నా భార్య ముఖం వెండి వెన్నెల్లా మెరిసింది. 'తలవాలే కానీ... ఇంటికొచ్చి తలుపు తట్టడా గోవిందుడు...' అనుకుంటూ స్వామివారి దర్శనం చేసుకుని ప్రసాదాలు స్వీకరించి కొండ దిగాం.



# శ్రీహరి సన్నిహితులు!

- డా॥కాకర్ల భూపతినాయుడు, 97040 01353

శ్రీవైష్ణవధర్మాన్ని శ్రీమహావిష్ణువు శ్రీదేవికి ఉపదేశించగా ఆమె దాన్ని విష్వక్సేనుడికి చెప్పింది. గురుపరంపరాగతంగా అది శ్రీరామానుజులకు సంక్రమించి వారి ద్వారా లోకంలో వ్యాపించింది. భగవద్రామానుజులు స్థాపించిన విశిష్టాద్వైత శ్రీవైష్ణవ ధర్మ సంప్రదాయానికి ఆళ్వారుల శ్రీసూక్తులే మూలం. ద్రవిడమైన తమిళభాషలో ఆళ్వారులు సాయించిన నాలాయిరదివ్యప్రబంధానికే "ద్రావిడవేదమ"నిపేరు. ఆనాడు సంస్కృతభాష తప్ప తక్కినవి అన్నీ అవైదికాలే. అలాంటి సంస్కృతంతో సమానంగా ద్రావిడభాష(తమిళం) ఆళ్వారులచే ఆదరింపబడింది. ఆళ్వారులు గానం చేసిన తమిళ దివ్యప్రబంధపారాయణంగల దేవాలయాలే దివ్యస్థలాలనీ, అది లేనివి ప్రాకృతాలనీ ప్రసిద్ధి. ఆళ్వారుల అనుగ్రహం, ఆదరం వల్ల తమిళ దివ్యప్రబంధం వేదం కంటే ఆధిక్యం పొందటంతో దేవాలయాలలో ఉత్సవసమయాలలో వేదపారాయణం భగవంతుడి వెనుక భాగంలో, దివ్యప్రబంధ పారాయణం ముందుభాగంలో ఈనాటికీ జరుగుతోంది.

## దివ్యజ్ఞానులు ఆళ్వారులు

భగవదనుభవంలో లోతుచూచిన వారిని 'ఆళ్వారు' లంటారు. వీరు నిత్యం భగవద్గుణానుభవంలో నిమగ్నులై భగవత్సాక్షాత్కారాన్నీ, బ్రహ్మానందాన్నీ అనుభవిస్తూ నిరంతర భగవదారాధనంలో ఒడలు మరచి ఉంటారు. శ్రీమన్నారాయణుని అంతరంగ కైంకర్యనిర్వాహకులైన నిత్యసూరులు వీరు. "తద్విష్ణోః పరమం పదం సదా పశ్యంతి సూరయః" అని వైదిక సూక్తం ఈ నిత్యసూరులను నిర్వచించింది. సమస్త చేతనోజ్జీవనార్థం వీరు భగవన్నియతిచే భూలోకంలో దక్షిణ భారతదేశంలో అవతరించారు. వీరు 12మంది. వీరిని పన్నిద్దరాళ్వారులు, ద్వాదశసూరులు అంటారు.



## పొయ్గై ఆళ్వారు

వీరిని కాసారయోగి, సరోయోగి అంటారు. కాంచీపురంలో వరదరాజస్వామి ఆలయానికి ముందుభాగంలోగల కమలాకరంలో శ్రీహరి పాంచజన్యాంశంతో వీరు ఉద్భవించారు. దివ్యసూరిచరితంలో చెప్పబడ్డ 'హేమాబ్జినీ హేమ సరోజగర్భాత్" అనే శ్లోకం వీరి అవతార సంబంధియే.

## పూదత్తాళ్వారు



వీరిని భూతయోగి అంటారు. మల్లాపురం (మహాబలిపురం)లో కౌమోదకి అనే శ్రీహరి గద అంశంతో వీరు అవతరించారు. లక్ష్మీదేవి ఆ బాలుని తన హృదయానికి హత్తుకుని సత్త్వగుణమనే పాలు హరిభక్తియనే స్నేహంతో కలిపి పట్టిందట. భూతతతిని సంసారసముద్రం నుండి దాటింపగలవాడు కావటంతో లక్ష్మీనారాయణులతనికి భూతయోగి అని పేరు పెట్టారు.

## పేయాళ్వారు



వీరిని మహదాహ్వయయోగి అంటారు. ఆశ్వయుజమాసం శతభిషానక్షత్రంలో మయూరపురిలో ఒక బావిలో శ్రీహరి నందకాంశతో ఈ ఆళ్వారు అవతరించారు. లక్ష్మీనారాయణులే వీరిని ఆదరించి మహదాహ్వయులని పేరు పెట్టి "పెద్దలకెల్ల పెద్దవై జగతి దీపించెదు తనయ!" అని దీవించారు.

ఈ మువ్వురు ఆళ్వారులను 'ముదలాళ్వారు'లంటారు. శ్రీమన్నారాయణుడు వీరిమధ్య అత్యంత సన్నిహితంగా తిరిగారు. ఈ మువ్వురి తిరునక్షత్రోత్సవాలు నవంబరు 9, 10 తేదీలలో రావడం గమనింపదగ్గ విశేషం. శ్రీహరి సన్నిహితులైన ముదలాళ్వారుల మంగళాశాసనాలు పొంది గోవింద పెరుమాళ్ల దివ్యానుగ్రహపాత్రులై 'ఆత్మవిజయ'పథగాములు కావాలని ఆకాంక్ష!

# అమృతాన్నిచ్చిన ఆయుర్వేద దేవుడు

**ఈ నెల 28న ధన్వంతరి జయంతి**

ఆయన మహావిష్ణువు అంశావతారం. మానవులకు ఆయుర్వేదాన్ని అనుగ్రహించినవాడు. సకల దేవతలు, దైత్యులు కలిసి చేసిన సముద్రమథనంలో చివరిగా అమృతం వెలువడింది. ఆ అమృతకుంభాన్ని తీసుకుని వచ్చిన దివ్య పురుషుడు ధన్వంతరి. ఆయన సముద్రం నుండి వస్తున్నప్పుడు దశదిశలా వెలుగు విరజిమ్మింది. ఆయన సింహం వంటి పరాక్రమశాలి. మహావిష్ణువు ఆయన దగ్గరకు వెళ్లి "నీవు మరుజన్మలో విశేషమైన ఖ్యాతి పొందుతావు. నీవు గర్భంలో ఉండగానే అణిమాది అష్టసిద్ధులు నీకు కలుగుతాయి. సశరీరంగా దైవత్వం లభిస్తుంది. ఆయుర్వేదాన్ని ఎనిమిది భాగాలుగా చేస్తావు. ప్రజలను రోగాలనుండి విముక్తుల్ని చేస్తావు. దీని ఫలితంగా వైశ్వదేవయజ్ఞంలో భాగం వహిస్తావు" అని ఆశీర్వదించాడు. ఆయనే ద్వాపరయుగంలో కాశీరాజు ధన్వుని కుమారుడిగా పుట్టి ఆయుర్వేదదేవుడిగా పేరు పొందిన ధన్వంతరి.

కర్ణాటక రాష్ట్రంలోని మైసూరుకు సమీపంలో సోమనాథపురమనే ఊరులో కేశవాలయం పేరిట త్రికూట దేవాలయం ఉంది. హోయసలరాజులకాలంలో నిర్మించబడ్డ ఆ ఆలయానికి అద్భుత శిల్పకళ అదనపు ఆకర్షణ. ఆ ఆలయం చుట్టూ అలంకరించబడ్డ అనేక వైష్ణవశిల్పాలలో ధన్వంతరి విగ్రహం విశేషమైంది.



సాధారణంగా ధన్వంతరి శిల్పం నిలుచుని ఉండగా ఈ శిల్పం ఆసీనస్థితిలో ఉంటుంది. కుడి చేతిలో అమృతకలశాన్ని, ఎడమచేతిలో ఔషధ మూలికలను కలిగి ఉంటుంది. ఈ ద్విభుజ ధన్వంతరి విగ్రహాన్ని దర్శించి భక్తులు పూజలు చేస్తారు.

శ్రీరంగం తమిళనాడులోని ప్రముఖ వైష్ణవక్షేత్రం. ఇక్కడి రంగనాథస్వామి ఆలయానికి వెనుకవైపు ధన్వంతరిస్వామి ఆలయం ఉంది. గర్భగుడిలోని స్వామివారు నిలుచుని, కుడిచేతిలో అమృత కలశాన్ని, ఎడమచేతిలో ఔషధీమూలికను పట్టుకుని, వెనుక చేతులలో కుడివైపు చక్రాన్ని, ఎడమవైపు శంఖాన్ని ధరించి దర్శనమిస్తాడు. నిత్యపూజ లందుకునే స్వామిని దర్శించడానికి రెండు కళ్లూ సరిపోవు.

ధన్వంతరి స్వామివారిని దర్శించుకుంటే దేహాన్ని బాధించే సాధారణ రోగాలే గాక నయంకాని మొండి జబ్బులనుండి కూడా ఉపశమనం లభిస్తుంది.

– శ్రీ కందుకూరి వేంకట సత్యబ్రహ్మాచార్య,
94914 11090

ఈనెల 9వ తేదీన అత్రి మహర్షి జయంతి

# సప్తర్షిమండలానికే మకుటాయమానుడు

– డా॥ గుమ్మనూరు రమేష్‌బాబు, 98499 15351

వినీలాకాశంలో వినూత్నతేజంతో వెలుగొందే విశిష్ట తారామండలం సప్తర్షిమండలం. ఈ మండలంలోని ఏడు నక్షత్రాలలో మొట్టమొదటిది అత్రిమహర్షి. ఎంతో ప్రకాశవంత మైంది.

అత్రిమహర్షి బ్రహ్మమానసపుత్రుడు. సృష్టిక్రియలో బ్రహ్మకు సహకరించడం అతని ప్రధాన బాధ్యత. ఋగ్వేదంలోని ఐదవ మండలానికి వ్యాఖ్యానకర్త, విధివిధానరూపకర్త అత్రి మహర్షి. ఇతని భార్య కర్దమ ప్రజాపతి కుమార్తె సాధ్వీ అనసూయ. అసూయలేని మహాపతివ్రత అనసూయ. త్రిమూర్తులను పసిపాపలను చేసి ఉయ్యాలలో ఆడించిన ఘనకీర్తి ఈమెకు ఉంది. ఈ త్రిమూర్తుల వరప్రసాదంగా అత్రి, అనసూయలకు చంద్రుడు, దత్తుడు, దుర్వాసుడు పుట్టారు. ఈ ముగ్గురూ లోకకల్యాణకారకులు. ఇందులో చంద్రుడు సోమేశ్వర జ్యోతిర్లింగాన్ని ప్రతిష్ఠించాడు. చంద్రాంశ, దుర్వాస అంశ రెండూ దత్తుని చేరి ఆ దత్తుని సాక్షాత్తూ దత్తభగవానుని చేశాయి.

అత్రిమహర్షి కరుణాకటాక్షాల వల్లనే నేడు సూర్యుడు దేదీప్యమానంగా వెలుగొందగలుగుతున్నాడు. చంద్రుడు తెరిపి వెన్నెలను కురిపించగలుగుతున్నాడు. సతీసుమతి అనే మహా పతివ్రత సూర్యుడు ఉదయిస్తే మాండవ్యమహాముని శాపం కారణంగా తన భర్త మరణిస్తాడని తెలుసుకుని సూర్యుడు ఉదయించరాదని ఆంక్ష విధించింది. దీంతో లోకాలన్నీ తల్లడిల్లి పోయాయి. దేవతలంతా బ్రహ్మదేవునితో మొరపెట్టుకున్నారు. చివరికి అందరూ కలిసి అత్రిమహర్షిని వేడుకొన్నారు. అత్రి బాగా ఆలోచించి, తన భార్య అనసూయతో– "సాధ్వీ! నీవు సుమతిని సమాధానపరచి సూర్యోదయంపై ఉన్న ఆంక్షను



తొలగించు. ఆమె భర్త మాండవ్యమహాముని శాపఫలితంగా మరణిస్తాడు. ఆ తరువాత నీవు సుమతిభర్తకు నీ పాతివ్రత్య శక్తితో ప్రాణదానం చేయి. ఇందువల్ల అందరూ సంతుష్టులౌతారు. లోకమూ సుభిక్షంగా ఉంటుంది." అని అన్నాడు. భర్త ఆజ్ఞను ఆ సాధ్వీమతల్లి తలదాల్చింది. అందరూ సంతోషించారు. సూర్యుడి ప్రయాణమూ కొనసాగింది.

అమృతపానం చేసే సమయంలో సూర్యచంద్రులు అడ్డు వచ్చారన్న ఆగ్రహంతో రాహు, కేతువులు వారి తేజస్సును హరించివేశారు. నిస్తేజులై, నిర్వీర్యులైపోయిన సూర్యచంద్రులు అత్రిమహర్షిని శరణువేడారు. అత్రి తనతో రాహుకేతువులు సూర్యచంద్రులను ఏమీ చేయకుండా కట్టడి చేశాడు. అత్రి మహర్షి అంతటి తపోబలసంపన్నుడు.

అమోఘమైన తపస్సుచేత త్రిమూర్తులను తన ముంగిటికి రప్పించుకోగలిగాడు అత్రి. అతని భార్య అనసూయను పరీక్షించబోయి, భంగపడి, చివరకు ఆ త్రిమూర్తులు పసిపాపలై ఆమె చనుబాలను గ్రోలారు. ఇటువంటి పుణ్యం ప్రపంచంలో మరే మాతృమూర్తికీ దక్కి ఉండదు. ఆ పుణ్య దంపతులకు బిడ్డలుగా జన్మించడం కన్నా మరో పుణ్యకార్యం ఉండదని ఆ త్రిమూర్తులూ భావించి ఉండవచ్చు.

అత్రిమహర్షి సత్యయుగం నాటి వాడే అయినా అన్ని యుగాలలోనూ కానవస్తున్నాడు. త్రేతాయుగంలో అవతార మూర్తి అయిన శ్రీరామచంద్రునికి అతిథ్యమిచ్చాడు. దండ కారణ్యానికి దారి చూపాడు. అనసూయామాత సీతాదేవికి ఎన్నో ధర్మసూక్ష్మాలు తెలిపింది. తన జన్మను చరితార్థం చేసుకుంది.

సూర్యుడు ప్రకాశిస్తున్నంత వరకు చంద్రుడు పసిడి వెన్నెలలను కురిపిస్తున్నంత వరకు అత్రిమహర్షి కీర్తిప్రతిష్ఠలు నిలిచే ఉంటాయి. ఎందుకంటే సూర్యచంద్రులకు పునర్జన్మ ఇచ్చినవాడు అత్రిమహర్షే!

# ఆధునిక న్యాయశాస్త్రానికి పునాది



– డా॥ కప్పగంతు రామకృష్ణ, 90320 44115

అపూర్వతపశ్శక్తితో వేదజ్ఞానాన్ని ఆపోసన పట్టిన మహనీయుడు, విద్యార్థిదశలోనే అనితరసాధ్యమైన తపోబలాన్ని సంపాదించిన తపోమూర్తి, తన విజ్ఞానసర్వస్వాన్ని 'స్మృతి'గా మార్చి అనుగ్రహించిన బోధకుడు, తన స్మృతిలో మహిళలకు ఆస్తిహక్కు ఉందని ప్రస్తావన చేసి, ఊహకు అందని ప్రాచీన కాలంలోనే సమానత్వం, సమన్యాయాలకు అర్థం చెప్పిన ప్రబోధ చైతన్యమూర్తి... యాజ్ఞవల్క్యమహర్షి.

కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసాలకు ప్రతీక ఆయన. జీవితంలో ఎదురయ్యే కష్టాలు, సమస్యలకు ఎదురొడ్డి నిలిచినప్పుడే విజయలక్ష్మి వరిస్తుందనే విషయాన్ని తన జీవిత సందేశంగా అందించాడు యాజ్ఞవల్క్యుడు. మహర్షులలో విలక్షణుడైన యాజ్ఞవల్క్యమహర్షి గురువైన వైశంపాయనుడికి శాపవిమోచనం చేసి, అత్యంతప్రసిద్ధి పొందాడు. ఋషులలో అగ్రగణ్యుడై, నేటి న్యాయశాస్త్రానికి మూలమైన యాజ్ఞవల్క్య స్మృతిని మనకు అందించాడు. సమస్తవిద్యలూ అభ్యసించి, నాలుగువేదాలూ నేర్చుకొని విద్యానిధియై మహాఋషులచేత యోగీంద్ర పట్టాభిషేకం జరిపించుకున్న పరమయోగీశ్వరుడు యాజ్ఞవల్క్యుడు.

## తైత్తిరీయోపనిషత్ ఆవిర్భావం

యాజ్ఞవల్క్యుడు భాష్కలుడి దగ్గర ఋగ్వేదాన్ని, జైమిని మహర్షి దగ్గర సామవేదాన్ని, అరుణి దగ్గర అథర్వణవేదాన్ని నేర్చుకున్నాడు. ఆ తర్వాత యజుర్వేద అభ్యాసం కోసం వైశంపాయనమహర్షి దగ్గర శిష్యరికం చేస్తాడు. ఈ సమయంలో వేదంతోపాటు మరెన్నో విషయాలను గ్రహించాడు. అయితే యాజ్ఞవల్క్యుడికి అహంకారం, విద్యామదంలాంటివి కలిగాయి. ఆ విషయాన్ని గురువు గ్రహించాడు. ఆ అవలక్షణాలు కాలక్రమంలో మెల్లమెల్లగా తగ్గిపోతాయని అనుకున్నాడు ఆ గురువు. అయితే యాజ్ఞవల్క్యుడిలో నానాటికీ విద్యామదం పెరగసాగింది.

అది ఆత్మాభిమానమని యాజ్ఞవల్క్యుడు అనుకున్నాడు. ఓ రోజున వైశంపాయనుడు తన మేనల్లుడు అధర్మమార్గంలో సంచరిస్తున్నాడని తెలుసుకుని కోపం పట్టలేక కాలితో అతడిని తన్నాడు. బ్రాహ్మణుడిని కాలితో తన్నటం బ్రహ్మహత్యతో సమానమని ధర్మశాస్త్రాలు చెప్పిన విషయాన్ని వైశంపాయనుడు కోపం చల్లారిన తర్వాత గుర్తుకు తెచ్చుకున్నాడు. ఇక ఆ పాపాన్ని ఎవరు పోగొడతారా అని మదనపడసాగాడు. ఆ విషయాన్ని గమనించిన యాజ్ఞవల్క్యుడు గురువు దగ్గరకు వెళ్లి ఆ పాపాన్ని పోగొట్టడం తనవల్ల తప్ప మరెవరివల్లా కాదని గర్వంగా అన్నాడు. తనపాపం పోవటం అటుంచి అంతటి కష్టకాలంలోను శిష్యుడు అంత గర్వంగా మాట్లాడటం గురువుకు కోపం తెప్పించింది. ఇక తాను ఎలాంటి విద్యలు అతడికి నేర్పబోనని, అప్పటిదాకా నేర్పినవాటినన్నింటినీ కక్కి (ఏవీ గుర్తుంచుకోకుండా మరిచిపోయి) వెళ్లిపొమ్మని అన్నాడు. గురుద్రోహానికి అదే తగిన శిక్ష అని అన్నాడు.



ఈ నెల 11న యాజ్ఞవల్క్యజయంతి సందర్భంగా...

దీంతో యాజ్ఞవల్క్యుడికి జ్ఞానోదయం అయింది. తాను ఆత్మాభిమానం పేరున గర్వభావాన్ని కలిగివున్నానని తెలుసుకొన్నాడు. క్షమించమని గురువును వేడుకున్నా లాభం లేకపోయింది. తనవంతు బాధ్యతగా యాజ్ఞవల్క్యుడు తన తపోబలంతో గురువుకు సంక్రమించిన బ్రహ్మహత్యాదోషాన్ని పోగొట్టాడు. తాను నేర్చుకొన్న వేదాలను అక్కడే రక్తరూపంలో కక్కి వెళ్లిపోయాడు. అయితే ఎంతో విచిత్రంగా యాజ్ఞవల్క్యుడు విసర్జించినదాన్ని కొన్ని తిత్తిరిపక్షులు గ్రహించాయి. అవి తిరిగి ఆ వేదసారాన్ని పలకసాగాయి. ఆ పలుకులే తైత్తిరీయోపనిషత్తుగా ప్రసిద్ధికెక్కాయి.

గురువు దగ్గర నేర్చుకున్నదంతా అక్కడే వదిలేసిన యాజ్ఞవల్క్యుడు దిగాలుపడి కూర్చోలేదు. ఆత్మస్థైర్యంతో సూర్యభగవానుణ్ణి ఆరాధించి ఆయన కరుణకు పాత్రుడై శుక్ల యజుర్వేదాన్ని నేర్చుకున్నాడు. ఆ తర్వాత సరస్వతీదేవిని ఉపాసించి సమస్తవిద్యలూ అభ్యసించాడు. అలా అందరికన్నా ఉత్తమోత్తమ విద్యాధిపతిగా యాజ్ఞవల్క్యుడు పేరుతెచ్చుకున్నాడు. కణ్వుడు మొదలైనవారు ఆయన దగ్గర శిక్షణ పొంది, ఉత్తమ విద్యావేత్తలుగా, మహర్షులుగా ప్రసిద్ధి పొందారు.

## ఉత్తమోత్తమ గురుస్థానం

ఒకసారి జనకుడు యాగం చేస్తూ మహర్షులందరినీ ఆహ్వానించాడు. యాజ్ఞవల్క్యుడికి కూడా ఆహ్వానం అందింది. మహర్షులందరూ రాగానే, జనకుడు "మీలో ఎవరు గొప్ప విద్యావంతులైతే వారొచ్చి ఇక్కడున్న ధనరాశులను తీసుకు వెళ్లవచ్చు" అని గంభీరంగా అన్నాడు. అయితే ఋషులంతా ఒకరిముఖాలు ఒకరు చూచుకుని తామందుకు అర్హులం కామను కుంటూ ఊరకనే కూర్చున్నారు. యాజ్ఞవల్క్యుడు మాత్రం లేచి తన శిష్యులను పిలిచి ఆ ధనరాశులను తన ఇంటికి తీసుకు వెళ్లమని ఆజ్ఞాపించాడు.

యాజ్ఞవల్క్యుడి ధైర్యాన్ని చూసిన అక్కడివారంతా అతడితో శాస్త్రవిషయాల్లో పోటీకి దిగి యాజ్ఞవల్క్యుడిని అనర్హుడిగా నిరూపించేందుకు ఎన్నోవిధాలుగా ప్రయత్నించారు. కానీ, అవేవీ వారివల్ల కాలేదు. దాంతో జనకుడు ఆ ఋషిని గొప్పగా పూజించి, సత్కరించాడు. తనకు గురువుగా ఉండమని అర్థించాడు. ఈ ప్రార్థనకు అంగీకరించి, జనకునికి యాజ్ఞవల్క్యుడు అనేక ఆధ్యాత్మికవిషయాలను వివరించి చెప్పాడు. యాజ్ఞవల్క్యుడి జీవితంలో ఇలాంటి సంఘటనలు ఎన్నో కనిపిస్తాయి.

ఓరోజున విశ్వావసుడు అనే గంధర్వుడు యాజ్ఞవల్క్యుడి దగ్గరకు వచ్చాడు. తత్త్వాన్ని ఉపదేశించమని అర్థించాడు. అతని కోరికను మన్నించిన యాజ్ఞవల్క్యుడు సమస్తవిజ్ఞానాన్నీ బోధించాడు. విద్యాభ్యాసం ముగిసిన తర్వాత ఆ గంధర్వుడు యాజ్ఞవల్క్యుడంతటి గొప్పవాడు మరొకడు లేడని ఆ మహర్షికి ప్రదక్షిణ నమస్కారాలు చేసి వెళ్లిపోయాడు.

## యాజ్ఞవల్క్యస్మృతి

భారతీయ న్యాయశాస్త్రానికి ఆధారమైన స్మృతి గ్రంథాన్ని భారతీయులకు అందించిన మహామహుడు యాజ్ఞవల్క్యుడు. న్యాయశాస్త్రానికి ఆధారమైన ధర్మసూక్ష్మాలను, ఈనాటి సమాజానికి, న్యాయవ్యవస్థకు ఉపయోగపడేలా ఆయన చేసిన రచన యాజ్ఞవల్క్యస్మృతిగా ప్రసిద్ధి చెందింది.

యాజ్ఞవల్క్యస్మృతిలో లోకవ్యవహారానికి అవసరమయ్యే మెళకువలన్నీ వివరంగా ఉన్నాయి. అనేక వివాదాలను ఎలా పరిష్కరించాలో తెలియజేయడం ద్వారా న్యాయపరిష్కర్తగా నిలిచాడు. యాజ్ఞవల్క్యుడు ఆచార అధ్యాయం, వ్యవహార అధ్యాయం, ప్రాయశ్చిత్త అధ్యాయం అనే మూడు అధ్యాయాలలో సమస్త విషయచర్చతో కూడిన సామాజికవ్యవస్థను ఆవిష్కృతం చేశాడు. ఎన్నోవేలసంవత్సరాల క్రితం సనాతనుడైన మన మహర్షి చేసిన ఉపదేశాలు నేటి ఆధునిక న్యాయశాస్త్రానికి పునాదిగా నిలుస్తున్నాయంటే ఆశ్చర్యం కలగక మానదు.

వృద్ధాప్యం వచ్చాక యాజ్ఞవల్క్యుడు సన్యాసం స్వీకరించాలనుకున్నాడు. ఈ క్రమంలో తన సంపదను తన ఇద్దరు భార్యలకు పంచుదామని భావించి, వారిని పిలిచి "మీకేమి కావాలో కోరుకోండి" అని అడుగుతాడు. మాకు సంపద అక్కరలేదు. జరామృత్యువులు లేని మోక్షమార్గం చెప్పండి అని అడుగుతారు అతని భార్యలు. అప్పుడు యాజ్ఞవల్క్యుడు వారికి ధర్మబోధ చేశాడు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పిఠాపురం, పెందుర్తి, గుంటూరుప్రాంతాల్లో యాజ్ఞవల్క్య దేవాలయాలు కూడా ఉన్నాయి. నేటికీ ఆ మహర్షికి ఆయా దేవాలయాల్లో నిత్యార్చనలు జరుగుతున్నాయి.

బాలనీతి

# పెద్దలమాట వినాలి!

- శ్రీమతి నల్లాని రాజేశ్వరి,
99086 02443

కావేరీతీరంలో ఒక చిన్న గ్రామముండేది. ఆ గ్రామంలో దేవశర్మ అనే బ్రాహ్మణుడుండేవాడు. అతని కొడుకు శివశర్మ. అతడు చిన్న తనంలోనే వ్యసనపరుడయ్యాడు. పూర్తిగా భయభక్తులు లేనివాడ య్యాడు. అతని దుర్గుణాలను చూచి, అతని తండ్రి కుమారుణ్ణి పిలిచి "నాయనా! నీ దురాచారాలకు అంతులేకుండా ఉంది. నీ గురించి ఊర్లో జనాలు నానారకాలుగా చెప్పుకుంటున్నారు. కొడుకుని ఇలాగేనా పెంచడం?" అని నిలదీసి అడుగుతున్నారు. నీవల్ల, నీ చేష్టల వల్ల నేను నలుగురిలో తలెత్తుకుని తిరగలేకపోతున్నాను. కాబట్టి, నీవు కార్తికమాసంలో నదీస్నానంచేసి, శివకేశవుల్ని స్మరించి, సాయంకాలసమయంలో, దేవాలయంలో దీపారాధన చేస్తే, నీ పాపాలన్నీ తొలగడమే కాక నీకు మోక్షప్రాప్తి కూడా కలుగుతుంది. కాబట్టి, అలా చేయి" అని ఉపదేశించాడు. కానీ, శివశర్మ తండ్రి మాటను ఏ మాత్రమూ లక్ష్యపెట్టలేదు సరికదా, ఆ మాటల్ని చాలా తేలికగా తీసుకున్నాడు. "నాన్నా! స్నానం చేయడం శరీరంపై మురికి పోగొట్టుకోవడానికి మాత్రమే కానీ, మరొకందుకు కాదు. స్నానం చేసి పూజలు చేసినంత మాత్రాన భగవంతుడు కన్పిస్తాడా? దేవా లయంలో దీపాలు వెలిగించినంత మాత్రాన ఒనగూరే ప్రయో జనమేమి? వాటిని ఇంట్లోనే పెట్టుకోవడం సబబు కదా!" అని వ్యతిరేకార్థాలతో పెడసరంగా సమాధానమిచ్చాడు.



కొడుకు చెప్పిన సమాధానం విని దేవశర్మ "ఓరీ! నీచుడా! కొడుకువి కదా అని ఇంత నెమ్మదిగా, అనునయంగా చెప్పి చూచాను. పైగా కార్తికమాసఫలాన్ని ఇంత చులకనగా చూస్తున్నావు. ఇంత నిర్లక్ష్యం పనికిరాదు. కాబట్టి నీవు అడవిలో రావిచెట్టు తొఱ్ఱలో ఎలుకరూపంలో బ్రతికెదవుగాక" అని కుమారుణ్ణి శపిం చాడు. ఆ శాపప్రభావంతో శివశర్మకు జ్ఞానోదయమై తండ్రిని శరణు వేడాడు. కొడుకు ప్రార్థనకు కరిగిన తండ్రి "కుమారా! నా శాపాన్ని అనుభవిస్తూ మూషికమై జీవిస్తుండు. నీవెప్పుడు కార్తికమాసమాహా త్మ్యాన్ని వినగలవో అప్పుడే నీకు పూర్వదేహస్థితి కలిగి ముక్తి లభి స్తుంది" అని కుమారుణ్ణి ఊరడించాడు. వెంటనే శివశర్మ ఎలుక రూపాన్ని పొంది అడవికి పోయి, ఒక చెట్టు తొఱ్ఱలో నివసిస్తూ, పండ్లు తింటూ జీవించసాగాడు.

ఆ అడవి కావేరీనదీతీరానికి దగ్గరగా ఉండడం వల్ల స్నానార్థమై నదికి వెళ్లేవారు అక్కడున్న ఆ పెద్ద వటవృక్షం నీడలో కొంతసేపు విశ్రమించి, లోకాభిరామాయణం చర్చించుకుంటూ ఉండేవారు. ఇలా కొంతకాలం తర్వాత కార్తికమాసంలో ఒక రోజు విశ్వామిత్రమహర్షి శిష్యసమేతంగా కావేరీనదిలో స్నానం చేయడానికి బయలుదేరాడు. అలా వెళుతూ మధ్యలో ప్రయాణబడలికతో మూషికం ఉన్న ఆ వటవృక్షం క్రిందకు వచ్చి శిష్యులకు కార్తిక పురాణాన్ని వినిపించసాగాడు. ఈ లోగా చెట్టుతొఱ్ఱలో ఉన్న మూషికం వీళ్ల దగ్గరున్న పూజాద్రవ్యాలలో ఏదైనా తినే వస్తువు దొరుకుతుందేమోనని బైటకు వచ్చి చెట్టు మొదట నక్కి ఉంది. అంతలో ఒక వేటగాడు వీళ్లను చూచి, 'వీళ్ల దగ్గర ధనముంటుం దేమో' ననే దుర్బుద్ధితో దగ్గరకు వచ్చి చూచాడు. చూస్తే ఏముంది? వాళ్లంతా బాటసారులు కాదు మునీశ్వరులని తెలుసుకున్నాడు. వాళ్లను చూడగానే అతని మనస్సు మారిపోయింది. భక్తితో వాళ్లకు నమస్కరించి, "మహానుభావులారా! తమరెవరు? ఎక్కడి నుండి వచ్చారు? మీ దర్శనంతో నా మనసు ఆనందంతో నిండిపోయింది." అని అడిగాడు. అప్పుడు విశ్వామిత్రుడు "మేము కావేరీనదిలో స్నానంచేయడం కోసం ఈ ప్రాంతానికి వచ్చాం. స్నానమాచరించి కార్తికపురాణం పఠిస్తున్నాం. నీవు కూడా ఇక్కడే కూర్చుని శ్రద్ధగా విను" అని చెప్పాడు.

అలా ఆ వేటగాడు కార్తికమాసమాహాత్మ్యాన్ని శ్రద్ధగా వింటుండగా తన వెనుకటి జన్మవృత్తాంతమంతా జ్ఞాపకానికొచ్చి, పురాణశ్రవణం తర్వాత వారికి ప్రణామాలు చేసి తన పల్లెకు పోయాడు. అదేవిధంగా ఆహారంకోసం చెట్టు మొదట దాగి యుండి పురాణమంతా వింటున్న ఎలుక కూడా తన వెనుకటి బ్రాహ్మణ రూపాన్ని పొంది "మునివర్యా! ధన్యోస్మి. తమ దయవల్ల నేను కూడా ఈ మూషికరూపం నుండి విముక్తుడనయ్యా"నని తన వృత్తాంతమంతా చెప్పి వెళ్లిపోయింది. ఇహలోకంలో సిరిసంపదలు, పరలోకంలో మోక్షాన్ని కోరేవారు తప్పకుండా కార్తికపురాణాన్ని చదివి, ఇతరులకు వినిపించాలి.

నవంబరు, 2024

# రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి



**మేషం**– శరీరరుగ్మతలు తొలగి ఆనందం పొందే సమయం. భూమి లేదా గృహం వంటి స్థిరాస్తిని కొనుగోలు చేసే అవకాశం. గృహంలో మగ సంతానానికి అదృష్టం తెచ్చిపెట్టే అమ్మాయితో వివాహం అవుతుంది. బంగారు ఆభరణాల కొనుగోలు, విద్యార్థులు స్వతస్సిద్ధమైన ప్రతిభతో రాణిస్తారు.



**వృషభం**– పై అధికారుల నియంత్రణ, ఉద్యోగస్తులకు పనివత్తిడి వల్ల తోటి ఉద్యోగులతో అభిప్రాయభేదాలు, క్రమశిక్షణారాహిత్యంగా కాలక్షేపం చేయడం, ఇతరులను లెక్కచేయకపోవడం, పట్టుదలకు పోవడంవంటి ఇబ్బందులుంటాయి.



**మిథునం**– కృతజ్ఞతాపూర్వకంగా ఉండటం వల్ల శోభపెరుగుతుంది. ప్రయాణాలు లాభదాయకం. ప్రియమైనవారితో నాణ్యమైన సమయాన్ని గడపడానికి కూడా అవకాశం లభిస్తుంది.



**కర్కాటకం**– పిల్లల విషయాలు సంతృప్తికరంగా ఉంటాయి. పోటీపరీక్షలలో విజయం సాధిస్తారు. గాయాల పాలవడం, వాహన అవరోధాలు కల్గే అవకాశం. భాగస్వామ్య వ్యాపారాలు కలిసిరావు, కుటుంబ సభ్యుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం.



**సింహం**– మీ హోదా మరియు గౌరవం పెరుగుతాయి. స్నేహితులనుండి లాభాలు, వ్యాపారవృద్ధి, శత్రువుల పతనం. ధైర్యం మరియు అదృష్టాన్ని పెంచడం, శుభవార్తలు వింటారు.



**కన్య**– శుభఫలితాలను తెస్తుంది. మంచి ఆరోగ్యాన్ని మరియు మరిన్ని ఆదాయ అవకాశాలను అందిస్తుంది. పెట్టుబడులకు సరైన సమయం. వ్యాపారం లాభదాయకంగా ఉంటుంది. మానసిక బలం కలిగి ఉంటారు.



**తుల**– కుటుంబం ఆనందదాయకంగా ఉంటుంది. మంచి ఆరోగ్యం. ఆధ్యాత్మిక వాతావరణం, బంధుమిత్రులతో సత్సంబంధాలు ఏర్పరచుకుంటారు. సంతానానికి వివాహవిషయాలలో ముందంజ వేస్తారు.



**వృశ్చికం**–కుటుంబంతో ఆనందంగా గడుపుతారు. తలవని తలంపుగా బంధువులు, మీకిష్టమైనవారు కలుస్తారు. సమయోచితంగా మాట్లాడి అందర్నీ కష్టాలనుండి కాపాడతారు.



**ధనుస్సు**–కార్యజయం, ధనాభివృద్ధి, ధనలాభం కల్గుతాయి. పెట్టుబడులు కలసివస్తాయి. ముఖ్యంగా చేనేత వస్త్ర, బట్టల వ్యాపారులకు ఈ సమయంలో అధికలాభాలు. అన్ని వృత్తులవారికి సంతృప్తికరంగా ఉంటుంది.



**మకరం**– సాంఘిక కార్యకలాపాల్లో, ఆధ్యాత్మిక విషయాల్లో పాల్గొంటారు. మీ దాతృత్వాన్ని ప్రదర్శిస్తారు. అనేకరకాలుగా ఆదాయం పెరుగుతుంది. వ్యక్తిగతవిలువ పెరుగుతుంది. పెట్టుబడులు కలిసి వస్తాయి.



**కుంభం**– అన్ని వృత్తుల వారు మంచి ఆదాయాన్ని పొందుతారు. చాలా మానసిక శాంతిని పొంది వ్యతిరేకశక్తులను అధిగమించి విజయాన్ని పొందుతారు.



**మీనం**– విద్యార్థులకు చదువుల్లో పురోగతి, స్వస్థతగా చురుగ్గా ఉంటారు. మానసిక ప్రశాంతత, అదృష్టం, దూరప్రయాణాలు కలిసి రావడం, ప్రభుత్వం నుంచి సబ్సిడీలు ప్రోత్సాహకాలు వస్తాయి. ఆధ్యాత్మికంగా రాణిస్తారు.

చిత్ర కథ

# శాపమే వరం

కథ- డా॥కంపల్లె రవిచంద్రన్
చిత్రాలు- శ్రీ తుంబలి శివాజీ




ఇంతలో ధౌమ్యమహర్షి అక్కడికి వచ్చాడు.
మహర్షికి అభివందనాలు!
ధర్మనందనా! విధి బలీయం. తప్పదు. కనుక జరిగినదానికి దిగులు పడక, విజయవంతంగా అజ్ఞాతవాసాన్ని పూర్తి చేయండి. నాయనా! అర్జునా! మరీ ముఖ్యంగా పాండవధర్మపత్ని పాంచాలీదేవిని జాగ్రత్తగా రక్షించుకొనుము...
అలా- పాండవుల విరాటనగర సమీపానికి వచ్చారు.
అర్జునా! నీ గాండీవం లోకంలో అందరికీ తెలుసు. కనుక ఎవరైనా గమనించి గుర్తుపడితే మన కథ మళ్లీ మొదటికి వస్తుంది. అంచేత మన ఆయుధాల్ని భద్రపరుచు.
అర్జునుడు మనుష్యసంచారం లేని ఒక శ్మశానంలో శమీవృక్షంపై ఆయుధాలను పెట్టి వాటికి శవాకృతి కల్పించాడు.
మహారాజా! నేను సంగీతనృత్యాలలో ఆరితేరినవాడిని. నా పేరు బృహన్నల. మీరు అనుగ్రహిస్తే మీ అంతఃపుర కాంతలకు నాకు వచ్చిన విద్యలను నేర్పగలను.
బృహన్నలా.. నీ ఇష్టప్రకారమే నీవిక్కడ ఉండి మాకుమార్తెకు నృత్యగీతాలు నేర్పించు...
అన్నయ్యా! మన అర్జునుడు ఊర్వశిశాపాన్నే వరంగా మార్చుకుని విజయుడనే పేరు సార్థకం చేసుకున్నాడు...
అవును భీమసేనా! మంచిమాట చెప్పావు. సరే.. నువ్వెళ్లు. ఎవరైనా చూస్తే ప్రమాదం! మనందరికీ శ్రీకృష్ణపరమాత్మ దయవల్ల కష్టాలు తొలగుతాయి.
2

# మీరు సన్నబడాలంటే...

– డా॥చిట్టిభొట్ల మధుసూదనశర్మ, 90007 61390

ఆహారాన్ని అతిగా సేవించటమే బరువు పెరిగేందుకు ప్రధాన కారణం. సమస్యతీవ్రతను బట్టి అధికబరువు, స్థూలకాయం, భారీ స్థూలకాయంగా పిలువబడే ఈ ఒబెసిటి సమస్య ప్రపంచ వ్యాప్తంగా వేధించే అనారోగ్య సమస్య.

అసలు మనం ఎంత బరువుండాలో తెలుసుకోవటానికి ఒక తేలిక పద్ధతి ఉంది. మన ఎత్తుకు సెంటీమీటర్లలో కొలిచి అందులోంచి 100 తీసివేస్తే ఎంత వస్తుందో అంత బరువు ఉండవచ్చు. ఇంతకు మించి బరువు పెరిగేకొద్ది క్రమంగా వివిధ అనారోగ్యసమస్యలు ముసురుకుంటాయి.

మధుమేహం, రక్తపోటు, గుండెజబ్బులు, శ్వాస సమస్యలు, కీళ్లనొప్పులు, వెరకోజ్‌వీన్స్, పిత్తాశయంలో రాళ్లు, సంతానలేమి లాంటి అనేక అనారోగ్యాలు ఊబకాయం వారిని బాగా వేధిస్తాయి. అంతేగాక ఇలాంటి వారికి మెదడు, కిడ్నీ, గుండెలాంటి కీలక అవయవాలతో పాటు శరీరంలోని ప్రతి అవయవం అనారోగ్యానికి గురయ్యే అవకాశాలు మెండుగా ఉంటాయన్న విషయం గమనార్హం.

ఆహార, విహార, ఔషధాల ద్వారా ఈ సమస్య నుంచి బయటపడటం చాలా ఉత్తమం.

శరీరంలో అధికంగా పేరుపోయిన క్రొవ్వు కరిగేందుకు క్రింద పేర్కొన్న గృహ వైద్యవిధానాలు చక్కగా ఉపయోగపడ తాయి. వీటిలో ఏదో ఒకటి వాడుకోవచ్చు.

**01)** 100 గ్రాముల వాముని వేయించి చేసిన చూర్ణంలో 50 గ్రాముల తుంగముస్తల చూర్ణాన్ని కలిపి ఉంచుకుని రోజూ రెండుపూటలా ఆహారం తర్వాత పూటకు అర టీస్పూన్ పొడిని 50 మి.లీ. గోరువెచ్చని నీటిలో కలిపి త్రాగాలి.

**02)** 30 గ్రాముల చొప్పున త్రిఫలచూర్ణం మరియు త్రికటు చూర్ణం, 10 గ్రాముల చొప్పున విడంగ, చిత్రమూలం, తుంగముస్తల చూర్ణాలను కలిపి ఉంచుకుని ఉదయం, రాత్రి ఆహారానికి అరగంటముందు పూటకు 2 గ్రాముల పొడిని తగినంత నువ్వులనూనెతో కలిపి సేవించాలి.

**03)** 25 గ్రాముల తిప్పతీగ చూర్ణాన్ని 75 గ్రాముల త్రిఫల చూర్ణంలో కలిపి ఉంచుకుని రెండు పూటలా ఆహారానికి అరగంట ముందు పూటకు అర టీస్పూను పొడిని తగి నంత తేనెతో సేవించాలి.

**04)** బార్లీగింజలు వేయించి చేసిన చూర్ణం, ఉసిరిక పొడి ఒక్కొక్కటి 75 గ్రాముల చొప్పున కలిపి ఉంచుకుని రెండు పూటలా పూటకు అర టీస్పూన్ చొప్పున 100 మి.లీ. నీటిలో కలిపి సేవించాలి.

**05)** రోజూ రెండుసార్లు ఆహారానికి అరగంట ముందు పూటకు 200మి.లీ. పల్చటి తాజా మజ్జిగలో అర టీస్పూను కరక్కాయ పెచ్చుల పొడి కలిపి సేవిస్తే అధిక ఆకలి తగ్గటమే కాక అధికంగా సంచితమైన క్రొవ్వు కరుగుతుంది.

**06)** రోజూ రాత్రి 60మి.లీ. వేడి నీటిలో 2 గ్రాముల దాల్చిన చెక్క పొడివేసి మూతపెట్టి గోరువెచ్చగా అయ్యాక 5–10 మి.లీ. తేనె కలిపి పడుకునే ముందు సగం, ఉదయం పరగడుపున మిగిలిన సగం తీసుకోవాలి.



**07)** జీలకర్ర, మిరియాలు, దాల్చిన చెక్క, లవంగాల చూర్ణాలను ఒక్కొక్కటి 25 గ్రాముల చొప్పున కలుపుకొని రోజూ ఉదయం పరగడుపున 200 మి.లీ. నీటిలో అర టీస్పూన్ పొడి వేసి 100 మి.లీ. నీరు మిగిలేలా మరగించి చల్లార్చి వడగట్టి త్రాగాలి. ఒంట్లో వేడి చేసినట్లనిపిస్తే పల్చటి మజ్జిగ లేదా కొబ్బరి నీరు త్రాగాలి.

**08)** రోజూ 200 మి.లీ. నీటిలో 4 ఆల్‌బకరా పళ్ళు, 2-5 గ్రాముల ఉలవల పొడి వేసి 100మి.లీ. నీరు మిగిలేలా మరిగించి దించి చల్లార్చి వడగట్టి 5 మి.లీ. తేనె కలిపి సేవిస్తే అధిక క్రొవ్వు కరుగుతుంది.

**09)** రోజూ రెండుసార్లు 200 మి.లీ. నీటిలో మీడియం సైజు దోసకాయ యొక్క ముక్కలు, అరబద్ద నిమ్మరసం వేసి మిక్సీలో బాగా కలియ త్రిప్పి వడగట్టి రెండు చిటికెల వంతున ఉప్పు, మిరియాల పొడి, జీలకర్ర పొడి కలిపి సేవించాలి.

**10)** బియ్యం, గోధుమలు, జొన్నలు, ఉలవలు, బార్లీ, పచ్చపెసలు (ఇవన్నీ కాని, కొన్ని గాని పాతవి లభ్యమయితే మంచిది) రాత్రంతా నీటిలో నానించి ఒకట్రెండు రోజులు ఎండలో బాగా ఎండించి పిండి చేసి రొట్టెలు తయారు చేసుకొని రాత్రి ఆహారంగా సేవిస్తుంటే కూడా అధిక క్రొవ్వు కరిగేందుకు దోహదపడుతుంది.

**నియమాలు**

ప్రొటీన్స్, పీచు, సూక్ష్మపోషకాలు పుష్కలంగా ఉండి కార్బోహైడ్రేట్లు, క్రొవ్వులు తక్కువగా ఉండే ఆహారాన్ని సమయానికి తీసుకోవాలి.

వయస్సు, వృత్తి, శారీరకశ్రమ, వాతావరణ, ఆరోగ్య పరిస్థితులను బట్టి రోజూ 3-5 లీటర్ల నీటిని కొద్దికొద్దిగా సేవిస్తుండాలి.

రాత్రి పెందలాడే తేలికపాటి ప్రకృతి సిద్ధ ఆహారం సేవించాలి.

వారంలో 5, 6 రోజులు వాకింగ్, జాగింగ్, రన్నింగ్, సైక్లింగ్, స్విమ్మింగ్, స్కిప్పింగ్ లాంటి శారీరక వ్యాయామాలు కూడా బరువు తగ్గటంలో ప్రధానపాత్ర వహిస్తాయి.



### భాస్కరశతకం

## పని నెరవేరడమే ప్రధానం

చ. తెలియని కార్య మెల్లఁ గడ। తేర్చుట కొక్కవివేకిఁజేకొనన్
వలయునటైన దిద్దుకొన। వచ్చు బ్రయోజనమాంధ్య మేమియుం
గలుగదు, ఫాలమందు దిల। కంబిడునప్పుడు చేత నద్దమున్
గలిగిన జక్కఁజేసికొను౧। గాదె నరుం డదిచూచి భాస్కరా!

**తాత్పర్యం-**

భాస్కరా! మనకు తెలియని పని ఎదురైనపుడు, ఆ పనికి తెలిసిన వివేకవంతుని సహాయాన్ని తీసికోవాలి. అప్పుడా పనినెరవేరుతుంది. పూర్తి ప్రయోజనం చేకూరుతుంది. నొసట తిలకం దిద్దుకొనేటప్పుడు చేతిలో అద్దం ఉన్నట్లయితే తిలకం చక్కగా కుదురుతుంది.

'నహి సర్వః సర్వం విఖ్యాతి' ప్రతి ఒక్కరికీ అన్ని విషయాలు తెలియవు అని సామెత. జీవితగమనంలో అనేక కర్తవ్యాలు ఎదురునిలుస్తాయి. కొన్నిటి విషయంలో మనకు అవగాహన ఉండకపోవచ్చు. అటువంటి పని ఎదురైనప్పుడు దాని నెరిగిన బుద్ధిమంతుని సహాయాన్ని స్వీకరించాలి. పనిని నెరవేర్చుకొని పూర్తి ప్రయోజనాన్ని పొందాలి.

**వ్యాఖ్య-**

ఇక్కడ పరుల సహాయం తీసుకోవడం న్యూనతగా భావించరాదు. కొందరు 'ఒకరినడిగేదేమిటిలే!' అని ఆ పనిని మానేస్తారు, లేదా ఏదో తమకు తోచినట్లు చేసి అరకొర ప్రయోజనాన్ని పొందగలుగుతారు. ఇది సరి కాదు. 'అమిత్రాదపి సద్వృత్తం' అన్న న్యాయానుసారం పని నెరవేర్చుకునేందుకు పరుల సహాయం తీసుకోవడం వివేకమనిపించుకుంటుంది. పని నెరవేర్చుకుని ప్రయోజనాన్ని పొందగలగడం తెలివిగల పని.

శతకకవి అద్భుతమైన దృష్టాంతంతో ఈ విషయాన్ని సమర్థించాడు. అద్దం సహాయంతో తగిన చోట, తగిన విధంగా తిలకం దిద్దుకోవడం వల్ల ముఖం ఆకర్షణీయంగా ఉంటుంది.

- డా॥ వడ్డేపల్లి శ్రీనివాసరావు

## గణిత పదనిసలు



అ)6 బయట 7 స్తూ కూర్చోకు!

ఆ)లెక్కలు అర్థం కాకుంటే 7 పొస్తుంది.

ఇ)100న రావు ఎలా ఉన్నాడు?

ఈ) గురువులకు 100 నం చేద్దాం!

ఉ) 1/2 టి కాయ బజ్జీలు బాగా రుచిగా ఉంటాయి.

ఊ) ఈ రోజు మా కూర 1/2 టి కాయ వేపుడు.

ఋ) కూరలో కారం తక్కువ 1000.

ౠ) 10 కాలాల పాటు చల్లగా ఉండాలి.

ఎ) చెడువ్యసనాలతో ఆయువు 3 తుంది.

జవాబులు:
అ)ఆరుబయట ఏడుస్తూ కూర్చోకు! ఆ)లెక్కలు అర్థం కాకుంటే ఏడుపొస్తుంది. ఇ) వందనరావు ఎలా ఉన్నాడు?? ఈ)గురువులకు వందనం చేద్దాం! ఉ)అరటికాయ బజ్జీలు బాగా రుచిగా ఉంటాయి. ఊ)ఈ రోజు మా కూర అరటికాయ వేపుడు. ఋ)కూరలో కారం తక్కువ వెయ్యి. ౠ)పదికాలాల పాటు చల్లగా ఉండాలి. ఎ)చెడు వ్యసనాలతో ఆయువు మూడుతుంది.

## రంగులు వేద్దాం..!!



పై చిత్రాన్ని చూసి
రంగులు వేయండి

## ఇలా కూడా పిలవండి!

### ఫలాని - పండ్లు

| | | |
|---|---|---|
| కదలీఫలమ్ | = | అరటిపండు |
| హరిత కదలీఫలమ్ | = | పచ్చరటిపండు |
| అమృతకదలీఫలమ్ | = | చక్రకేళిపండు |
| దాడిమమ్ | = | దానిమ్మ |
| పనసమ్ | = | పనస |
| ఆమ్రమ్ | = | మామిడిపండు |
| జంబూఫలమ్ | = | నేరేడు |
| బీజపూరః | = | జామి |
| మధుకర్కటీఫలమ్ | = | బొప్పాయిపండు |
| సీతాఫలమ్ | = | సీతాఫలం |
| నారంగమ్ | = | నారింజ, బత్తాయి |
| ద్రాక్షా | = | ద్రాక్ష |
| వాతామఫలమ్ | = | బాదంపండు |
| భల్లాతకీఫలమ్ | = | జీడిమామిడి |
| ఖర్జూరమ్ | = | ఖర్జూరం |
| పిండఖర్జూరమ్ | = | ముంతఖర్జూరం |
| మ్లానద్రాక్షా | = | ఎండుద్రాక్ష |
| మాతులుంగమ్ | = | మాదీఫలం |
| బదరీఫలమ్ | = | రేగుపండు |
| భేరీఫలమ్ | = | భేరీకాయ (గంగరేగుకాయ) |



# క్విజ్ 28

01) సోమనాథపురం ఎక్కడుంది? జ)..................

02) శ్రీవారి సైన్యాధ్యక్షుడు? జ)..................

03) శివశర్మ తండ్రి? జ)..................

04) కార్తికంలో వచ్చే 11వ రోజును ఏమని పిలుస్తారు? జ)..................

05) అంబరీషునికథను ఏ రోజున పారాయణం చేస్తారు? జ)..................

06) శ్రీరంగేశవింశతి ఎవరి రచన? జ)..................

07) అసూయలేని సాధ్వి? జ)..................

08) సూర్యచంద్రుల తేజస్సును హరించినవారు? జ)..................

09) సోమేశ్వరలింగాన్ని ప్రతిష్ఠించింది ఎవరు? జ)..................

10) అమ్మవారి సరోవరం? జ)..................

11) సరోయోగి ఎవరు? జ)..................

12) ద్రావిడవేదమని దేనినంటారు? జ)..................

13) శ్రీకృష్ణుడిని పుష్ప, చందనాదులతో అర్చించిన స్త్రీ? జ)..................

14) శ్రీనివాసుని అవతారనక్షత్రం? జ)..................

15) శ్రీరంగరాజస్తవం రచించిన వారు? జ)..................

## నియమ నిబంధనలు

01) పదిహేనేళ్లలోపు బాలబాలికలు మాత్రమే ఈ 'క్విజ్'లో పాల్గొనాలి.

02) ఇందులో పాల్గొనే పిల్లలు తప్పనిసరిగా హిందువులై ఉండాలి.

03) నిర్దేశించినస్థలంలోనే జవాబులు వ్రాసి పంపాలి. క్విజ్ సమాధానపత్రం జిరాక్సుప్రతులు పంపేటట్లు అయితే, చందా నమోదుసంఖ్య తప్పనిసరి.

04) సమాధానాల్లో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు.

05) జవాబులు చేరాల్సిన చివరితేది 25-11-2024.

06) ఈ క్విజ్‌లో అన్ని సమాధానాలు సరిగ్గా వ్రాసిన బాలబాలికల పేర్లను వచ్చేతదుపరినెల సప్తగిరిమాసపత్రికలో ప్రచురిస్తాం.

07) తి.తి.దే. ప్రధానసంపాదకులవారి కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులపిల్లలు ఈ క్విజ్‌పోటీలో పాల్గొనకూడదు.

08) క్విజ్‌కి సంబంధించి ఏ సమాచారమూ ఫోన్‌ద్వారా ఇవ్వబడదు.

09) ఈ క్విజ్‌లో పాల్గొనే పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా సప్తగిరి మాసపత్రిక చందాదారులై ఉండాలి. క్విజ్ సమాధాన పత్రంలో ఈ క్రిందివివరాలు స్పష్టంగా వ్రాసి పంపాలి.

10) జవాబులను బాల్‌పెన్నుతో మాత్రమే వ్రాసిపంపాలి. పెన్సిల్, స్కెచ్, జెల్‌పెన్నులతో వ్రాయకూడదు.

11) ఈ ప్రశ్నలకు జవాబులు ఈ సంచికలోని వ్యాసాల్లోనే ఉన్నాయి. వెతికి వ్రాయండి.

చందాసంఖ్య: .................. వయస్సు: ..........

పాఠశాల: .................. తరగతి: ..........

పేరు: ..................

చిరునామా: ..................

..................

..................

.................. పిన్‌కోడ్: ..........

ఫోన్ సంఖ్య: ..................

### జవాబులు చేరాల్సిన చిరునామా

ప్రధాన సంపాదకులు, 'సప్తగిరి' మాసపత్రిక, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, కె.టి.రోడ్డు, తిరుపతి-517 507, తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి



# సప్తగిరి

(ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక)

## చందా నమోదు పత్రం

**1.** పేరు మరియు చిరునామా :
(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

(పిన్‌కోడ్ తప్పనిసరి)

సెల్ నెం.

**2.** కావలసినభాష :
తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐
హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం ☐

**3.** సంవత్సరచందా : ☐ రూ.240/-
జీవితచందా ☐ రూ.2400/- (12 సం॥రాలు)

**4.** విదేశాలకు సంవత్సరచందా : ☐ రూ.1030/-

**5.** చందా పునరుద్ధరణ :
(అ) చందానెంబరు :
(ఆ) భాష :

**6.** చెల్లించిన మొత్తం :
డి.డి.నెం. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్ మాత్రమే :
.................................................... తేది : ..................

ప్రదేశం :
తేది : చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.240/-, జీవితచందా(12 సం॥రాలు) రూ.2400/-లు, విదేశాలకు సంవత్సర చందా రూ.1030/-; డి.డి. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ లను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి' మ్యాగజైన్, తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.
2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులోగానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప- మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.
3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.
4) మా చిరునామా "ప్రధాన సంపాదకులు, సప్తగిరి కార్యాలయం, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".
5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# వైకుంఠపాళి 106



నిర్వహణ: శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు, 90003 24024

**అడ్డం** 1)దశరథుని కుమారుడు(4); 3)సీతాదేవి కుమారులు(4); 7)ఆభరణం(2); 8)క్రూరమృగాలున్న ప్రదేశం(3); 9)ఆయుధవిశేషం(2); 12)ఈ మునికి ధృతరాష్ట్రుడు అనేక గోవులనిచ్చెను(3); 13)చ్యవనుని కుమారుడు(3); 17)సంతోషం(2); 18)జనకుని రాజధాని(3); 19)అడవి(2); 22)రాక్షసులు(4) 23) దక్షిణ సముద్రంపై ఆకాశమార్గంలో వెళ్లే హనుమంతునికి ఆతిథ్యమీయడానికి వచ్చినవాడు(4)

**నిలువు** 1)అడవిని దహించే అగ్ని(4); 2)యుద్ధం(2); 4)చంపుట(2); 5)పరీక్షిన్మహారాజు వేటకు వెళ్లినపుడు ఈ మహర్షిని దాహంతీర్చమని అడిగెను(4); 6)భరతుని భార్య(3) 10)దల్భుని పుత్రుడు(3); 11)ప్రాంశువు కుమారుడు(3); 14)విష్ణువు(4); 15)మిథిలానగర చక్రవర్తి కుమార్తె(3); 16)జానకి తండ్రి(4); 20)పదకొండు అణాల ఎత్తుగల బంగారపు నాణెం(2); 21)పల్లకిని ఇలా అనేవారు(2)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.
- ప్రధాన సంపాదకుడు



Printed by Sri P.Ramaraju, M.A., and Published by Dr. K.Radharamana, M.A., M.Phil., Ph.D., on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.

04-10-2024 నుండి 12-10-2024 వరకు జరిగిన సాలకట్ల బ్రహ్మోత్సవాలలో శ్రీవారు తిరువీధులలో వివిధ వాహనాలలో ఊరేగి అనంత భక్తకోటిని కటాక్షించారు. ఈ బ్రహ్మోత్సవాలలో తిరుమల తిరుపతి దేవస్థానం భక్తులకు సమస్తసౌకర్యాలు కల్పించింది. ప్రపంచం నలుమూలల నుండి వచ్చిన భక్తులతో, తి.తి.దే. ఏర్పాటు చేసిన వివిధ కళాబృందాలతో తిరుమల కొండ గోవిందనామాలతో ప్రతిధ్వనించింది. ఆ నిశ్చలఛాయాచిత్రాలు సప్తగిరి పాఠకుల కోసం...











SAPTHAGIRI (TELUGU) SPIRITUAL ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthnams
Printing on 25-10-2024 and Posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under
RNI No.21139/1970. Postal Regd. No.TRP/155/2024-2026 "LICENCED TO POST WITHOUT PREPAYMENT
No.PMGK/RNP/WPP-04(1)/2024-2026" Posting on 5th of Every Month.




నగరి,
శ్రీకరియమాణిక్యస్వామివారి పవిత్రోత్సవాలు
(14-11-2024 నుండి 15-11-2024 వరకు)

నాహం మే తనురక్షణాయ భగవన్! త్వాం ప్రార్థయే, కింత్విదం
పద్మం తే పదయోః సమర్పితుమితి ప్రాహార్తచిత్తేన యః,
తం సంత్రాతు ముపాగతో గజవరం వేగాద్దివోఽయం హరిః
పాయాన్నో నగరీపురీ "కరియమాణిక్యా"ఖ్యకః సంతతమ్.